ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY




శుక్రవారం 03 అక్టోబర్ 2026 | Friday 02 octobar 2026 | హైదరాబాద్ Hyderabad | ➩ పేజీలు: 12+12 | ➩ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 168 | Vol.No 28 Issue No .168 | www.visionandhra.in

## మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ కేంద్రం కొనుగోలు చేయాలి

- ప్రకటించిన మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా కేంద్రం చిత్తశుద్ధి చూపించాలి
- కరువు మండలాల ప్రతిపాదనలకు అవసరమైన సమాచారాన్ని అందించాలి
- వర్షాభావ పరిస్థితులపై రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకోవాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



హైదరాబాద్, అక్టోబర్ 01 : రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాలను గుర్తించి, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని మండలం యూనిట్‌గా కరువు మండలాల ప్రతిపాదనలకు డిపార్ట్ మెంట్ సేకరించిన సమాచారాన్ని వారికి అందచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కేంద్ర వ్యవసాయ శాఖ రూపొందించిన కరువు నిర్వహణ మార్గదర్శకాల ప్రకారం కేవలం వర్షపాతం లోటును మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా, వర్షపాతం వ్యత్యాసం, SPI, పొడి కాలం, విత్తిన విస్తీర్ణం, నేల తేమ, రిజర్వాయర్ నిల్వలు, భూగర్భజల పరిస్థితులు, ప్రవాహ జలాలు, పశుగ్రాసం, తాగునీరు, ఉపాధి, వలసలు తదితర అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని, దీనికి గాను వ్యవసాయశాఖ ద్వారా అందించాల్సిన నివేదికలను వారికి ఇవ్వాల్సిందిగా మంత్రి ఆదేశించారు. కరువు తీవ్రతను బహుళ సూచికల ఆధారంగా అంచనా వేసి, అవసరమైన చోట క్షేత్రస్థాయి పరిశీలనతో పంట నష్టాన్ని నిర్ధారించాలని పేర్కొన్నారు. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 20 నుంచి 59 శాతం లోటు ఉంటే లోటు వర్షపాతంగా, 60 నుంచి 99 శాతం లోటు ఉంటే భారీ లోటుగా, వర్షం పూర్తిగా లేకపోతే అత్యంత తీవ్రమైన పరిస్థితిగా పరిగణించాలని కరువు నిర్వహణ మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి. అదే విధంగా, సాగు విస్తీర్ణం సాధారణంతో పోలిస్తే 85 శాతం కంటే తక్కువగా ఉండటం కరువు మిగతా 2లో..

## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

- యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ



హైదరాబాద్, : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత మిగతా 2లో..

## బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేసిన కిషన్ రెడ్డి

- ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఈసీపై దాడి చేస్తోందని ఆరోపణ
- హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- కాంగ్రెస్ దొంగ ఓట్లను చేర్పించే ప్రయత్నం చేస్తోందని విమర్శ



హైదరాబాద్, : ఖైరతాబాద్ లో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నాయకుడు జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ మిగతా 2లో..



## పసిపిల్లల కూటికి కన్నం?

- అంగన్వాడీ పోషకాహారం ఓ 'అంగట్లో' ప్రత్యక్షం!
- రాత్రి వేళ కావడం వల్లే కిరాణం కొట్టులో దింపేమంటున్న ,టీచర్, ఆయాల వింత సమర్థన?
- ఐసిడిఎస్ అధికారుల మామూళ్ల మత్తు, నిర్లక్ష్యమే కారణమంటున్న స్థానికులు
- బాధ్యులపై కఠిన చర్యలకు స్థానికుల డిమాండ్
- విచారణ చేపడతామన్న ఐసిడిఎస్ మండల సూపర్‌వైజర్ మిగతా 2లో..

## రవీంద్రభారతి వద్ద హైడ్రామా

- మంత్రి జూపల్లి కారుకు అడ్డంగా పడుకున్న కళాకారులు
- మహిళల కన్నీరు, కాంగ్రెస్ డౌన్ డౌన్ నినాదాలు మిగతా 2లో..





## ఉపఎన్నికకు భయపడుతున్న ప్రభుత్వం..

- ఖైరతాబాద్‌లో గెలుపు కష్టమనే టెన్షన్
- ఉపఎన్నిక ఆపేందుకు ప్రయత్నాలు? మిగతా 9లో..




## జిల్లాల్లో దశలవారీగా వృద్ధాశ్రమాలు

- 30 డే కేర్ కేంద్రాల్లో ఉచిత సేవలు
- వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- చేయూత పింఛన్ ద్వారా 15.60 లక్షల మందికి లబ్ధి
- ప్రతి జిల్లాలో వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారి
- వృద్ధాప్యంలో ఆర్థిక భారం పడకుండా నగదు రహిత వైద్యం
- ట్రిబ్యునళ్లలో కేసుల దాఖలు ప్రక్రియ సులభతరం
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వెల్లడి



హైదరాబాద్, అక్టోబర్ 01 : వృద్ధుల గౌరవం, భద్రత, ఆరోగ్యం, ఆర్థిక భరోసాకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం మిగతా 2లో..

## 'సర్'లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు

తెలంగాణ ప్రధాన ఎన్నికల కమిషనర్

- 65 లక్షల మంది నోటీసులకు సమాధానం ఇచ్చారని వెల్లడి
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చామన్న సుదర్శన్ రెడ్డి
- సర్ ప్రక్రియను పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టీకరణ



హైదరాబాద్, అక్టోబర్ 01 : తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చినట్లు మిగతా 2లో..

## జపాన్‌లో ఆసియా క్రీడలను వీక్షించిన తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం

- మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో జపాన్‌లో పర్యటన



జపాన్, అక్టోబర్ 01 : జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలను తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం వీక్షించింది. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో జపాన్‌కు వెళ్లిన ఈ బృందంలో ప్రభుత్వ ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేన రెడ్డి, వీసీ ఽ ఎండీ సోనీ బాలాదేవి ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రతినిధి బృందం ఆసియా క్రీడలను వీక్షించి, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను మిగతా 2లో..

## బీసీలకు అండగా నిలిచింది... నిలిచేది మేమే

- 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో అప్పీల్
- రిజర్వేషన్లు అడ్డుకునేలా కోర్టుల్లో గొడ్డలి పార్టీ పిటీషన్లు
- రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు రేపు శ్రీకారంసంక్షేమం
- అభివృద్ధి- సుపరిపాలనతో ప్రతిచోటా ఫలితాలు
- పల్లె ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన సీఎం




రేపల్లె, అక్టోబర్ 01 : బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచింది... నిలిచేది తామేనని ముఖ్యమమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. బీసీలకు చేయూతను అందించే విషయంలో ఎక్కడా రాజీ పడబోమని తేల్చి చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లనున్నట్లు తెలిపారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. బాపట్ల జిల్లా రేపల్లెలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రజావేదికలో సీఎం ప్రసంగించారు. నాడు బీసీలకు రాజకీయంగా ఎన్టీఆర్ గుర్తింపు తెచ్చారని.. తాను వారికి అండగా నిలబడి ప్రోత్సహించానని సీఎం అన్నారు. 1995లో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తెచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చాక రిజర్వేషన్లను 24 శాతానికి కుదించిందన్నారు. తద్వారా 16,800 మంది పదవీ అవకాశాలు కోల్పోయారని ముఖ్యమంత్రి అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ.." ఇప్పుడు మిగతా 2లో..

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!

- రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ సవాల్
- రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు డిమాండ్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరిన కేటీఆర్
- తప్పు తేలితే శిక్షకు సిద్ధమన్న కేటీఆర్
- ప్రభుత్వ హామీలపై పోరాటం కొనసాగిస్తామన్న కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 01 : తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల



వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ మిగతా 2లో..

## దుందుభి వాగులో జోరుగా అక్రమ ఇసుక దందా!

- అధికారుల అండతోనే యథేచ్ఛగా తవ్వకాలు..
- నాగర్ కర్నూల్ జిల్లాలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది
- ఒక ట్రిప్ బుక్ చేసి... 3-4 ట్రిప్పులు! టిప్పర్లతో అక్రమ రవాణా
- బిల్ ఎక్కడో... అన్ లోడ్ ఎక్కడో! నిబంధనలకు తూట్లు
- వంగూరు మండలం పోతిరెడ్డిపల్లి వద్ద దుందుభి నది విధ్వంసం మిగతా 2లో..



## షీ టీమ్స్ పై అంటే పై.. స్పోర్ట్స్ లోనూ మా పై చేయి!



మహబూబ్ నగర్ పోలీస్ ద్విముఖ విజయం

- ఎస్పీ డి.జానకి హర్షం

తెలంగాణ స్టేట్ బ్యూరో, మహబూబ్ నగర్, అక్టోబర్ 1, విజన్ ఆంధ్ర: మిగతా 2లో..






## పల్లెల్లో బిల్లుల పంచాయితీకి బ్రేక్!

- సీతక్క సంచలన ఆదేశాలు, • ఉప సర్పంచ్ లు మొండికేస్తే ఇక కుదరదు.. , • 7 రోజులు దాటితే కలెక్టర్ ఎంట్రీ

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 01,విజన్ ఆంధ్ర :

ఎన్నో రోజులుగా గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, ఉప సర్పంచ్ ల మధ్య చెక్కుల సంతకాల విషయంలో జరుగుతున్న కోల్డ్ వార్ కు తెరపడింది. మిగతా 2లో..

## 'సర్'లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు

తెలిపారు. సర్‌లో 20 శాతం మంది సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 92 లక్షల మందిలో 65 లక్షల మంది నోటీసులపై స్పందించినట్లు చెప్పారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకు బీఎల్‌ఓలు వెళ్లి సంబంధిత పత్రాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ అందుబాటులో ఉండవల్సిన అవసరం లేదని, ఒక్కరు ఉండి, మిగిలిన అందరి కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందని అన్నారు. సర్ ప్రక్రియను మరోసారి పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

## జపాన్‌లో ఆసియా క్రీడలను వీక్షించిన తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం

పరిశీలించింది. ప్రపంచ స్థాయి క్రీడా వసతులు, పోటీల నిర్వహణ విధానాలు, క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఈ పర్యటన ద్వారా లభించింది. తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు అవసరమైన అంశాలను అధ్యయనం చేయడంలో ఈ పర్యటన దోహదపడనుంది.

## బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేసిన కిషన్ రెడ్డి

రాజకీయాల్లో ఈ పొత్తుపై జరుగుతున్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యామని, అయితే ఈసారి బీజేపీ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు కేటాయింపులపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, సింగరేణి బొగ్గును వినియోగించుకునేలా ఈ ప్లాంట్‌ను ఎందుకు రూపకల్పన చేయలేదో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వైఖరిని కిషన్ రెడ్డి తీవ్రంగా ఎండగట్టారు. రాహుల్ గాంధీ రాజ్యాంగబద్ధమైన సంస్థలపై, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌పై అనుచిత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మార్పు అనేది ప్రజల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందే తప్ప, రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. అలాగే, రాముడిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని, వాటిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘంపై, బీజేపీపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాంతాల వారీగా ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని, తొలగించిన ఓట్లను (మరణించిన వారు, అక్రమ చొరబాటుదారులు) తిరిగి ఓటర్ల జాబితాలో చేర్పించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఖైరతాబాద్‌లో బీజేపీ గెలుపు తథ్యమని, తమ పార్టీ ఓట్లను దొంగిలించదని, కేవలం ప్రజల హృదయాలను గెలుచుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్ళు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

# దుందుభి వాగులో జోరుగా అక్రమ ఇసుక దందా!

తెలంగాణ స్టేట్ బ్యూరో,వంగూరు, అక్టోబర్ 01,విజన్ ఆంధ్ర:
నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం పోతిరెడ్డిపల్లి వద్ద దుందుభి వాగులో అక్రమ ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. తప్పుదారి పడుతున్న ఇసుక రవాణా తీరుతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ, ప్రకృతిని విధ్వంసం చేస్తున్నారు. గత వారం రోజులుగా దుందుభి నది నుండి టిప్పర్లతో ఇసుక తవ్వకాలు ముమ్మరంగా సాగుతున్నాయి. నిబంధనల ప్రకారం ఒక ట్రిప్ కు బుక్ చేసి, అదే బిల్ తో మూడు, నాలుగు ట్రిప్పులు తరలిస్తున్న వైనం బహిరంగ రహస్యంగా మారింది. బిల్ ఒకచోట అలాట్మెంట్ చేసుకుని, అన్ లోడ్ మాత్రం వివిధ ప్రాంతాల్లో, నియోజకవర్గాలు దాటి మరీ ఇసుకను పోస్తున్నారు. అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మైనింగ్ శాఖ, పోలీస్ శాఖ, రవాణా శాఖ కళ్ల ముందే ఈ దందా సాగుతోందా? లేక వారికి తెలియకుండా సాగుతోందా? అనేది స్థానిక ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అధికారులు మాత్రం అక్రమ ఇసుకపై ఉక్కుపాదం మోపుతున్నామని ప్రకటనలు చేస్తూనే, మళ్లీ అక్రమ దందాకు తెరలేపుతున్నారు. పత్రికలలో వార్తలు వచ్చినప్పుడు నామమాత్రంగా దాడులు నిర్వహించి, రెండు మూడు రోజులు ఇసుక రవాణాను నిలిపివేసి, మళ్లీ ఏదో ఒక పత్రం చూపించి అనుమతులతోనే నడుపుతున్నట్లు బుకాయిస్తూ యథావిధిగా అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. శాశ్వత పరిష్కారం లేకుండా దుందుభి నదిని పూర్తిగా నాశనం చేసే విధంగా టిప్పర్లతో ఇసుకను కొల్లగొట్టి, వ్యాపారులు అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, దుందుభి వాగును కాపాడాలని, ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## రిజిస్ట్రేషన్ దస్తావేజులు పోయినవి

వంగాల శశిధర్,తండ్రి వంగాల శ్రీరాములు,నివాసం ఇంటి నెం.3-4-63/19/203,శ్రీరమణాపురం,రామంతాపూర్,ఉప్పల్ మండలం,మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వారి ఆస్తికి సంబంధించిన క్రింది దస్తావేజులు 01-08-2026న ఇంటి నుండి ఉప్పల్ కు ప్రయాణిస్తున్న సమయంలో పోయినవి.

1.సాధారణ తనఖా దస్తావేజ (సింపుల్ మార్టిగేజ్ డీడ్) - డాక్యుమెంట్ నెం.5423/2014
2.టైటిల్ డీడ్‌ల డిపాజిట్ విడుదల పత్రం (రిలీజ్ ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్) - డాక్యుమెంట్ నెం. 13549/2016
3.టైటిల్ డీడ్‌ల డిపాజిట్‌కు సంబంధించిన మెమోరాండం - డాక్యుమెంట్ నెం.10509/2015
4.రీకన్వేయన్స్ డీడ్ - డాక్యుమెంట్ నెం.7298/2014

ఈ పత్రాలు ఎవరికైనా లభించినట్లయితే పై చిరునామాకు లేదా
ఫోన్: 6281990223 కు సమాచారం అందించగలరు.
వంగాల శశిధర్

# పసిపిల్లల కూటికి కన్నం?

కొల్లాపూర్ / పెంట్లవెల్లి, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర):
పేద పసిపిల్లలు, గర్భిణులు, బాలింతల ఆకలి తీర్చి పోషకాహారాన్ని అందించాల్సిన ప్రభుత్వ సొత్తు నడిబజార్లో విక్రయానికి రావడం ఐసిడిఎస్ వ్యవస్థలోని తీవ్ర నిర్లక్ష్యాన్ని, అవినీతిని దిగజారుడుతనానికి నిదర్శనంగా నిలుస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లిలోని 10వ అంగన్వాడీ కేంద్రానికి చెందిన ప్రభుత్వ గుడ్లు పక్కదారి పట్టి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ ప్రైవేటు కిరాణా కొట్టులో దర్శనమివ్వడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.



*ప్రభుత్వ సొత్తు ప్రైవేటు షాపులోకి ఎలా వచ్చింది?*

పెంట్లవెల్లిలోని ఒక ప్రైవేటు కిరాణా షాపునకు నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం వెళ్లిన వినియోగదారులు, అక్కడ అంగన్వాడీ ముద్ర (స్టాంపు) ఉన్న కోడిగుడ్లు అమ్మకానికి ఉంచడం చూసి తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఈ విషయమై స్థానిక విలేకరులు 10వ సెంటర్ అంగన్వాడీ టీచర్, ఆయాలను నిలదీయగా, వారి నుంచి బాధ్యతారాహిత్యమైన సమాధానం వచ్చింది. వాళ్లు తెలిపిన విషయం "రాత్రి వేళ కావడం వల్లే గుడ్ల కేటరేషన్‌ను ఆ కిరాణా షాపులో దింపాం" అని వారు చెప్పిన అసంబద్ధ సమర్థనపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు ప్రభుత్వ ఆస్తిని రాత్రి వేళల్లో ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉంచాల్సిన అవసరం ఏమొచ్చిందని స్థానికులు అధికారులపై మండిపడుతున్నారు.

*అధికారుల నిర్లక్ష్యం... అక్రమార్కులకు వరం!*

పసిపిల్లల నోటికాడి కూటిని లాక్కుంటూ అంగన్వాడీ బియ్యం, గుడ్లు పక్కదారి పడుతున్నా ఐసిడిఎస్ అధికారులు కనీస తనిఖీలు చేపట్టకపోవడం వెనుక పెద్ద ఎత్తున మామూళ్ల వ్యవహారం నడుస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ శూన్యం కావడంతోనే కిందిస్థాయి సిబ్బంది యథేచ్ఛగా అక్రమాలకు తెగబడుతున్నారని, పేదల ఆహారాన్ని వ్యాపారులకు తెగనమ్ముకుంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.



*కఠిన చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు*

పసిపిల్లల పోషకాహారాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయానికి పెట్టిన పెంట్లవెల్లి అంగన్వాడీ 10వ సెంటర్ టీచర్, ఆయాపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఐసిడిఎస్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

*విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం ఐసిడిఎస్ మండల సూపర్‌వైజర్*

ఈ అంశంపై మండల సూపర్‌వైజర్‌ను వివరణ కోరగా... కిరాణా కొట్టులో పెంట్లవెల్లి గ్రామ 10 వ అంగన్వాడీ గుడ్లు ప్రత్యక్షమైనట్లు స్థానికులు, విలేకరుల ద్వారా తెలిసిందని, ఈ విషయాన్ని వెంటనే సిడిపిఓ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆ రోజు రాత్రి స్టాక్‌ను కిరాణా కొట్టులో దింపుతున్నట్లు టీచర్ లేదా ఆయా తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. త్వరలోనే అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, అసలు కిరాణా కొట్టులో గుడ్లు ఎందుకు దింపాల్సి వచ్చిందో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## పల్లెల్లో బిల్లుల పంచాయితీకి బ్రేక్!

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం చేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్న వారికి మంత్రి సీతక్క షాక్ ఇచ్చారు. గ్రామాల్లో పనులు చేసిన కాంట్రాక్టర్ల బిల్లులు నెలల తరబడి పెండింగ్ లో ఉండటంతో ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో స్పందించిన మంత్రి సీతక్క, ఇకపై ఇలాంటి తాటాకు చప్పుళ్లు కుదరవని తేల్చి చెప్పారు.
అసలు ఏం జరిగింది?
సర్పంచ్ చెక్కుపై సంతకం చేసినా, ఉప సర్పంచ్ కావాలనే సంతకం పెట్టకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. దీంతో బిల్లులు ఆగిపోయి, పనులు నిలిచిపోతున్నాయి.
ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం ఇదే:
7 రోజుల డెడ్ లైన్:
కారణం లేకుండా 7 రోజులకు మించి చెక్కులపై సంతకం చేయకుండా జాప్యం చేస్తే, వెంటనే జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలి.
చట్టపరమైన చర్యలు: విచారణలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసినట్లు తేలితే, ఉప సర్పంచ్ పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు.
పవర్ షిఫ్ట్: ఒకవేళ ఏడు రోజులు దాటినా సంతకం చేయకపోతే, ఆ ఉప సర్పంచ్ స్థానంలో పంచాయతీ కార్యదర్శి, లేదా ఎంపీఓ, లేదా ఎంపీడీవోల్లో ఒకరికి జాయింట్ చెక్ పవర్ ఇచ్చే అధికారాన్ని కలెక్టర్లకు ఇచ్చారు. ఈ ఒక్క నిర్ణయంతో ఇకపై పల్లెల్లో బిల్లుల చెల్లింపులు రాకెట్ వేగంతో జరగనున్నాయి. అభివృద్ధి పనులకు అడ్డంకులు తొలగిపోనున్నాయి. మంత్రి సీతక్క ఆదేశాలతో జిల్లా పంచాయతీ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి..

## షీ టీమ్స్ పై అంటే పై.. స్పోర్ట్స్ లోనూ మా పై చేయి!

మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ శాఖ బుధవారం ఒకే రోజు రెండు విజయాలతో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసింది. ఒకవైపు ఆడబిడ్డల భద్రతకు కాపలాగా నిలుస్తూ అసాంఘిక శక్తుల గుండెల్లో వణుకు పుట్టిస్తుంటే, మరోవైపు రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో పతకాల పంట పండించి సత్తా చాటింది.

*మహిళా భద్రతలో ఉక్కుపాదం - 13 మంది కామాంధుల అరెస్ట్*

జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి ఐపీఎస్ ఆదేశాలతో షీ టీమ్స్ జిల్లా వ్యాప్తంగా దూకుడు పెంచాయి. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కళాశాలలు, ట్యూషన్ సెంటర్ల వద్ద సివిల్ డ్రెస్సులో మాటు వేసి వేధింపులకు పాల్పడుతున్న వారిని ఏరిపారేస్తున్నాయి.

*సెప్టెంబర్ నెల రిపోర్ట్ కార్డు చూస్తేనే అర్థమవుతుంది పోలీసుల పనితీరు:*

మొత్తం ఫిర్యాదులు: 17 । కౌన్సెలింగ్ లు: 16 । రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నవి: 13 । పెట్టీ కేసులు: 03 । అవగాహన సదస్సులు: 26 । హాట్ స్పాట్ తనిఖీలు: 50
ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, సైబర్ వేధింపులు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలపై విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు.
జడ్చర్లలో సినీ ఫక్కీలో రెస్క్యూ:లి జడ్చర్లలో మైనర్ బాలికకు బలవంతంగా పెళ్లి చేస్తున్నారని తెలియగానే ~ాసుఖ బృందం మెరుపు వేగంతో వెళ్లి పెళ్లిని అడ్డుకుంది. బాలికను రక్షించి స్టేట్ హోమ్ కు తరలించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మానవ అక్రమ రవాణాపై 70 హాట్ స్పాట్ లలో సోదాలు నిర్వహించారు.

*రాష్ట్ర పోలీస్ క్రీడల్లో మహబూబ్ నగర్ హవా*

హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో 5 రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 లో మహబూబ్ నగర్ పోలీసులు సత్తా చాటారు.
- బ్యాడ్మింటన్ డబుల్స్ లో సిల్వర్ మెడల్: హెడ్ కానిస్టేబుల్ లింగం (DAR), హెడ్ కానిస్టేబుల్ శేఖర్ (టూ టౌన్ పీఎస్)
- లాన్ టెన్నిస్ డబుల్స్ లో బ్రాంజ్ మెడల్:లి హెడ్ కానిస్టేబుల్ ఇమ్రాన్ (DAR), హెడ్ కానిస్టేబుల్ లింగం (DAR)
విధుల్లోనే కాదు.. క్రీడల్లోనూ మనోళ్లు తోపే అని నిరూపించారు.

*ఎస్పీ జానకి ప్రశంసలు:*

పతక విజేతలను జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ ఘనంగా అభినందించారు. పోలీసులకు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తికి క్రీడలు ఎంతో అవసరమని, వారికి శాఖ తరపున పూర్తి ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు.

*ప్రజలకు విజ్ఞప్తి:*

మహిళలు ఎక్కడైనా వేధింపులకు గురైతే భయపడవద్దని, వెంటనే లిషీ టీమ్: 8712659365, ~ాసుఖ: 8712680066, డయల్ 112/100, చైల్డ్ లైన్ 1098 కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

## మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ కేంద్రం కొనుగోలు చేయాలి

పరిస్థితికి, 75 శాతం లేదా అంతకంటే తక్కువగా ఉండటం తీవ్రమైన కరువు పరిస్థితికి సూచికగా పరిగణించాలని పేర్కొన్నట్లు మంత్రి తెలిపారు. మద్దతు ధర ప్రకటించడంతో కేంద్రం బాధ్యత అయిపోదని, ఆ మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా చూడటం కూడా కేంద్ర ప్రభుత్వం యొక్క బాధ్యతే అని మంత్రి తుమ్మల అన్నారు. నిన్న కేంద్ర కేబినెట్ రబీ మార్కెటింగ్ సీజన్ 2027-28కు సంబంధించి కనీస మద్దతు ధరలను పెంచింది. ఇందులో కుసుమ పంటకు క్వింటాల్‌కు రూ.675, రేప్‌సీడ్--ఆవాలకు రూ.413, మసూర్‌కు రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 చొప్పున పెంపు ప్రకటించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పిఎస్ఎస్ లో ఆయా రాష్ట్రాలలో సాగవుతున్న పప్పుధాన్యాలు, నూనెగింజల మొత్తం ఉత్పత్తిలో నాఫెడ్ ద్వారా కేవలం 25 శాతం మాత్రమే సేకరిస్తుందని, అలా కాకుండా ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ మద్దతు ధరకు కేంద్ర ప్రభుత్వం 100 శాతం కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. మద్దతు ధర ప్రకటించడం మాత్రమే కాకుండా, రైతు పండించిన పంటను ఆ ధరకు విక్రయించుకునే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా చిత్తశుద్ధితో కేంద్రం చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల కోరారు. ప్రకటించిన మద్దతు ధరకు 100 శాతం పంటల సేకరణ జరిగినప్పుడే రైతులకు కలుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, మార్కెటింగ్ ఎండి రాహుల్ రాజ్ మరియు హార్టికల్చర్ ఎండి యాస్మిన్ బాషా పాల్గొన్నారు.

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

## రవీంద్రభారతి వద్ద హైడ్రామా

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 01 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీరుపై కళాకారులు భగ్గుమన్నారు. రవీంద్రభారతిలోని మంత్రి కార్యాలయం ముందు గురువారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అర్హులైన కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారథిలో 1000 ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున కళాకారులు ఆందోళనకు దిగారు. మంత్రి జూపల్లి బయటకు వెళ్లకుండా నిర్బంధించి, ఆయన కారుకు అడ్డంగా పడుకుని నిరసన తెలిపారు. లి"కాంగ్రెస్ డౌన్ డౌన్.. కాంగ్రెస్ డౌన్ డౌన్"లి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. "ప్రాణాలైనా అర్పిస్తాం.. ఉద్యోగాలు సాధిస్తాం" అనే నినాదాలతో రవీంద్రభారతి దద్దరిల్లింది.



**కాళ్లు పట్టుకున్నా కనికరించని మంత్రి..**

తమ గోడు వినాలంటూ మహిళా కళాకారిణులంతా మంత్రి జూపల్లి కాళ్లపై పడి వేడుకున్నారు. అయినా మంత్రి కనికరించలేదని కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. "నా సపోర్టు కావాలంటే మీరు ఇక్కడి నుంచి లేచిపోవాలి" అని మంత్రి జూపల్లి కృష్ణారావు వారితో అన్నట్లు కళాకారులు తెలిపారు. మంత్రి తీరుతో మహిళా కళాకారిణులు కంటనీరు పెట్టారు. "ఆడపిల్ల ఉసురు పోసుకున్న ఏ ప్రభుత్వం కూడా నిలవదు" అంటూ ఏడుస్తూ శాపనార్థాలు పెట్టారు. కళాకారులను తోసుకుంటూ మంత్రి జూపల్లి అక్కడి నుండి వెళ్లిపోయారు. పేద కళాకారుల బతుకులతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని, వెంటనే సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని కళాకారులు డిమాండ్ చేస్తున్నారు.

## జిల్లాల్లో దశలవారీగా వృద్ధాశ్రమాలు

చేశారు. వృద్ధులు తమ సమస్యలను సులభంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా ప్రతి జిల్లాలో ప్రత్యేక అధికారిని నియమించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వృద్ధుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాల అమలు, వారి హక్కుల పరిరక్షణ, ఫిర్యాదుల పరిష్కారాన్ని జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా అలాగే సహచర బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ...ఐక్యరాజ్యసమితి 1990 డిసెంబర్ 14న తీర్మానం 45/106 ద్వారా అక్టోబర్ 1ను అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు. వృద్ధుల సేవలను గుర్తించడం, వారి జీవనాన్ని ప్రభావితం చేస్తున్న సమస్యలపై సమాజంలో అవగాహన కల్పించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశమన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 3.53 కోట్ల జనాభాలో 32.69 లక్షల మంది వృద్ధులు ఉన్నారని, వృద్ధుల సంక్షేమంపై అవగాహన పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు వారోత్సవాలు నిర్వహించారని, ఇందులో భాగంగా జిల్లాల వారీగా వివిధ అవగాహన, వైద్య, సామాజిక కార్యక్రమాలు చేపట్టారని మంత్రి తెలిపారు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా పిల్లల్లో బాధ్యత పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను సమర్థంగా అమలు చేస్తూ వృద్ధులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 30 డే కేర్ కేంద్రాల్లో ఉచిత సేవలు వృద్ధుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 30 డే కేర్ కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు.ఆయా కేంద్రాల్లో పౌష్టికాహారం, వైద్య సేవలు, ఆటలు, వినోద కార్యక్రమాలను ఉచితంగా అందిస్తున్నారనీ వివరించారు. వృద్ధుల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు నిర్వహణ ట్రిబ్యునళ్లలో కేసుల దాఖలు ప్రక్రియను సులభతరం చేశారు. గత ఏడాది నిర్వహణ ట్రిబ్యునళ్లలో 2,505 భరణం కేసులు దాఖలు కాగా 1,346 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో దాఖలైన 409 అప్పీళ్లలో 234 పరిష్కరించారనీ తెలిపారు. తల్లిదండ్రులను నిరాదరించిన పిల్లల నుంచి ఆస్తిని తిరిగి తల్లిదండ్రుల పేరున బదలాయించేందుకు కలెక్టర్ల ఆధ్వర్యంలోని అథారిటీల వద్ద 209 కేసులు నమోదుకాగా 135 పరిష్కరించారనీ అప్పిలేట్ అథారిటీ వద్ద నమోదైన 18 అప్పీళ్లలో 15 పరిష్కరించడం జరిగిందని వివరించారు. వృద్ధులకు అత్యవసర సమయంలో సహాయం అందించేందుకు 14567 టోల్‌ఫ్రీ ఎల్డర్ లైన్ అందుబాటులో ఉందనీ మంత్రి తెలిపారు.వేధింపులు, నిరాదరణ, ఒంటరితనం, ఆశ్రయం వంటి సమస్యలపై వృద్ధులు ఈ సేవలను వినియోగించుకోవచ్చన్నారు.

## బీసీలకు అండగా నిలిచింది... నిలిచేది మేమే

మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లింది. హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. 50 శాతం కంటే రిజర్వేషన్లు పెరగకూడదని కోర్టులో వాదించారు. కోర్టు ఆ జీవోలను కొట్టేసింది. దీనిపై రేపే ఈ సుప్రీం కోర్టులో అప్పీలుకు వెళ్తున్నాం. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా పైకి తీసుకురావటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని వ్యక్తులు.. మేం మెగా డీఎస్సీ తో ఉద్యోగాలు ఇస్తే ఆరోపణలు చేస్తున్నారు. 350 కేసులు కోర్టుల్లో వేసి నియామక ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెనుకబడిన వర్గాలపై ద్వేషంతో కోర్టులకు వెళ్లి అడ్డంకులు సృష్టించే రిజర్వేషన్లు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏది ఏమైనా బీసీలను రాజకీయంగా అండగా నిలబడే బాధ్యతను మేం తీసుకుంటాం. ఈ ప్రాంతంలో బీసీ బిడ్డ అనగాని భగవంతరావు చక్కగా పనిచేశారు. ఇప్పుడు మంత్రిగా అనగాని సత్యప్రసాద్ ప్రజల కోసం పనిచేస్తున్నారు. బీసీలుగా నాయకులు రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పించేది కూటమి ప్రభుత్వమే." అని ముఖ్యమంత్రి అన్నారు.

**జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యం"**

గడచిన 28 నెలలుగా ప్రతీ నెలా మొదటి తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటున్నాను. చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని నేను విశ్వసిస్తున్నాను. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పనిచేస్తున్నాను. పేదలకు న్యాయం చేయాలన్న బాధ్యతతో మేం పనిచేస్తున్నాం. ప్రతినెలా నాలుగు మార్లు ప్రజల ముందుకు వస్తున్నాం. ప్రతీ నెలా 1 తేదీన పేదలకు ఆర్థిక భద్రత కల్పించే పెన్షన్ల కార్యక్రమం, 9 తేదీన మీ భూమి- మీహక్కు కార్యక్రమంలో పాల్గొంటున్నాం. గత పాలకులు సృష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. ఇక ప్రతిమూడో శనివారం పర్యావరణాన్ని కాపాడే స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి , 4వ శనివారం సంజీవని కార్యక్రమానికి హాజరవుతున్నాను. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని నిత్యం ప్రజా సేవకులుగా పనిచేస్తున్నాం. గడచిన రెండేళ్లుగా ప్రతీ వ్యక్తికి, ప్రతీ కుటుంబానికి సాధికారిత తీసుకువస్తున్నాం. రాష్ట్రంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. గొడ్డలి పార్టీ నేతలు ప్రజలు కొట్టిన దెబ్బకు అలిగి అసెంబ్లీకి కూడా రాకుండా ముఖం చాటేస్తున్నారు. గత పాలకులు అన్ని వ్యవస్థల్నీ భ్రష్టు పట్టించారు. రాష్ట్రాన్ని విధ్వంసం సృష్టించారు. కష్టంతో సంకల్పంతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తు?న్నాం. ఆర్థిక సవాళ్లు అధిగమించి సంక్షేమం అందిస్తున్నాం. పెన్షన్లకే ఇప్పటికి రూ.76 వేల కోట్లు ఖర్చు చేశాం. వెంటిలేటర్ పై ఉన్న ఆర్థిక వ్యవస్థను కేంద్ర సహకారంతో ఆక్సిజన్ ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు, బుల్లెట్ స్పీడ్ తో సుపరిపాలన అందిస్తున్నాం. పేదరికాన్ని ఆర్థిక కోణంలో కాదు మానవీయ కోణంలో ఆలోచించి జీవన ప్రమాణాలు పెంచడానికి చూస్తున్నాం. సంక్షేమంతో పాటు పీ4 కార్యక్రమం ద్వారా అట్టడుగున 20 స్థాయి మందికి చేయూత అందించేలా చర్యలు చేపట్టాం. బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు తీసుకున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

# సంపాదకీయం

## నష్ట నివారణా చర్యల్లో ఈసీ

ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 14 అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం బయటపడి తీవ్ర సంచలనం కలిగించాయి. దీంతో కాక్రోచ్ జనతా పార్టీ, విపక్షాలు ఆందోళనకు దిగడం, ఎన్నికల కమిషన్‌పై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడడంతో ఎన్నికల కమిషన్ తన అప్రతిష్ఠను నివారించుకునే చర్యలు చేపట్టింది. కమిషనర్ల ఫిర్యాదులను కొంతవరకు అంగీకరించింది. ఇకపై సమావేశాలకు ముందే అజెండాను పంపుతామని, సమావేశాల తరువాత మినిట్స్ (నిర్ణయాల వివరాలను) అందజేస్తామని, తదితర వివరణలతోపాటు 'సర్' లో లోపాలు ఉన్నాయని పరోక్షంగా అంగీకరించింది. ఓటరు జాబితానుంచి ఎవరి పేరైనా తొలగించినట్టయితే వారిని తిరిగి జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లకు సూచించింది. అయితే 'పశ్చిమబెంగాల్‌లో న్యాయాధికారులు చేర్చిన ఓటర్లను తొలగించేందుకు 16.1లక్షల అప్పీళ్లను ఎవరు అనుమతించారు?' అని ఎన్నికల కమిషనర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు అడిగిన ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్?ఐఆర్) వ్యవహారంపై కాంగ్రెస్, ఎన్నికల సంఘం మధ్య వివాదం మరింత ముదురుతోంది. సర్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం ప్రకటించిన అరకొర చర్యలు సమస్యకు పరిష్కారం కాదని, ఇప్పటికే జరిగిన పరిణామాలపై నష్ట నివారణ ప్రయత్నమేనని (డ్యామేజ్ కంట్రోల్) కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. శుక్రవారం రాత్రి విడుదల చేసిన పత్రికా ప్రకటన తన తప్పుల్ని కప్పిపుచ్చుకోవడానికి చేసిన వృథా ప్రయత్నం అని స్పష్టం చేసింది. పాక్షికంగా చేసే దిద్దుబాటు చర్యల వల్ల లక్షలాది మంది ఓటర్ల హక్కులను కాలరాస్తున్నారని ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ విమర్శించారు. ఓటర్ల తొలగింపుపై ఈసీ అనుసరిస్తున్న విధానాలు పౌరుల ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘం ప్రతిపాదించిన చర్యలు- సర్ ప్రక్రియలో సమస్యలు ఉన్నాయనే విషయాన్ని పరోక్షంగా అంగీకరించినట్లేనని ఆయన అన్నారు. కొద్ది మంది ఓటర్లకు ఉపశమనం కలిగించేలా తీసుకుంటున్న చర్యలు- భారీ స్థాయిలో జరిగిన ఓటర్ల తొలగింపును సరిచేయలేవని వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన క్లారిఫికేషన్‌ను తోసిపుచ్చుతూ జైరాం రమేశ్ పలు అంశాల్ని లేవనెత్తారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ముప్పులో ఉన్న 5.43 కోట్ల మంది ఓటర్ల ఇళ్లకు బూత్ లెవెల్ అధికారులు (ఃబూ) వెళ్తారని ఎన్నికల సంఘం చెప్పడం విడ్డూరంగా ఉందని, మొదటి దశలోనే నిబంధనలు సరిగ్గా అమలు కాలేదని, అప్పుడే సరిగా జరగని ఇళ్ల సర్వేను మళ్లీ చేస్తామనడంలో అర్థమే లేదని విమర్శించారుజ్ఞానేశ్ కుమార్ నేతృత్వం లోని ఎన్నికల కమిషన్ 'సర్' ప్రక్రియ ద్వారా ముసాయిదా ఓటర్ల జాబితాలనుంచి 13కోట్లకు పైగా పేర్లను తొలగించింది. స్వయంగా అర్హులైన ఓటర్లను నమోదు చేయాల్సిన ప్రభుత్వ బాధ్యతను ఓటర్లపైనే మోపుతున్నారన్న విమర్శలు వచ్చాయి అంటే పేర్లను ముందుగా తొలగించి, తరువాత వాటిని ధ్రువీకరించే విధానం అమలైంది. తిరిగి ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఓటర్లపై కఠినమైన, భారమైన నిబంధనలు విధిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా (సర్) రాజ్యాంగబద్ధమైనదా కాదా అనే విషయంపై సుప్రీం కోర్టు నెలల తరబడి నిర్ణయం తీసుకోకపోవడంతో కొన్ని లోపాలు చోటుచేసుకున్నాయి. చివరకు మే 27న కోర్టు తీర్పు ఇచ్చే సమయానికి బీహార్, పశ్చిమబెంగాల్, రెండో దశలోఉన్న ఇతర రాష్ట్రాల్లో 'సర్' ప్రక్రియ అప్పటికే ప్రారంభమై, వాస్తవ పరిస్థితిని మార్చేసింది. సుప్రీం కోర్టు తీర్పు ఎడిఎం జబల్‌పూర్ కేసులో ప్రభుత్వం పట్ల కోర్టు చూపిన విధేయతను గుర్తు చేసేలా ఉందన్న విమర్శలు తలెత్తాయి. 'సర్'ను ఆచరణలో ఎలా అమలు చేశారన్న దానికంటే సిద్ధాంతపరంగా ఎలా ఉండాలో కోర్టు చూసింది. అసాధారణమైన, నిర్దిష్టమైన సందర్భాల్లో మాత్రమే చేయాల్సిన ఓటర్ల జాబితా సవరణ నిబంధనను, రాష్ట్రవ్యాప్తంగా భారీస్థాయిలో సవరణ చేయడానికి అనుమతిగా భావించారు. ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్నవారు అర్హులేనని నిరూపించాల్సిన అవసరం లేదని చెప్పినప్పటికీ, సర్ ద్వారా వారు మళ్లీ తమ అర్హతను నిరూపించుకోవలసి వచ్చింది. అలాగే 1995 నాటి సుప్రీం కోర్టు తీర్పులో ఓటర్ల జాబితాలో ఎవరి పేరునైనా తొలగించడానికి వ్యక్తిగత కారణం ఉండాలని వెల్లడించిన విషయాన్ని కూడా ఇప్పటి సుప్రీం కోర్టు తీర్పు పక్కన పెట్టిందని విమర్శలు వస్తున్నాయి. పశ్చిమబెంగాల్ లోని ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చిన అప్పీళ్లలో 90 శాతానికి పైగా, అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కొన్ని నెలల తర్వాత తొలగించబడిన ఓటర్లను మళ్లీ ఓటర్ల జాబితాలో చేర్చారు. ఢిల్లీ లోని మూడోవంతు నియోజకవర్గాల్లో, ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్ల సంఖ్య 2025లో వాస్తవంగా ఓటు వేసిన వారికంటే తక్కువగా ఉంది. ఢిల్లీలో ఆగస్టు 31న విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాలో 97.5లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 31.6 లక్షల మందికి రెండు కారణాల కింద నోటీసులు జారీ చేశారు. ఒకటి ఓటరు వివరాలను సంబంధిత పాత రికార్డులతో సరిపోల్చలేకపోవడం, రెండోది తార్కిక వ్యత్యాసాలు. రెండోది.. ఓటరు వివరాల్లో కొన్ని అసంగతలు ఉండడం. దీంతో 31.6లక్షల మంది ఓటర్లు ఇఆర్‌ఓ, ఎఇఆర్‌ఓ కార్యాలయాలకు స్వయంగా వెళ్లాల్సి వస్తుందేమో అన్న ఆందోళన ఏర్పడింది. అయితే ఇప్పుడు ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం బూత్‌లెవెల్ అధికారులు (బిఎల్‌ఒ) ఓటర్ల ఇళ్లకే వెళ్లి వివరాలను పరిశీలిస్తారు. అత్యవసరమైన, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావలసి ఉంటుంది. అంటే పౌరుడు ఇబ్బందులు పడుతూ అధికారులను సంప్రదించాల్సిన పరిస్థితి లేకుండా సంస్థే పౌరుడు దగ్గరకు వెళ్లే విధానం అమలవుతుంది. అయితే ఈ పనిని కేవలం 14,000 మంది బూత్ లెవెల్ అధికారులు ఎలా నిర్వహిస్తారనేది ఆందోళన కలిగించే విషయం. రాత్రుళ్లు షెల్టర్లలో నివసించే వారు, కూలీలు, పేదలు, నిరాశ్రయులు, మొదలైన వారి వివరాల నమోదు కోసం తగిన హెల్ప్ డెస్కులు, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని ఎన్నికల కమిషన్ చెబుతోంది. మరి ఇది ఎలా అమలవుతుందో చూడాలి. మరో ముఖ్యమైన ఓటరు సమస్య ఫారం 6. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునే ప్రతి పెద్దవారు ఈ ఫారమ్‌ను నింపాలి. ఆన్‌లైన ఫారమ్ 6 లో కొత్త ఓటర్లు తమ తల్లిదండ్రులు, లేదా తాతయ్య, అమ్మమ్మలు చివరి 'సర్'కు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఉన్నారా? అన్నది ప్రకటించాలి. అయితే కొత్త ఓటర్లు ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకుండానే ఫారమ్ 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అయితే 'సర్' ప్రక్రియలో ఇలాంటి నిబంధన ఉండకూడదన్న వాదన వస్తోంది. శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు. ప్రభుత్వ ఆధిపత్యం చెలాయించలేని విధంగా ఉండే ఎంపిక కమిటీ ద్వారా ఎన్నికల కమిషన్‌ను పునర్వ్యవస్థీకరించాలి.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

**అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**






గద్వాల అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర బ్యూరో)ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఎస్ఐఆర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు, తదితర అంశాలపై హైదరాబాదు నుంచి సంబంధిత అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గద్వాలలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు అందుకోవడానికి లేదా అవసరమైన పత్రాలు సమర్పించడానికి కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు. ఇకపై సాధారణంగా ఓటర్లను విచారణ (హియరింగ్) కోసం కార్యాలయాలకు పిలవరాదని సీఈఓ తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని సీఈఓ స్పష్టం చేశారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం-6, ఫారం-7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఫారం-6, పెండింగ్ నోటీసులు, ఫారం-7, ఫారం-8కు సంబంధించిన వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని సీఈఓ సూచించారు. 31.10.2023 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వ్యక్తులు సంబంధిత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి చెందినవారైతే రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన వారు కూడా ప్రస్తుత నమోదు ప్రక్రియలో మరోసారి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదుకు సమర్పించే మార్కుల మెమో జిరాక్స్ ప్రతిని గెజిటెడ్ అధికారి ద్వారా ధృవీకరించి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం అధికారి మంజుల, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ఇళ్ల వద్దే పత్రాల స్వీకరణ

**ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లకు ఇబ్బందులు కలగొద్దు**

**కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**అధికారులతో సీఈఓ పి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్**




వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 1(విజన్ ఆంధ్ర) భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్-2026 ప్రక్రియను పారదర్శకంగా, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం ఎస్ఐఆర్-2026, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర అంశాలపై రాష్ట్ర సీఈఓ పి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.?ఈ సందర్భంగా సీఈఓ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయాలని, అవసరమైన పత్రాలను ఇళ్ల వద్దే స్వీకరించాలని స్పష్టం చేశారు. సాధారణంగా విచారణ కోసం ఓటర్లను కార్యాలయాలకు పిలవవద్దని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఆన్‌లైన్ విధానంలో విచారణ జరపాలని సూచించారు. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. **గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు**31.10.2023 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అర్హత కలిగిన వ్యక్తులు రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకోవచ్చని సీఈఓ తెలిపారు. ప్రస్తుత నమోదు ప్రక్రియకు 01.11.2026ను అర్హత తేదీగా పరిగణించనున్నట్లు స్పష్టం చేశారు.?వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడారు. ఎస్ఐఆర్ నోటీసులను వేగంగా పరిష్కరించడంతో పాటు, ఫారం 6, 7, 8లకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# వార్డు అభివృద్ధి పనుల మంజూరి కోసం ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్ రావు ను కలిసినవార్డ్ కౌన్సిలర్ మాలోతు శ్రీదేవి బాలునాయక్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర): మానుకోట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న, 26 వార్డుకు సంబంధించి, అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్సీ నిధుల నుండి మా వార్డుకి సుమారుగా 20 లక్షల రూపాయలు కేటాయించి, మా వార్డు అభివృద్ధి కోసం మీ వంతుగా సహాయ పడాలని తక్కెలపల్లి రవీందర్ రావుకు వినతి పత్రం ను అందివ్వడం జరిగింది.. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీదేవి మాట్లాడుతూ మా వార్డు మూడు కోట్ల సెంటర్ నుండి కాకతీయ కాలనీ వరకు, ఎటు చూసినా మురికి కాలువలే కనబడతాయి తప్ప, డ్రైనేజీ వ్యవస్థ అనేది ఇప్పటివరకు చేపట్టలేదు. మా వార్డు ప్రజల మీద దయతో, మా వార్డుకు ఎమ్మెల్సీ నిధుల నుండి 20 లక్షల రూపాయలు మీరు మీరు మంజూరు చేస్తే, మేము మా వార్డులో డ్రైనేజీ వ్యవస్థను (సైడ్ కాలువలు) మెరుగుపరచుకుంటాము అని తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీంద్రరావు మాట్లాడుతూ మా ఎమ్మెల్సీకి రావాల్సిన నిధులు, ఇంకా రాలేదు. ఆ నిధుల గురించి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ని చాలాసార్లు విన్నవించుకున్నాము, వారు కూడా సానుకూలంగా స్పందించి, అతి త్వరలో ఎమ్మెల్సీలకు నిధులు ఇస్తాము అని చెప్పారు, కాబట్టి మాకు త్వరలో ఎమ్మెల్సీ నిధులు వస్తాయి కనుక, ఖచ్చితముగా మీ వార్డుకు కొంతమేర నిధులు కేటాయించి, మీ వార్డు అభివృద్ధిలో మేము కూడా భాగస్వాములు అవుతమని భరోసా ఇవ్వడం జరిగింది. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు

# కృతజ్ఞత సభకు హాజరుకావాల్సిందిగా జగ్గారెడ్డి ని ఆహ్వానించిన గ్రామపాలనాధికారులు



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ :1(విజన్ ఆంధ్ర)గ్రామ పాలన అధికారులుగా నియామకం జరిగి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం నాడు సంగారెడ్డి లో నిర్వహిస్తున్న కృతజ్ఞత సభ కు హాజరుకావాలని జిపివో ల సంఘం నాయకులు జగ్గారెడ్డి ని అహ్వానించారు. గురువారం ఐబీ గెస్ట్ హౌస్ లో కలిసి ఈ మేరకు ఆహ్వానం పలికారు. గత ప్రభుత్వం లో విఆర్వో వ్యవస్థ ను చిన్నా భిన్నం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం లో తిరిగి తమ స్వంత శాఖలకు వచ్చామని జగ్గారెడ్డి కి వివరించారు. ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞత తెలియజేస్తూ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిపివో ల కు జగ్గారెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిపివో ల సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి , సుజాత లు , నాయకులు బొంగుల రవి, కూన సంతోష్ , మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ లు పాల్గొన్నారు

# కిక్ బాక్సింగ్ విజేతలకు అందించే బహుమతులు, మెడల్స్ ను ఆవిష్కరించిన జగ్గారెడ్డి



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ :1(విజన్ ఆంధ్ర)సంగారెడ్డి పట్టణంలోని చౌహాన్ ఫంక్షన్ హాల్‌లో అక్టోబర్ 2న నిర్వహించనున్న ఫ్రీడమ్ ఫైటర్స్ మెమోరియల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈ పోటీల్లో విజేతలకు అందజేయనున్న మెడల్స్, బహుమతులను గురువారం నిర్వాహకులు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ ఎండీ సాజిద్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూ రీసర్వే

**హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి**

**హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వనమాల కనపర్తి లో భూ రీసర్వే అవగాహన సదస్సులో పాల్గొన్న అదనపు కలెక్టర్**



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర) భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి గ్రామాలలో భూ రీసర్వే కొనసాగుతుందని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వనమాల కనపర్తి గ్రామంలో భూములు కొలతలు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే భూ రీసర్వే ప్రక్రియపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ రైతుల సమక్షంలో భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేస్తారని అన్నారు. రీసర్వే ప్రక్రియలో సర్వేయర్లకు సంబంధిత రైతులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎల్లస్వామి, హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ విక్రమ్ కుమార్, డీఐ సారంగపాణి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉపాధ్యాయుడిని సన్మానించిన సీఐ శ్రీనివాస్

ములుగు అక్టోబరు 01విజన్ ఆంధ్ర ప్రతినిధి;ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన మహమ్మద్ సర్వర్ అహ్మద్ ను భూపాలపల్లి సీఐ చెన్నూరి శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్వర్ అహ్మద్ ఉద్యోగ జీవితంతో పాటు జర్నలిస్టుగా, సామాజిక సేవలో మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. రిటైర్మెంట్ తర్వాత ప్రజాసేవలో ముందుండాలని సూచించారు. వెంకటాపూర్ లో ఎస్ఐ గా పనిచేసినప్పుడు సర్వర్ అహ్మద్ అండగా నిలిచారని గుర్తు చేశారు. అనంతరం శాలువాతో భూపాలపల్లి సీఐ ని సన్మానించారు. ఇటీవల భూపాలపల్లి సీఐ గా బాధ్యతలు స్వీకరించిన చెన్నూరి శ్రీనివాస్ ను కలం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సర్వర్ అహ్మద్, సీనియర్ జర్నలిస్టులు నల్లబెల్లి సాంబయ్య పటేల్‌శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు



# ఎస్ఐఆర్ పేరుతో 13 కోట్ల ఓట్ల తొలగింపు

**ములుగులో వామపక్షాల నిరసన**




ములుగు అక్టోబర్ 01;విజన్ ఆంధ్ర ప్రతినిధి,ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తూ ములుగు జిల్లా కేంద్రంలో వామపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో వామపక్ష కార్యదర్శులు గుండెబోయిన చంద్రయ్య, బి.రెడ్డి, సాంబశివ, జంపాల రవీందర్ మాట్లాడుతూ ఃంద్ర ఎన్నికల సంఘం చైర్మన్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ను రద్దు చేసి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్, ప్రతిపక్ష నేత, అధికార పక్ష నేత, మేధావులతో కూడిన కొత్త ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పొదిళ్ల చిట్టిబాబు, తుమ్మ వెంకట్ రెడ్డి, రత్నం, రాజేందర్, ముత్యాల రాజు, కొమురయ్య, జక్కుల ఐలయ్య, శ్యాంసుందర్, నరసయ్య, వి. వెంకన్న, ఆదిరెడ్డి, జంగిల్ సుధాకర్ తో పాటు 50 మంది కామ్రేడ్స్ పాల్గొన్నారు.

# పట్టణంలోని నిజాం చెరువు పేరు బతుకమ్మ చెరువుగా మార్చాలి

## ఎల్ది మల్లయ్య గౌడ్ పట్టణ బీజేపీ ఇంచార్జీ



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర):.నిజాం చెరువు పేరుని బతకమ్మ చెరువుగా మార్చాలని బీజేపీ పట్టణ ఇన్చార్జి ఎల్ది మల్లయ్య గౌడ్ డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ మానుకోట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పరిపాలనకు ఆనవాళ్ళుగా ఉన్న వాటిలో పట్టణంలోని నిజాం పేరుపై ఉన్న చెరువు కూడ ఒకటన్నారు. తెలంగాణ మహిళలని బట్టలు ఊడదీసి బతకమ్మ ఆడించడం అడ్డు వచ్చిన వారిని చిత్రహింసలు పెట్టి అతి కిరాతకంగా చంపిన కర్కోటకులైన నిజాం నీచుల పేరిట తెలంగాణలో ఉన్న అన్ని ప్రాంతాల పేర్లు మార్చాలని అన్నారు. తెలంగాణ వచ్చాకా కూడ వారి పేర్లు కనిపించడాన్న ఖండిస్తున్నామని, నాడు బిఆర్ఎస్ ప్రభుత్వం నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ది కోసం నిజాంల జపం చేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే రానున్న బతకమ్మ పండుగ నాటికి నిజాం పేరు తీసేసి బతకమ్మ చెరువుగా నామకరణం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాచవల్ శ్యాం సుందర్ శర్మ, మైనారిటీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రేష్మా, సీనియర్ నాయకులు మాదవపెద్ది శశివర్ధన్ రెడ్డి, 28 వార్డు ఇంచార్జ్ చుక్కల నరేష్, మల్లం యశ్వంత్, పట్టణ ఉపాధ్యక్షుడు రవియాదవ్, సురేష్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు,

# ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

## అధ్యక్ష, కార్యదర్శులుగా మరోసారి మణికంఠ రెడ్డి, లక్ష్మణ్

## ఘనంగా ముగిసిన ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలు

హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర) : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవాల సందర్భంగా నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. హనుమకొండలో సెప్టెంబర్ 28,29,30 తేదీల్లో ఈ ఉత్సవాలు ఘనంగా జరిగాయని, 28వ తేదీన జరిగిన భారీ విద్యార్థి ర్యాలీ దేశం మొత్తం విస్తృత చర్చ జరిగిందని ,29,30 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ 90 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం పోరాటాలు, విజయాలు, విద్యారంగ సమస్యలపై చర్చించడం జరిగిందని,30వ తేదీ న రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర నూతన ఆఫీస్ బేరర్స్ కమిటీని ఎన్నుకున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి పుట్ట లక్ష్మణ్ తెలిపారు. గురువారం హనుమకొండలోని బాలసముద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడిగా కసిరెడ్డి మణికంఠ రెడ్డి(కరీంనగర్), రాష్ట్ర కార్యదర్శిగా పుట్ట లక్ష్మణ్(మేడ్చల్) లు మరోసారి ఎన్నికైనట్లు అదే విధంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఇటిక్యాల రామకృష్ణ(ఖమ్మం), రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా రెహమాన్ (నల్గొండ), రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బానోత్ రఘురాం నాయక్ (నిజామాబాద్), లెనిన్ (ఉస్మానియా యూనివర్సిటీ), ముదిగొండ మురళికృష్ణ (నల్గొండ), బలుముల ప్రేమ్ కుమార్(నాగర్ కర్నూల్), రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా భాషబోయిన సంతోష్ (హనుమకొండ), నెల్లి సత్య (హైదరాబాద్), సామిడి వంశీవర్ధన్ రెడ్డి(రంగారెడ్డి), జేరిపోతుల జనార్ధన్(సిద్దిపేట) ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మణ్




మాట్లాడుతూ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయని, ఈ వార్షికోత్సవాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించి , భవిష్యత్ కార్యచరణ రూపొందించుకున్నామని, దేశంలో రాష్ట్రంలో పాలకులు విద్యారంగాన్ని విస్మరిస్తున్నారని, బిజెపి ప్రభుత్వం విద్యా ప్రైవేటీకరణ, కాషాయీకరణకు కుట్ర చేస్తున్నదని, తెలంగాణ విభజన హామీల ప్రకారం రాష్టానికి కేటాయించాల్సిన విద్యాసంస్థలను కేటాయించకుండా తెలంగాణ పట్ల చిన్న చూపు చూస్తున్నదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, విద్యకు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించకుండా,విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి నియమించకుండా సీఎం రేవంత్ రెడ్డి తర్వాత విద్యాశాఖను తన వద్ద పెట్టుకొని విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడని అన్నారు. రాష్ట్రంలో మద్యం షాపులను పెంచుతూ ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు కుట్ర చేస్తున్నారని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో ప్రభుత్వ విద్య బలోపేతం కోసం పోరాటాలు నిర్వహిస్తామని మణికంఠ రెడ్డి లక్ష్మణ్ తెలిపారు. ఈ విలేఖరుల సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ఇటిక్యాల రామకృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెహమాన్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రఘురాం నాయక్, బాషోబోయిన సంతోష్,లెనిన్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు ప్రణీత్ గౌడ్, వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదెళ్ల శరత్, నాయకులు భాను,వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# మీ ప్రయాణం యాప్ ద్వారా ఉద్యోగులకు హాజరు

## జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది అక్టోబర్ రెండో వారం నుంచి తప్పనిసరిగా మీ ప్రమాణం యాప్ ద్వారా తమ హాజరును నమోదు చేసుకోవాలి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




భూపాలపల్లిజిల్లా 01 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెంపొందించడంతో పాటు ఉద్యోగుల్లో సమయపాలన, విధి నిర్వహణలో క్రమశిక్షణను మెరుగుపరిచేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. యాప్ ద్వారా హాజరు నమోదు ప్రక్రియ సజావుగా అమలయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సిబ్బందికి అవగాహన కల్పించి నమోదు చేపించాలని ఆదేశించారు. అక్టోబర్ రెండో వారం నుంచి హాజరు నమోదు మీ ప్రమాణం యాప్ ద్వారానే నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఇది అన్ని శాఖల అధికారులు సిబ్బంది తప్పని సరిగా పాటించాలని ఎలాంటి మినహాయింపు ఉండదని ఆయన పేర్కొన్నారు. యాప్ వినియోగంపై ఈడీఎం అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించాలి

## అక్రమంగా తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలి

## ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

## హనుమకొండ కలెక్టరేట్ ఎదుట వామపక్షాల భారీ ధర్నా

హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 ( విజన్ ఆంధ్ర ) : భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే తొలగించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ పై సీఈసీ జ్ఞానేష్ కుమార్ వైఖరిని నిరసిస్తూ, అక్రమంగా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, అర్హులైన సామాన్యుల, పేదల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన ప్రతి ఒక్క ఓటును వెంటనే పునరుద్ధరించాలని, అలాగే వివాదాస్పదంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు



చేసినా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం వామపక్షాలు నిరంతరం పోరాడుతాయని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని అన్నారు. దొడ్డి దారిన సీఈసీ ని ఉపయోగించుకునే మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసే వరకు వామపక్షాలు దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శిలు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు అశోక్ స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం,కొట్టెపాక రవి, బత్తిని సదానందం, మాలోతు శంకర్, సిపిఎం జిల్లా నాయకులు సారంపల్లి వాసుదేవ రెడ్డి, ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి,టి.ఉప్పలయ్య,గొడుగు వెంకట్, ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫాంపాండ్ లను నిర్మించునేలా ప్రోత్సహించాలి

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 01 (విజన్ ఆంధ్ర) : పంట పొలాల్లో పామ్ పాండ్ లను నిర్మించుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. గురువారం మోమినిపేట మండలం కొలుకుంద గ్రామ పరిసరాల్లోనీ విబి జి రామ్ జి కింద చేపడుతున్న పనులతో పాటు కస్తూరిబా విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సౌకర్యాలు, గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....అదేవిధంగా జలసిరి పథకం గురించి ప్రజలకు తెలియజేస్తూ గ్రామాల్లో విబి జి రామ్ జి కింద రాంజీ చేపడుతున్న పనులలో భాగంగా పెద్ద మొత్తంలో ఇంకుడు గుంతలు, పొలాల వద్ద నీటి గుంతలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడవద్దని, మస్టర్ రోల్ లను సక్రమంగా నిర్వహిస్తూ కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎల్నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పడతాయని ఇంకుడు, నీటి గుంతలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ముందు తరాలకు ఎంతగానో దోహదపడుతుందని దీనికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ తెలిపారు. చంద్రాయన పల్లిలోని కస్తూరిబావిద్యాలయంలో నూతనంగా నిర్మిస్తున్న భవన పనులను త్వరితగతిన చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలని అదే విధంగా మురుగు నీరు నిలవకుండా తగు చర్యలు



తీసుకోవాలని అధికారులు ఆయన సూచించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీలలో భాగంగా అవుట్ పేషంట్ రిజిస్టర్, మందుల నిల్వ, ల్యాబ్, సిబ్బంది హాజరు పట్టీకలు ఆయన పరిశీలించారు. వైద్యులు సమయపాలన పాటించాలని, గర్భిణీలకు, బాలింతలకు నిరంతర వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ప్రసూతి వివరాలను జిల్లా కలెక్టర్ వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. మోమిన్ పేట గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులు, నూతనంగా ఓటరుగా నమోదు చేసుకున్న ఫారం-6 లను కలెక్టర్ పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని, తప్పులు లేకుండా జాబితా రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని , తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీఓ సృజన, వైద్యాధికారి బుచ్చిబాబు, ఎంఈఓ నరసింహులు, ఏపీఓ శంకరయ్య, ప్రిన్సిపాల్ పద్మావతి, సర్పంచులు విశాల, శివ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఇందిర, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ.రైల్వే యొక్క టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును

టెండరు ప్రకటన
PUB/693

భారత రాష్ట్రపతి తరపున మరియు కొరకు సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, హైదరాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ ఈ క్రింది పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా 22.10.2026న ఉదయం 11:30 గంటల వరకు బహిరంగ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ తేదీ: 30.09.2026

క్ర.సం.: 1, టెండర్ నెం. Y/SG/36/2026-27/20, పని పేరు: హైదరాబాద్ డివిజన్ - రైల్ నిలయం మరియు లాన్సర్ లైన్స్ ఆఫీసర్ క్వార్టర్స్ FTH వద్ద మల్టీ-గిగ్ స్విచ్‌లు మరియు కోర్ స్విచ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా రైల్ నెట్ మౌలిక సదుపాయాల మెరుగుదల; S&T ప్రధాన కార్యాలయ డ్రాయింగ్ విభాగంలో మెరుగుదల పనులు. టెండర్ విలువ (రూ.): 8,97,97,081.21, ఇఎండి (రూ.): 17,96,000.00.

బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కోసం https://ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి. ఏవైనా సవరణలు ఉంటే అవి ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ / హైదరాబాద్

ఓపెన్ ఇ-టెండరు నోటీస్ నెం.లు సి/ఇ.29/ఇఎల్ఇసి/ఎం/ఎస్‌సి/పిఎ/ఒటి/2026-27 తేది: 30.09.2026
PUB/694

భారత రాష్ట్రపతి తరపున మరియు కొరకు ఈ దిగువ పేర్కొన్న పని కోసం 26.10.2026న 15:00 గంటల వరకు ఇ-టెండర్ ఆహ్వానించబడుతోంది.

క్ర.సం.1, ఇ-టెండర్ నెం.: etender C/E.29/Elec/M/SC/49/PA/OT/ 2026-27 etender E-M-SC-49-OT-2026-27. పని పేరు: సికింద్రాబాద్ డివిజన్ ఎలక్ట్రికల్ నిర్వహణ విభాగం - లిఫ్ట్‌ల ఏర్పాటు: (i) SKP (02) మరియు SEM (02 నెం.లు) లిఫ్ట్‌ల ఏర్పాటు. (ii) LTRR (02 నెం.లు) మరియు UDGR (02 నెం.లు) లిఫ్ట్‌ల ఏర్పాటు. (iii) DKJ (03 నెం.లు) మరియు KDM (02) లిఫ్ట్‌ల ఏర్పాటు (iv) జమ్మికుంట (JMKT) (02 నెం.లు) మరియు సిర్పూర్ కాగజ్‌నగర్ (SKZR) (03 నెం.లు) లిఫ్ట్‌ల ఏర్పాటు (v) GNP (02 నెం.లు), ALER (02 నెం.లు), BG (02 నెం.లు), GT (03 నెం.లు) మరియు MLY (02 నెం.లు) లిఫ్ట్‌ల ఏర్పాటు (vi) FNB (01 నెం.లు), JET (02 నెం.లు), KQD (02 నెం.లు), NCHS (02 నెం.లు), NLRD (02 నెం.లు) మరియు SJVP (02 నెం.లు) వద్ద లిఫ్ట్‌లు మరియు సంబంధిత విద్యుత్ ఏర్పాట్లు. టెండర్ విలువ (రూ): 7,65,35,400.50, ఇఎండి(రూ.): 15,30,700.00, సిటిఎఫ్ (రూ): 0.00, పని పూర్తి చేయు కాలం: 6 నెలలు.

టెండర్ షరతులు మరియు ఇతర వివరాలు IREPS వెబ్‌సైట్ www.ireps.gov.in లోని టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి. వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టెండర్‌లో పాల్గొనవచ్చు మరియు ఏవైనా సవరణలు ఉంటే వాటిని చూడవచ్చు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ఎం)/ సికింద్రాబాద్

A803

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి

# రాజకీయ యవనికపై 'ఏకం భారత్ పార్టీ' అరంగేట్రం

## పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక అవగాహన

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర)కులం, మతం, వర్గం అనే రాజకీయ అడ్డుగోడలను బద్దలుకొట్టి, భారతదేశంలో సరికొత్త రాజకీయ విప్లవానికి నాంది పలుకుతూ 'ఏకం భారత్ పార్టీ' వరంగల్-ఖమ్మం-నల్గొండ ( డబ్ల్యూ కే ఎన్ ) పట్టభద్రుల ఎన్నికల క్షేత్రంలోకి అడుగుపెట్టింది. కుల మతాలకు అతీతంగా విద్యావంతులైన యువతను ఏకం చేసి, అవినీతి రాజకీయాలకు చరమగీతం పాడాలనే లక్ష్యంతో ఏకం భారత్ పార్టీ ప్రస్థానం మొదలైందని పార్టీ వర్గాలు ప్రకటించాయి. పార్టీ ఆగమనం సందర్భంగా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో, యువతలో ఓటు హక్కుపై చైతన్యం తీసుకురావడానికి పార్టీ ఆధ్వర్యంలో ఒక "ప్రత్యేక ఓటరు నమోదు అవగాహన కార్యక్రమాన్ని" నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... చదువుకున్న విద్యావంతులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవడంలో కనీస ఆసక్తి చూపకపోవడం అత్యంత విచారకరం అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావంతులు ఓటింగ్

**- యువత ఆసక్తి చూపకపోవడంపై నాయకుల ఆవేదన**

ప్రక్రియకు దూరంగా ఉంటే, ప్రజాస్వామ్యం అవినీతిపరుల చేతుల్లోకి వెళ్తుందని వారు హెచ్చరించారు. నాణ్యమైన ఉచిత విద్య, స్థానికంగానే ఐటీ, ఫార్మా ఉద్యోగాల కల్పన, మరియు ఓటుకు నోటు వ్యవస్థను రూపుమాపడమే ప్రధాన ధ్యేయంగా ఏకం భారత్ పార్టీ పనిచేస్తుందని వారు తెలిపారు. ఓటును అమ్ముకునే బానిస బతుకులు వదిలేసి, వ్యవస్థను శాసించే నాయకులుగా ఎదగాలని, ఈ మార్పు కోసం వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు చెందిన విద్యావంతులు, సామాజిక కార్యకర్తలు వాలంటీర్లుగా కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ ముఖ్యమైన సమావేశంలో ఏకం భారత్ పార్టీ ప్రెసిడెంట్ బ్రదర్ షఫీ (బ్రదర్ షఫీ ), మరియు వైస్-ప్రెసిడెంట్ గజేందర్ దాన్ (గజేందర్ దాన్ ) పాల్గొన్నారు. గ్రాడ్యుయేట్స్ ఓటు - మార్పు కోసం ఓటు! ఏకం భారత్ - మతం లేదు, కులం లేదు, మనమంతా ఒక్కటే! నినాదంతో ముందుకు పోతున్నారు

# జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ర్యాలీ, రక్తదాన శిబిరం

## స్వచ్ఛంద రక్తదానం ప్రాణదానంతో సమానం

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డాక్టర్ అప్పయ్య

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర,) జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ( జి ఎం హెచ్ ) రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన ర్యాలీ, స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలోని పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం ( యు ఎఫ్ డబ్ల్యు సి ) వద్ద ప్రారంభమైన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జెండా ఊపి ప్రారంభించారు. కుమార్‌పల్లి మీదుగా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన ఆవశ్యకతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మాట్లాడుతూ, రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయంలో ఉన్నవారికి సకాలంలో రక్తం అందించి వారి ప్రాణాలను కాపాడవచ్చుని తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ఇది ఒక గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. 18 సం.ల నుండి 60 సం.ల వయస్సు గల వారు రక్త దానం చేయాలి. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అధికారులు స్వచ్ఛంద రక్తదాన ప్రతిజ్ఞ



చేశారు. ఆ తర్వాత ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించగా 15 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మదన్ మోహన్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల, రక్తనిధి కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిఖిల, పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ అనిల్, మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, సీహెచ్ఓ ప్రేమలత, డెమోలు సువార్త, ఎల్లయ్య, రవీందర్, ఎంపీహెచ్ఈఓ విప్లవ్ కుమార్, ల్యాబొరేటరీ టెక్నీషియన్లు శ్రీనివాసరావు, జ్యోతి, పీహెచ్ఎన్ రామేశ్వరి, సూపర్‌వైజర్ బజ్జీ సమ్మా, హెల్త్ అసిస్టెంట్లు రాజేష్, సత్యనారాయణ, శ్రీనివాస్, కమలాకర్, కేసి కుమార్, శరత్, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దిశా సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ అంశాలపై విస్తృత చర్చ

## రోడ్డు భద్రత, విద్యా వ్యవస్థ, చిన్నారుల రక్షణపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధికారులకు

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర)హనుమకొండ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం హనుమకొండ జిల్లా సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, దిశా కమిటీ చైర్మన్ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు , హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై అధికారులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. ముందుగా గత మార్చి 7న నిర్వహించిన దిశా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, సూచనలపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యల నివేదికలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలు, పూర్తయిన పనులు, అమలు దశలో ఉన్న కార్యక్రమాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయం, ఉద్యానవనం, విద్య, వైద్య--ఆరోగ్యం, రోడ్లు, రోడ్డు భద్రత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు




అర్హులైన నిరుపేదలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రతపై అధికారులతో చర్చసమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు గారు రోడ్డు భద్రత అంశంపై ప్రత్యేకంగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, రహదారి నిర్వహణపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యా వ్యవస్థపై సమీక్షజిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల అందుబాటు తదితర అంశాలపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టిముస్కాన్ ఆపరేషన్ ద్వారా చిన్నారుల రక్షణ, బాల కార్మికుల నిర్మూలన, తప్పిపోయిన లేదా రక్షణ అవసరమైన పిల్లలను గుర్తించి వారికి భద్రత కల్పించే అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. చిన్నారుల భద్రత విషయంలో పోలీస్, మహిళా--శిశు సంక్షేమ, విద్యాశాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందేలా చూడాలని సమావేశంలో ప్రజాప్రతినిధులు అధికారులకు సూచించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై అధికారులు సమగ్ర వివరాలను దిశా కమిటీకి అందించారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బిజెపి తీర్థం పుచ్చుకున్న వివిధ పార్టీలకు చెందిన యువకులు

## బిజేపి కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించిన ఎంపీ డీకే అరుణ



గద్వాల అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన యువకులు పెద్ద ఎత్తున బీజేపీలో చేరడం జరిగింది. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ జూబ్లీహిల్స్ నివాసంలో వివిధ పార్టీలలో నుంచి బీజేపీ లో చేరిన యువకులకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారునరేంద్రమోదీ నాయకత్వం, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై, వికాసిత్ భారత్ లో భాగస్వామ్యం అయ్యేందుకు యువత బీజేపీ లో చేరడం ఆనందంగా ఉందని ఎంపీ డీకే అరుణ అన్నారు.భవిష్యత్ లో పార్టీ కోసం కస్టపడి పని చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మల్దకల్ మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి,సద్దలోని పల్లి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# నవీన్ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిచ్చారు

## క్రీడాకారులను తీర్చిదిద్దడంలో ముగ్గురిదీ ఒకటి ఆశయం



నారాయణపేట , అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర) దామరగిద్ద గురుకుల పాఠశాలదామరగిద్ద గురుకుల పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా నవీన్, తన 9 సంవత్సరాల ప్రయాణంలో ఎంతోమంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్ది, వారికి మంచి భవిష్యత్తుకు బాటలు వేశారు. క్రీడాకారులను తీర్చిదిద్దడంలో నవీన్ చక్రవర్తి గణేష్, లది ఒకటి ఆశయం ఎన్నో ప్రతిభలను వెలికితీసి, క్రీడా రంగంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన నవీన్‌తో కలిసిన రెండు సంవత్సరాల ప్రయాణంనవీన్ ఇచ్చిన అవకాశంతో ఆయనతో కలిసి సుమారు రెండు సంవత్సరాలు పనిచేసేఅవకాశం లభించింది.ఆ సమయంలో ఎంతోమంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడంతో పాటు, వారిని జాతీయ స్థాయి వరకు తీసుకెళ్లడానికి మేమిద్దరం కలిసి కృషి చేశాం. ఆ ప్రయాణం నా జీవితంలో మరచిపోలేని అధ్యయనమని పేర్కొన్నారు. మా తర్వాత గణేష్ రాకతో మరింత ముందుకుమేము అక్కడి నుంచి ముందుకు సాగిన తర్వాత మా తమ్ముడు గణేష్ రావడంతో విద్యార్థులకు మరింత ప్రోత్సాహం లభిస్తూ, వారి క్రీడా ప్రయాణం విజయవంతంగా కొనసాగుతోంది. విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారికి సరైన మార్గదర్శకత్వం అందిస్తూ గణేష్ కూడా తన వంతు కృషి చేస్తున్నారని గుర్తు చేశారు.ముగ్గురి కలయిక -- ఒక గొప్ప ప్రయాణంమా ముగ్గురి కలయికలో ఒకరు మోటివేటర్,ఒకరు కోచ్,మరొకరు ఫిజికల్ డైరెక్టర్.ముగ్గురి ఆలోచన ఒకటే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంవారిలోని ప్రతిభను వెలికితీయడం విజయాల వైపు నడిపించడంమా స్కూల్‌లో చదివిన ఎంతోమంది విద్యార్థులు క్రీడల ద్వారా తమ జీవితాలను మంచి మార్గంలో తీర్చిదిద్దుకోవడం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందని నవీన్ చక్రవర్తి గణేష్ పేర్కొన్నారు. దీంతో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ లతోపాటు ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

# అంగన్వాడీలకు వచ్చే పిల్లలకు సమతుల్య పౌష్టికాహారం అందించాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి 1:(విజన్ ఆంధ్ర)జిల్లాలోని అంగన్వాడి కేంద్రాలకు వచ్చే పిల్లలకు సమతుల్యమైన పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గల అంగన్వాడీ కేంద్రంలో చేపట్టిన తొలిముద్దు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మెంగ్రే ఆకాష్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే 3 – 6 సంవత్సరాల వయసు గల పిల్లలకు సమతుల్య పౌష్టిక ఆహారం అందించి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తల్లులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు తీసుకువచ్చి తొలిముద్ద అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు ఉప్మా, కిచిడీతో కూడిన అల్పాహారాన్ని అందించి తినిపించారు. అనంతరం జనకాపూర్ లోని రైతు వేదికలో పోషణ మాసంలో భాగంగా ఏర్పాటు చేసిన గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు, గర్భిణుల సంక్షేమం కొరకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వినియోగించుకోవాలని, అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టిక ఆహారం సకాలంలో తీసుకోవాలని తెలిపారు. పరిశుభ్రత, ఆరోగ్య రక్షణ, ప్రారంభ విద్యపై మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, కౌన్సిలర్ కొండు భారతి, ఐ సి డి ఎస్ సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులని నిర్లక్ష్యం చేస్తే చట్టపకారం కఠిన చర్యలు తప్పవు

## వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది . ఎమ్మెల్యే జి ఎస్ ఆర్.




భూపాలపల్లి జిల్లా అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర)గురువారం ఐడీఓసీ కార్యాలయంలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే సంతానంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. తల్లిదండ్రులను వేధిస్తూ, వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే వారిపై వయోవృద్ధుల సంక్షేమ చట్టం ప్రకారం చర్యలు తీసుకునే అధికారం ఉందన్నారు. అవసరమైతే పిల్లల పేరిట బదిలీ చేసిన ఆస్తులను తిరిగి తల్లిదండ్రుల పేరు మీదకు మార్చే అవకాశం కూడా ఉందని వివరించారు. అర్హులైన వయోవృద్ధులందరికీ సీనియర్ సిటిజన్ ఐడీ కార్డులు అందజేయడంతో పాటు నిబంధనల ప్రకారం రేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. వయోవృద్ధులు ఆహ్లాదకరంగా సమయం గడిపేందుకు భూపాలపల్లిలోని హనుమాన్ నగర్‌లో డే కేర్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అక్కడ ఆటలు, భోజనం, టీ వంటి సదుపాయాలు కల్పించామన్నారు. శాశ్వత డే కేర్ సెంటర్ నిర్మాణం చేపడుతున్నామని, పనులు పూర్తయిన వెంటనే అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ... వయోవృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం ద్వారా వారి హక్కులకు చట్టపరమైన రక్షణ కల్పించిందని తెలిపారు. పిల్లలు తల్లిదండ్రుల పోషణ బాధ్యతను విస్మరిస్తే ఆర్డీఓ కోర్టు ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంక్షేమం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు జిల్లా వ్యాప్తంగా వయోవృద్ధుల వారోత్సవాలు నిర్వహించి పలు సేవా, అవగాహన కార్యక్రమాలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. వయోవృద్ధుల అపార అనుభవం, సలహాలు సమాజాభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని, వారికి అవసరమైన సౌకర్యాలు, సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్రా కొమురయ్య, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, డీఎంహెచ్‌ఓ డా మధుసూదన్, డీఆర్‌డీఓ బాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు. వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు అక్టోబర్ 9న మెగా జాబ్ మేళా

## ఈ జాబ్ మేళాలో 300 కంపెనీలు పాల్గొంటాయి 20 వేల మందికి ఉపాధి కలుగుతుంది. ఎమ్మెల్యే .. జి ఎస్ ఆర్.



భూపాలపల్లి జిల్లా ఒకటి అక్టోబర్ (విజన్ ఆంధ్ర)నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అక్టోబర్ 9న భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ లో మెగా జాబ్‌మేళా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. గురువారం ఐడీఓసీలో జాబ్‌మేళా ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతి రాజ్, డిఆర్డీఓ సింగరేణి, జెన్కో, తదితర శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... జాబ్‌మేళాలో 300కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయని, 20 వేల మంది నిరుద్యోగ యువతను సమీకరించి ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై జాబ్‌మేళాను ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఎంపీ కడియం కావ్యతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని వెల్లడించారు. జాబ్ మేళా నిర్వహణ సమాచారం ప్రతి గ్రామానికి చేరాలని గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.ప్రతి గ్రామంలో నిరుద్యోగ యువతను గుర్తించి జాబ్‌మేళాకు వచ్చేలా చూడాలని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అక్టోబర్ 6 లోగా గ్రామాల వారీగా చదువుకున్న నిరుద్యోగ యువత వివరాలను సేకరించాలని స్పష్టం చేశారు. ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే నిరుద్యోగ యువతకు ఉచిత రవాణా సదుపాయం కల్పించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జాబ్‌మేళా ప్రాంగణంలో మధ్యాహ్న భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలని తెలిపారు. తక్కువ వ్యవధి ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు చేపడుతున్న జాబ్‌మేళాను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. గతంలో నిర్వహించిన, జాబ్‌మేళాలో 10 వేలకు పైగా యువత పాల్గొనగా, సుమారు 2,770 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈసారి కూడా సింగరేణి, జెన్కో యాజమాన్యాలు, టాస్క్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులకు మేళా ప్రాంగణంలోనే ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ నియామక పత్రాలు అందించనున్నట్లు వివరించారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. విద్యార్హతలు ప్రామాణికంగా ఉద్యోగ అవకాశాలు ఉంటాయని సూచించారు. నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎఎస్పీ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, డిఆర్డీఓ బాలకృష్ణ, సింగరేణి జిఎం రాజేశ్వర రెడ్డి, జన్కో ఎస్ ఈ ముత్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

# 13 కులాంతర వివాహ జంటలకు ప్రోత్సాహక బహుమతులను అందజేసిన

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల అక్టోబర్ 01 (విజన్ ఆంధ్ర బ్యూరో)కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.గురువారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్‌లో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం మంజూరు చేసిన ప్రోత్సాహక మొత్తానికి సంబంధించిన బాండ్లను గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న కులాంతర వివాహ ప్రోత్సాహక పథకం కింద గద్వాల నియోజకవర్గానికి చెందిన 8 మంది,అలంపూర్ నియోజకవర్గానికి చెందిన 5 మంది --- మొత్తం 13 కులాంతర వివాహ జంటలకు ప్రోత్సాహక బహుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు.ఒక్కో జంటకు రూ.2.50 లక్షల చొప్పున మొత్తం 13 మందికి రూ.32.50 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. మంజూరైన ప్రోత్సాహక మొత్తాన్ని ఎస్సీ అభివృద్ధి శాఖ ద్వారా సంబంధిత జంటల పేర్లపై ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో బాండ్లుగా అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. కులాంతర వివాహాల ద్వారా కుల,సామాజిక భేదాలను అధిగమించి సమానత్వ భావన పెంపొందుతుందని తెలిపారు.గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ కులాంతర వివాహాలను ప్రోత్సహించడం ద్వారా సామాజిక సామరస్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అర్హులైన కులాంతర వివాహ జంటలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు వారి భవిష్యత్ జీవితానికి ఉపయోగపడేలా ఉంటాయని,అర్హత కలిగిన ప్రతి జంట ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ శాఖల అధికారులు, సిబ్బంది, కులాంతర వివాహం చేసుకున్న జంటలు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి సర్వే ప్రక్రియను పారదర్శకంగా చేయాలని భూభారతి సర్వే ప్రక్రియను పారదర్శకంగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 01 అక్టోబర్ (విజన్ ఆంధ్ర)జిల్లాలో భూ భారతి రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు.గురువారం కోహెడ మండల కేంద్ర పరిధిలోని జుమ్లా తండా లో నిర్వహించిన భూ భారతి రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..దాదాపు 90 సంవత్సరాలుగా క్రితం భూ సర్వే నిర్వహించారని మారుతున్న కాలం తో పాటు పెరిగిన జనాభా వలన భూమీ కొరత కారణంగా భూ సమస్యలు అధికంగా తలెత్తాయని, ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి – రీ సర్వే ను నిర్వహిస్తుందని తెలిపారు.భూ రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రీ-సర్వే సమయంలో భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు, హద్దులు, పట్టా వివరాలు తదితర అంశాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చి నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో రైతులు, భూ హక్కుదారుల సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు.రీ-సర్వే పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, భూ రికార్డులను పకడ్బందీగా నవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ముందుగా గ్రామ సరిహద్దు నిర్దేశించి, ప్రభుత్వం స్థలాలలో సర్వే చెయ్యాలని, తర్వాత పట్టా, అసైన్డ్ భూములను సర్వే చెయ్యాలని సర్వే అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట తహసిల్దార్ ఎస్. నవీన్ కుమార్, అర్ఐ, సర్వే అధికారులు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల అక్టోబర్ 01 (విజన్ ఆంధ్ర బ్యూరో)గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై విస్తృతంగా అవగాహన కల్పించి,అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ ఎస్ఐఆర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు పై అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్‌లో భాగంగా 1,49,282 నోటీసులు జారీ చేసి,వాటి పంపిణీ,విచారణ ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు 1,32,459 విచారణలు పూర్తయ్యాయని , సంబంధిత ఆధారాలను తహసీల్దార్ల లాగిన్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు.పెండింగ్‌లో ఉన్న విచారణలను ప్రాధాన్య క్రమంలో త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అర్హతకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో ఎలాంటి తప్పులు లేకుండా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అనర్హులు,ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారు,మరణించిన ఓటర్లకు సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి,తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు అర్హులైన పట్టభద్రులు ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకునేలా మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.తహసీల్దార్లను డిజిగ్నేటెడ్ అధికారులుగా నియమించిన నేపథ్యంలో సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరించి, నిబంధనల ప్రకారం పరిశీలన చేపట్టాలని తెలిపారు .అర్హత కలిగిన పట్టభద్రులు తమ ఒరిజినల్ డిగ్రీ ధ్రువపత్రాన్ని పరిశీలనకు సమర్పించేలా అవగాహన కల్పించాలని, ధ్రువపత్రాల పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పత్రాల పరిశీలనలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.జిల్లాలోని డిగ్రీ కళాశాలలు, విద్యాసంస్థలు, ఉపాధ్యాయ సంఘాలు,ఇతర సంబంధిత వర్గాలతో సమావేశాలు నిర్వహించి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడికి సమాచారం చేరేలా మండల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస రావు,ఏఓ మంజుల, రాజకీయ పార్టీ ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

## జిల్లా కలెక్టర్ కె.హరిత

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1;(విజన్ ఆంధ్ర)అనారోగ్యంతో, ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ, ప్రమాదాలకు గురై అత్యవసర సమయంలో రక్తం అవసరం ఉన్న వారికి రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా నిలువవచ్చని, రక్తదానం చేయడంతో శరీరంలో నూతన రక్తం పెంపొందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకన్న, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 1, (విజన్ ఆంధ్ర)అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరై వృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు.జిల్లాలోని 21 గ్రామీణ మండలాల నుంచి సుమారు 250 మంది వృద్ధ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించి వృద్ధ మహిళలకు వైద్య పరీక్షలు చేపట్టారు. బీపీ, షుగర్, థైరాయిడ్, లివర్, కిడ్నీ తదితర ఆరోగ్య అంశాలకు సంబంధించి వివిధ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, వృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు తల్లిదండ్రులు మరియు వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం ఎంతో ప్రాధాన్యత కలిగిందని తెలిపారు. తల్లిదండ్రులు, వృద్ధులను సంరక్షించడం పిల్లల ప్రాథమిక బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. వృద్ధులు నిర్లక్ష్యం, వేధింపులకు గురైన సందర్భంలో చట్టపరమైన పరిష్కారాలను పొందవచ్చని తెలిపారు.వృద్ధులు తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్యాలయం, మండల అభివృద్ధి అధికారి కార్యాలయం, మండల రెవెన్యూ అధికారి కార్యాలయం, మండల మహిళా సమాఖ్య లేదా జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని అదనపు కలెక్టర్ సూచించారు. అలాగే, తమ పేరుపై ఉన్న ఆస్తులను తొందరపడి ఇతరుల పేర్లపై బదలాయించవద్దని, ఆస్తుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.పిడి డీఆర్‌డీఏ శ్రీమతి శ్రీలత మాట్లాడుతూ, అర్హులైన వృద్ధులకు ప్రభుత్వం ద్వారా ప్రతి నెలా సామాజిక భద్రతా పింఛన్లు అందుతున్నాయని తెలిపారు. నూతన పింఛన్ల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని, నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారికి పింఛన్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు.కార్యక్రమంలో ఎస్ ఈ ఆర్ పి నుంచి పద్మ, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు శ్రీమతి అశ్విని, సునీత, ప్రేమలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులు హాజరు శాతం పెంపొందించాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1,;(విజన్ ఆంధ్ర)ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల హాజరు శాతం పెంపొందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి లతో కలిసి మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానమంత్రి శ్రీ పాఠశాలల ఉపాధ్యాయులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రిన్సిపాళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ లో జిల్లా ర్యాంకు తక్కువగా ఉందని, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం తక్కువగా నమోదు అయిందని తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన, ప్రతి పాఠశాలలో మూత్రశాలలు, త్రాగునీటి సౌకర్యం వంటి వివరాలను యు డైస్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. కొన్ని పాఠశాలలలో తరచుగా అనుమతి లేకుండా పాఠశాలలకు గైర్హాజరు అవుతున్న ఉపాధ్యాయులను గుర్తించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తెలిపారు. మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలను తరచుగా సందర్శించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించాలని, సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతంలో పురోగతి సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రణాళికా సమన్వయకర్తలు శ్రీనివాస్, అబిద్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సౌర విద్యుత్ వినియోగంతో పర్యావరణ పరిరక్షణ

### జిల్లా కలెక్టర్ కె.హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1,:(విజన్ ఆంధ్ర)సౌర విద్యుత్ వినియోగంతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన క్రింద సౌర విద్యుత్ వినియోగంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని, ఈ పథకం ద్వారా గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇండ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంటును ఏర్పాటు చేసుకోవడంతో ప్రతి నెల 360 యూనిట్ల వరకు విద్యుత్ ను పొందవచ్చని తెలిపారు. సోలార్ వినియోగం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించవచ్చని, అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ అవగాహన పెంచుకొని, సోలార్ విద్యుత్ వినియోగించుకునేలా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 2న కిసాన్ ఫ్యాషన్ మాల్ పునఃప్రారంభం

### – నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ చేతుల మీదుగా




కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 30 (విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆధునిక హంగులతో పునరుద్ధరించిన కిసాన్ ఫ్యాషన్ మాల్ అక్టోబర్ 2న పునఃప్రారంభం కానుంది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ఫ్యాషన్ మాల్‌ను ప్రారంభించనున్నారు. జిల్లా కేంద్రంగా కామారెడ్డి అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పట్టణంలో వాణిజ్య కార్యకలాపాలు కూడా విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలో కిసాన్ ఫ్యాషన్ మాల్‌ను ఆధునిక వసతులు, అధునాతన వస్త్రాల విభాగాలతో పునరుద్ధరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంగా ఏర్పడిన అనంతరం వివిధ మండలాల నుంచి ప్రజల రాకపోకలు పెరిగాయి. జిల్లా కేంద్రంలో ప్రధాన వాణిజ్య సంస్థలు అందుబాటులోకి రావడంతో కొనుగోళ్ల కోసం చుట్టుపక్కల మండలాల ప్రజలు కామారెడ్డికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో కిసాన్ ఫ్యాషన్ మాల్ పునఃప్రారంభం కావడం పట్టణ వాణిజ్య రంగానికి మరింత ఊతమివ్వనుందని నిర్వాహకులు పేర్కొన్నారు. అధునాతన వస్త్రాలు, ఆధునిక షాపింగ్ వసతులతో కిసాన్ ఫ్యాషన్ మాల్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. పునఃప్రారంభ కార్యక్రమానికి ప్రజలు, వ్యాపారవర్గాలు, స్థానికులు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## పీర్జాదిగూడలో షాపింగ్ సందడి

### రష్మి గౌతమ్‌తో మాంగళ్య ఎగ్జిబిషన్ ప్రారంభం
### పళని కన్వెన్షన్‌లో మెగా షాపింగ్ జాతర..18 రోజుల పాటు సందడి
### ఒకేచోట వేలాది ఉత్పత్తులు..మాంగళ్య ఎగ్జిబిషన్‌కు ఘన శ్రీకారం
### రష్మి గౌతమ్ రాకతో కళకళలాడిన మాంగళ్య షాపింగ్ ఎగ్జిబిషన్



బోడుప్పల్,అక్టోబర్01(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్‌లో ఉన్న పళని కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన మాంగళ్య షాపింగ్ మాల్ మెగా ఎగ్జిబిషన్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ సినీ నటి,టెలివిజన్ వ్యాఖ్యాత రష్మి గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులు నమశివాయతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.అనంతరం ఆమె వివిధ స్టాల్స్‌ను సందర్శించి అక్కడ ప్రదర్శనకు ఉంచిన ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా రష్మి గౌతమ్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఒకే వేదికపై నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటు ధరల్లో అందించే ఇలాంటి ఎగ్జిబిషన్‌లు ఎంతో ఉపయోగకరమని అన్నారు.ఎగ్జిబిషన్‌లో మహిళలు,యువత,పిల్లలు,కుటుంబ సభ్యుల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల వస్త్రాలు,డిజైనర్ చీరలు, రెడీమేడ్ దుస్తులు తదితర విభాగాలకు చెందిన వందలాది స్టాల్స్ ఏర్పాటు చేశారు.ప్రత్యేక తగ్గింపు ధరలు,పండుగ ఆఫర్లు,ఆకర్షణీయమైన కొనుగోలు పథకాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.నిర్వాహకులు మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్‌ను 18 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యాపార సంస్థలు,ప్రముఖ బ్రాండ్లు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు.దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ప్రజలకు మెరుగైన షాపింగ్ అనుభూతిని కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు,అభిమానులు, వ్యాపారవేత్తలు, నిర్వాహకులు హాజరయ్యారు.రష్మీ గౌతమ్‌తో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఆసక్తి చూపగా ఎగ్జిబిషన్ ప్రాంగణం సందర్శకులతో కిక్కిరిసిపోయింది.

## మాజీ సర్పంచ్ బుచ్చిరాం మృతికి కోనేరు కోనప్ప నివాళులు అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే



కాగజ్‌నగర్, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర): పెంచికల్‌పేట్ మండలం కమ్మర్‌గాం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ బుచ్చిరాం మృతి చెందారు. సుమారు 30 సంవత్సరాల పాటు సర్పంచ్‌గా కొనసాగుతూ గ్రామ ప్రజలకు ఆయన విశేష సేవలందించారు. బుచ్చిరాం మృతి విషయం తెలుసుకున్న సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కమ్మర్‌గాం గ్రామంలోని ఆయన స్వగృహానికి చేరుకున్నారు. బుచ్చిరాం పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బుచ్చిరాం తనకు ఎంతో ఆత్మీయుడని, సుదీర్ఘకాలం ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని కోనప్ప పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో కోనేరు కోనప్ప పాల్గొని పాడె మోశారు. బుచ్చిరాం మృతి గ్రామానికి తీరని లోటని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు, బుచ్చిరాం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సెమినార్‌ను విజయవంతంగా నిర్వహణ



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1(విజన్ ఆంధ్ర)కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఁ సైన్స్ వరంగల్ (కిట్స్‌డబ్ల్యు) యొక్క డీన్, రీసెర్చ్ ఁ డెవలప్‌మెంట్ ఆఫీస్ (ఆర్ ఁ డి), క్యాంపస్‌లోని సిల్వర్ జూబ్లీ సెమినార్ హాల్‌లో "పరిశోధన నిధులను పొందడం; అవకాశాలు మరియు వ్యూహాలు" అనే అంశంపై ఒక సాంకేతిక సెమినార్‌ను నిర్వహించాము అని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తెలిపారు. అధ్యాపకుల పరిశోధన నైపుణ్యాలను మెరుగుపరచడానికి మరియు పరిశోధన ప్రాజెక్టులను అమలు చేయడానికి ఎన్ఐటి వరంగల్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం లో భాగంగా దీనిని నిర్వహించామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఫార్మర్ రాజ్యసభ, యం.పి, కిట్స్ చైర్మన్, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, కిట్స్ వరంగల్, కోశాధికారి పి. నారాయణ రెడ్డి , హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే, వి. సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి విజయవంతంగా నిర్వహించిన డీన్, రీసెర్చ్ ఁ డెవలప్‌మెంట్ ఆఫీస్ విభాగాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్ఐటి వరంగల్, డీన్, అంతర్జాతీయ సంబంధాలు ఁ పూర్వ విద్యార్థుల వ్యవహారాలు (ఐ అర్ఏఏ), ఏఐసిటిఇ విశిష్ట వృత్తి నిపుణులు, ఈసీఈలో హెచ్ఏజి ప్రొఫెసర్ అయిన డా. టి. కిషోర్ కుమార్, పరిశోధన ప్రాజెక్టుల పథకాలపై ఒక విజ్ఞానదాయకమైన సాంకేతిక సదస్సును నిర్వహించి, ప్రధాన ఎన్ఐఆర్ఎఫ్ 4 అంశాలు: బోధన–అభ్యసనం, పరిశోధన ఁ ఆచరణ, పట్టభద్రుల ఫలితాలు మరియు విస్తరణ కార్యక్రమాలను వివరించారు. పరిశోధన అనేది ప్రణాళిక, ముందుచూపు, నిబద్ధత మరియు పట్టుదల అవసరమయ్యే ఒక ప్రక్రియ. ఏజెన్సీల నుండి పరిశోధన నిధులు పొందడానికి ప్రస్తుత పరిశోధన ధోరణులు, సాంకేతిక పురోగతులు, అంతర్–విభాగ సహకారానికి అవకాశాలు కలిగి ఉండాలని, ఎన్ఐటి వరంగల్‌తో కిట్స్‌డబ్ల్యు అవగాహన ఒప్పందంలో భాగంగా వృత్తిపరమైన అభివృద్ధిపై ఆయన విలువైన అంతర్దృష్టులను పంచుకున్నారు. విశిష్ట సాంకేతిక వృత్తిని కొనసాగించడానికి సరైన మైఖరిని కలిగి ఉండాలని అతను నొక్కి ఒక్కానిస్తు ముగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి గారు అధ్యక్షోపన్యాసం చేశారు. అధ్యాపకులు, విద్యార్థులలో విద్యా, పరిశోధన సామర్థ్యాలను బలోపేతం చేయడానికి నిరంతర అభ్యసనం, పరిశోధన సహకారం, వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పురోగతులకు అనుగుణంగా మారడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. ఈ సాంకేతిక సెమినార్ వాస్తవ ప్రపంచ సమస్యలకు ప్రత్యక్షప్రాజెక్టులను రూపొందించడానికి, పరిశోధన సంస్కృతిని పెంపొందించడానికి దారితీస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ సి ఈ విభాగం ప్రొఫెసర్ మరియు పరిశోధన ఁ అభివృద్ధి ( ఆర్ ఁడి) విభాగం డీన్ ప్రొఫెసర్ బి. రమాదేవి, ఆర్ ఁ డి విభాగం ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ బి. జీవన్, ఆంగ్ల విభాగం సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డబ్ల్యూ. గ్రేస్ శాంతి, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ ఁ పీఆర్వో డా. డి.ప్రభాకరా చారి, సీనియర్ ప్రొఫెసర్ లు వివిధ విభాగాల డీన్లు, వివిధ విభాగాల హెడ్స్ తో పాటు 250 మందికి పైగా అధ్యాపకులు చురుకుగా పాల్గొన్నారు.

## నిరుపేద యువతి వివాహానికి లయన్స్ క్లబ్ చేయూత

నారాయణపేట, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర) నారాయణపేట పట్టణంలోని బహార్‌పేట వీధికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువతి వివాహానికి నారాయణపేట పట్టణ లయన్స్ క్లబ్ అధ్యక్షులు రవికుమార్ గౌడ్ తన వంతు సహాయం అందించారు.బహార్‌పేటకు చెందిన అబ్దుల్ ఖాదర్ మృతి చెందడంతో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఆయనకు ముగ్గురు కుమార్తెలు కాగా, పెద్ద కుమార్తెకు ఇప్పటికే వివాహం జరిగింది. ప్రస్తుతం రెండో కుమార్తె వివాహం నిశ్చయమైంది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా వివాహ ఏర్పాట్లలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయం బంధువుల ద్వారా లయన్స్ క్లబ్ అధ్యక్షులు రవికుమార్ గౌడ్ దృష్టికి వెళ్లింది.దీంతో స్పందించిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ కుటుంబానికి అవసరమైన రూ.10 వేల విలువైన గృహోపకరణాలను అందజేశారు. కుల మతాలకు అతీతంగా సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఈ సందర్భంగా రవికుమార్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సలీం, జిల్లా నాయకులు పల్ల అనిల్ పాల్గొన్నారు.

## వృద్ధులు, మహిళల అభివృద్ధికి కృషి చేయాలి

### నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక




నారాయణపేట అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర) వృద్ధుల మహిళా స్వయం సహాయక సంఘాలు ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధితో పాటు నిరంతర విద్యపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు.అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో సెర్ప్ ఆధ్వర్యంలో వృద్ధుల మహిళా స్వయం సహాయక సంఘాల కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. వృద్ధుల మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పొదుపు అలవాటును కొనసాగిస్తూ, సంఘాల ద్వారా ఆర్థికాభివృద్ధితో పాటు ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, నిరంతర విద్యపై కూడా దృష్టి సారించాలని సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు రాష్ట్రంలో ఎన్నో సంవత్సరాలుగా విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళలు ఒక్కొక్క రూపాయి పొదుపు చేసుకుంటూ, బ్యాంకు లావాదేవీలు నిర్వహించి, సంఘాలుగా ఏర్పడి తమ అవసరాలకు అనుగుణంగా ఆర్థిక సహాయం పొందుతూ స్వావలంబన దిశగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల విధానం దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇతర రాష్ట్రాల మహిళా సంఘాల ప్రతినిధులు తెలంగాణలోని స్వయం సహాయక సంఘాల పనితీరును అధ్యయనం చేసి, వాటి విధానాలను అనుసరిస్తున్నారని వివరించారు.వృద్ధుల మహిళా స్వయం సహాయక సంఘాలు కేవలం పొదుపు, రుణ కార్యకలాపాలకే పరిమితం కాకుండా మహిళలకు పరస్పర సహకారం, ఆత్మీయత, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చించుకునే వేదికగా కూడా ఉపయోగపడాలని కలెక్టర్ సూచించారు. సభ్యులు ఆరోగ్యం, పోషకాహారం, జీవన విధానంపై పరస్పరం అవగాహన కల్పించుకోవడంతో పాటు, తమకు తెలిసిన కుట్లు, అల్లికలు తదితర నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకుని అదనపు ఆదాయ మార్గాలను అన్వేషించాలని కోరారు.స్వయం సహాయక సంఘాల సమావేశాలను క్రమం తప్పకుండా, చురుకుగా నిర్వహించేలా సెర్ప్, డీపీఎం, డీఆర్డీఏ పీడీ, ఏపీఎంలు తదితర అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సంఘాల సభ్యులు సమావేశాల్లో చురుకుగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మొదటి ఆరు నెలల్లో సభ్యుల క్రియాశీల భాగస్వామ్యాన్ని పెంచితే సంఘాల కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు.వయస్సు పెరిగిన తర్వాత చదువు అవసరం లేదనే భావనను విడనాడాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కొత్త విషయాలను నేర్చుకోవడానికి వయస్సు ఎప్పుడూ అడ్డంకి కాదని, ప్రతి ఒక్కరూ జీవితాంతం విద్యార్థులుగా ఉండాలని అన్నారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడం ద్వారా మానసిక చురుకుదనం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు.వృద్ధుల మహిళలు ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే పరీక్షల్లో చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ కోరారు. పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని, సాధారణ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షల్లో ప్రతి ఒక్కరూ ధైర్యంగా పాల్గొని తమ అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.మహిళలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ, స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో చురుకుగా పాల్గొని సంఘాలను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్ స్వయంగా వృద్ధుల దగ్గరకు వెళ్లి వారిని ఎంతో అప్యాయంగా పలకరించి, యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. వారందరికీ పింఛన్ వస్తుందా లేదా అని వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో వెంకట్ రాములు, డిప్యూటీ డీ ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సిద్ధప్ప, సెర్ఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలస్వామి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, కోశాధికారి అంజమ్మ, జోగిని వ్యవస్థ నిర్మూలన సంస్థ సభ్యురాలు హాజమ్మ, డీపీ ఎం లు గోవింద్, మాసన్న, ఆరోగ్య శిబిరం వైద్యులు డాక్టర్ నరసింహ రావు సగరి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో అక్రమాలు, అవకతవకలపై విజిలెన్స్, విచారణ ఆదేశించాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కి వినతి
### బీజేపీ జిల్లా అధ్యక్షుడు టీ. రామాంజనేయులు



గద్వాల అక్టోబర్ 01 (విజన్ ఆంధ్ర బ్యూరో)గద్వాల మున్సిపాలిటీలో గత కొంతకాలంగా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు టీ. రామాంజనేయులు డిమాండ్ చేశారు.ఈ మేరకు బీజేపీ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులతో కలిసి గురువారం జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు.అనంతరం జిల్లా అధ్యక్షుడు టి.రామాంజనేయులు మాట్లాడుతూగద్వాల మున్సిపాలిటీ పరిధిలోని ఐడిఎస్ఎంటి. షాపుల కిరాయిల విషయంలో కూడా భారీ మొత్తంలో అద్దెల వసూళ్లలో అవకతవకలు జరుగుతోందన్నారు.దాదాపు రూ.35 లక్షల వరకు అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని అధికారులు మాత్రం రూ.11 లక్షలు చూస్తున్నారు.వాస్తవంగా ఎంత అనే దానిపై అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.మున్సిపల్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఆస్తిపన్నులను పెద్ద ఎత్తులో గత మార్చిలో నెల నందు అక్రమంగా తగ్గించారు.వాటి రికార్డులను పరిశీలించాలని కోరారు.ఎల్.పి. లేఅవుట్ లో 10 శాతం స్థలాల విషయంలో, అలాగే 10 శాతం కేటాయింపు అంశాల్లో నిబంధనలు పాటించారా లేదా అనే దానిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.జనరల్ ఫండ్ ను జీతభత్యాలకు వాడకుండా ఇతర ప్రాధాన్యత లేనటువంటి సివిల్ వర్క్ కు వాడుతున్నారు.దీనిపై సమగ్ర విచారణ జరిపాలని అన్నారు.దాదాపుగా 5 కోట్ల రూపాయలు తీర్మానము ఇచ్చినప్పటికి ఇప్పటికీ కాలయాపన చేస్తున్నారు.ఎఫ్ఏసి.లేకున్నా ఇంచార్జ్ కమిషనర్ ఉన్న సమయంలో ఒకే రోజులో 100 ఫైల్స్ ఆస్తి పన్ను చేసి రెండు కోట్ల రూపాయలు ముడుపులు ముట్టినవి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు విషయములో కూడా కేవలం సర్కారు ధరకే పోటీదారులందరినీ అనేక నిరాధారమైన ఆరోపణలో తొలగించి అధికార పార్టీకి చెందిన నాయకులకు పూర్తిగా అప్పచెప్తారు.గతంలో చేసిన షాపుల యొక్క కిరాయిలు ఇప్పటికి పెంచకుండా, కొత్త వారికి ఇవ్వకుండా బిల్ కలెక్టర్స్ పాత కిరాయి వసూలు చేస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారని వీటిపై కూడా విచారణ జరిపించాలని కోరారు.మున్సిపాలిటీలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి. అవకతవకలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. మున్సిపల్ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి అని రామాంజనేయులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ బండల వెంకట రాములు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి శ్రీను, కౌన్సిలర్లు శాలన్న, చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ త్యాగరాజు, తదితరులు హాజరయ్యారు.

## రికార్డులు ఇచ్చిన అధికారులకు కృతజ్ఞతలు: సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి

బెజ్జూర్, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర): బెజ్జూర్ గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ పేరుతో నాలుగు నెలల క్రితం అడిషనల్ కలెక్టర్ తీసుకెళ్లడంతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడిందని బెజ్జూర్ సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి తెలిపారు. రెండు రోజుల క్రితం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తనకు జరిగిన ఇబ్బందిని సభ దృష్టికి తీసుకెళ్లి, రికార్డులు అందుబాటులో లేకపోవడంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నానని పేర్కొంటూ ప్రజలకు బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సర్పంచ్‌కు మద్దతుగా నిలిచారు. రికార్డులు వెంటనే అందజేయకపోతే గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని అధికారులకు అల్టిమేటం ఇచ్చారు. దీంతో స్పందించిన అధికారులు బుధవారం రాత్రే గ్రామపంచాయతీ రికార్డులను పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. రికార్డులు తిరిగి అందడంతో గురువారం నిర్వహించాల్సిన ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి తెలిపారు. తనకు జరిగిన అన్యాయంపై పోరాడేందుకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరి దీవెనలు ఎల్లవేళలా తనపై ఉండాలని అన్నారు. తన వినతిని మన్నించి రికార్డులను అందజేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీఆర్ఎస్ నాయకులు, మీడియా మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# అల్మాస్ కుంటపై హైడ్రా దృష్టి సారించాలి

## కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేసిన వజ్రెష్ యాదవ్



బోడుప్పల్,అక్టోబర్01(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్‌లో పరిదిలోని ఆల్మాస్ కుంట అభివృద్ధి,పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని మేడ్చల్ డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ హైడ్రా కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ ఆల్మాస్ కుంట చెరువు స్థానిక ప్రజలకు కీలక జలవనరుగా ఉందన్నారు. చెరువును అభివృద్ధి చేయడంతో పాటు పరిసర ప్రాంతాలను సుందరీకరించి,కాలుష్యాన్ని నివారించే చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే చెరువులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సూచించారు. చెరువు పరిధిలో ఆక్రమణలు, మురుగునీటి సమస్యలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి పరిష్కరించాలని, చెరువును సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని హైడ్రా అధికారులను కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆల్మాస్ కుంట చెరువు అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి,పుల్లకండ్ల వెంకట్ రెడ్డి,సింగిరెడ్డి రాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ౮౦ ఏళ్ళ సుదీర్ఘ చరిత్ర కలిగిన సంఘం ఏఐఎస్ఎఫ్

## సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి
## సిపిఐ ఆధ్వర్యంలో రెహమాన్, సంతోష్, ప్రణీత్ గౌడ్ లకు సన్మానం




హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర)నూతనంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్నికైన రెహమాన్ కు, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ కు, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్ గౌడ్ లను సిపిఐ నాయకులు సత్కరించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల సందర్భంగా నిన్న జరిగిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో నూతనంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్నికైన రెహమాన్ కు, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ కు, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్ గౌడ్ లకు సిపిఐ నాయకులు శాలువాలు కప్పి పూల బొకే ఇచ్చి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)1936 ఆగస్టు 12న ఆవిర్భావించి దేశ స్వాతంత్రోద్యమంలో అసమాన పోరాటాలు నిర్వహించి, ఎంతో మంది విద్యార్థులను త్యాగం చేసిందని కొనియాడారు. పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన ఈ విద్యార్థి సంఘం స్వాతంత్ర్య అనంతరం ప్రభుత్వ విద్యా పరిరక్షణకై, శాస్త్రీయ విద్య, కామన్ విద్యావిధానం అమలుపై నిరంతరం పోరాటాలు సాగిస్తూ 90 సంవత్సరాలుగా విద్యార్థుల శ్రేయస్సు కోసం అశేష త్యాగాలు చేస్తూ ఆవిర్భావం నాటి నుంచి నేటివరకు గల్లి నుండి ఢిల్లీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై, విద్య వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న పాలకులపై అలుపెరుగని సమరశీల పోరాటాలు చేసి దేశంలో ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు. ఇంతటి చరిత్ర కలిగిన సంఘంలో పని చేయడం అంటే ఎంతో గౌరవమని అన్నారు. నూతనంగా ఎన్నికైన రెహమాన్, సంతోష్, ప్రణీత్ గౌడ్ లు రానున్న రోజుల్లో విద్యారంగ సమస్యల పరిష్కారంకై విస్తృతంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, మునిగాల బిక్షపతి, కొట్టేపాక రవి తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడకు బయలుదేరిన బాలబాలికల జట్లు




నారాయణపేట , అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్ర స్థాయిలో జరుగు కబడ్డీ టోర్నమెంట్ కు నారాయణపేట జూనియర్ బాలురు మరియు సబ్ జూనియర్ బాలికల వేములవాడ సిరిసిల్ల జిల్లాకు బయలుదేరినట్లు జిల్లా కబడ్డీ ప్రధాన కార్యదర్శి చెన్నారం వెంకటప్ప తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు గోటూరు నాగేశ్వర్ రెడ్డి క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసి రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలని కోరారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించి నారాయణపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు పేర్కొన్నారు. క్రీడల్లో రాణిస్తే మీ ఉజ్వల భవిష్యత్తుకు పునాది అవుతుందని ఆయన అన్నారు. అంతేకాకుండా క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఎంతో సులభంగా పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు సాయినాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు భీమ్ రెడ్డి మీనా కుమారి,రేణుక యాదమ్మ క్రీడాకారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలి

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి
## వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
## హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ ) సమావేశం
## సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కెఆర్.నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, తదితరులు




హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర) అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అధికారులు అమలు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, మేన శ్రీను, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ, వైద్య ఆరోగ్య, విద్య, మహిళా శిశు సంక్షేమం, రహదారులు, తదితర శాఖల అధికారులతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరు, వాటి పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై ఎంపీ, ఎమ్మెల్యేలు సమీక్ష చేశారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీ ఫండ్స్ ద్వారా చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసే విధంగా పర్యవేక్షణ చేసి అందుకు సంబంధించిన చెల్లింపులు కూడా వేగవంతంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన నాణ్యమైన వైద్య సేవలను అందించాలని పేర్కొన్నారు. గర్భిణీల వివరాలను వంద శాతం నమోదు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గర్భిణీల వివరాలు నమోదు చేయడంలో అలసత్వం ప్రదర్శించవద్దని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డయాబెటిస్ ఉన్నవారికి ఇన్సులిన్ అందుబాటులో ఉందా లేదా అనేది పరిశీలించాలని డిఎంహెచ్వోను ఆదేశించారు. ఓపి విధానంలో కొనసాగుతున్న క్యాన్సర్ వైద్య సేవలు మరింత మెరుగు కావాలన్నారు. వ్యాక్సిన్ కార్యక్రమాలను వైద్యారోగ్య శాఖ సిబ్బంది పటిష్టంగా అమలు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో వంద శాతం అమలు జరగాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్ లో భాగంగా బాలల పరిరక్షణకు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధిత శాఖల అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు. మహిళా శిశు సంక్షేమ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో బాల్యవివాహాల నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయడంలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అధికారుల పనితీరుతోనే సమాజంలో అభివృద్ధి, మార్పు కనిపిస్తుందన్నారు. వరంగల్ మ్యూజియం అభివృద్ధి పనులకు సబంధించి ప్రతిపాదనలను అందజేయాలని పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సందర్శించి వాటి పురోగతికి చర్యలు చేపట్టాలన్నారు. దిశా కమిటీ సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, కేంద్ర పథకాల అమలు పురోగతి ఏ విధంగా జరుగుతున్నాయో సంబంధిత వివరాలను తెలియజేయాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందన్నారు. జిల్లాలో ఎక్కడ తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయో రహదారుల శాఖ అధికారులు సందర్శించి తగిన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ఇప్పుడున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలే మేలు అని , ఈ విషయాన్ని మరింతగా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. వేరే ప్రాంతాల నుండి కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులను తెప్పించుకునే పరిస్థితులు పోవాలన్నారు. వరి, పత్తి, ఇతర పంటల కంటే కూరగాయల సాగుతో అధిక లాభాలు ఉన్నాయన్నారు. ధర్మసాగర్ సర్వీస్ రోడ్డు వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ధర్మసాగర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిస్థితులు మెరుగుపడాలన్నారు ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పనిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సాయంత్రం పూట ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని డిఇఓ కు సూచించారు. ముఖ్యంగా విద్యార్థులకు మాథ్స్ ఇంగ్లీషులో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే వారి కెరీర్ కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 8 9 10 వ తరగతి విద్యార్థుల విద్యా ప్రగతి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో జిల్లాకు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. విబి జీ రామ్ జి పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు కాంపౌండ్ వాల్స్, గ్రామపంచాయతీ, అంగన్వాడీ కేంద్రాల భవనాలు నిర్మించవచ్చని, అందుకు తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. దిశా కమిటీ సమావేశం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని, కమిటీ చైర్మన్ అయిన ఎంపి కి ప్రభుత్వ పథకాల అమలు అధికారుల పనితీరు గురించి నేరుగా స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన వివరాలతో అధికారులు దిశ కమిటీ సమావేశానికి హాజరుకావాలని అన్నారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూలి ఎల్ నినో పరిస్థితులు ఉన్న దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలు సాగు పై వ్యవసాయ ఉద్యాన శాఖల అధికారులు తగిన కార్యచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. హసన్ పర్తి, ఓఆర్ఆర్ దేవన్నపేట, టేకులగూడెం, వంగ పహాడ్, తదితర ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అదేవిధంగా మడికొండ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు ఆర్ అండ్ బి, నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్ కనెక్షన్ సదుపాయం ఉండాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అక్రమ అబార్షన్లను చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు, ఇతర శాఖల అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విడతల వారీగా అంగన్వాడీ కేంద్రాలు, వివో భవనాల నిర్మాణాలను చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను తు చా తప్పకుండ... సంక్షేమ పథకాల ఫలాలు ప్రతీ గడప కి అందేలా అన్నీ శాఖల అధికారులు క్షేత్ర స్థాయి లో పని చేయాలన్నారు ఈ సమావేశంలో ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ శేషాద్రి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి.గిరిరాజు గౌడ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టీబీ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర) హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ( ఐ డి ఓ సి )లో వైద్య ఆరోగ్యశాఖ హనుమకొండ వారి అధ్వర్యంలో గురువారం టీబీ (క్షయ) వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య , వర్ధన్నపేట శాసనసభ్యులు నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తమ చేతుల మీదుగా టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో పాటు, వ్యాధి నుంచి త్వరగా కోలుకునేందుకు దోహదపడుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. టీబీ నిర్మూలన లక్ష్య సాధనలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, వైద్య సంఘాలు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 01,(విజన్ ఆంధ్ర)ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు, ఎన్నికల విభాగం అధికారులతో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, మ్యాపింగ్ కాని ఓటర్లు, అనమలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, వారి ఇండ్లకు వెళ్లి వారి నుంచి ధృవపత్రాల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి బూత్ స్థాయి అధికారులు ఓటర్ల ఇండ్ల వద్దకు వెళ్లి అవసరమైన ధ్రువపత్రాలను సేకరించాలని తెలిపారు. ఎ.ఈ.ఆర్.ఓ.లు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసే విధంగా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగేందుకు సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో నోటీసులు జారీ చేయబడిన ఓటర్లకు సంబంధించి వారి ఇండ్ల వద్ద అవసరమైన ధ్రువపత్రాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, ఎఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 01,(విజన్ ఆధ్ర)జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, పారిశుధ్య, సంక్షేమ, విద్యా కార్యక్రమాల నిర్వహణను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల మార్కెట్ ప్రాంతంలో కొనసాగుతున్న నగరాభివృద్ధి పనులను ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని తెలిపారు. గోదావరి పుష్కర ఘాట్ ప్రాంతాన్ని సందర్శించి అభివృద్ధి పనుల కోసం గుర్తించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజలకు, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేలా ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ఎన్‌టిఆర్ నగర్ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పర్యటనలో భాగంగా ఒక ఇంటి వద్ద నీరు వృథాగా పోతుండటాన్ని గమనించి నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యసన స్థాయిని తెలుసుకున్నారు. పాఠశాలలో ఎఫ్ ఆర్ ఎస్ ఆధారిత హాజరు నమోదును పరిశీలించి విద్యార్థుల హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, అవసరమైన అదనపు బోధన అందించాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సేవలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాజు, మున్సిపల్ డిప్యూటీ ఈఈ, మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డీజేఎఫ్ 11వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరించిన

## జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ జనరల్ సెక్రటరీ సంకాపురం రాముడు

అయిజ అక్టోబర్ 01 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని ఉత్తనూర్ రోడ్డులో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దళిత జర్నలిస్ట్ ఫోరం 11వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ జనరల్ సెక్రటరీ సంకాపురం రాముడు, సంకాపురం గ్రామ మాజీ సర్పంచ్ సుజాత చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రస్తుత కౌన్సిలర్ జెమిని మద్దిలేటి మాట్లాడుతూ దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్ నాయకత్వంలో సంస్థ రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభల మాదిరిగానే ఈసారి కూడా 11వ రాష్ట్ర మహాసభలకు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# రైతు బిడ్డకు అరుదైన ఘనత.. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో చకినాల అంజన్నకు గోల్డ్ మెడల్




కాగజ్‌నగర్, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ మండలం కొత్త సార్సాల గ్రామానికి చెందిన రైతు కుటుంబం నుంచి వచ్చిన చకినాల అంజన్న అరుదైన ఘనత సాధించారు. చకినాల మల్లేష్--రాజక్క దంపతుల కుమారుడైన అంజన్న యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంఎస్సీ ఓషన్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్స్ పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించారు. గవర్నమెంట్ సిటీ కాలేజీలో డిగ్రీ విద్యను పూర్తి చేసిన ఆయన అనంతరం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. ప్రస్తుతం ఒడిశాలోని ఎన్‌ఐటీ రూర్కెలాలో తుఫానుల ముందస్తు అంచనాపై పీహెచ్‌డీ చేస్తున్నారు. ఆయన పరిశోధనకు ఇస్రో నుంచి నిధులు అందుతున్నాయి. తుఫానులను ముందుగానే అంచనా వేసి, వాటి ప్రభావంతో సంభవించే ప్రాణనష్టాన్ని తగ్గించడమే తన పరిశోధన ప్రధాన లక్ష్యమని అంజన్న తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి ఉన్నత విద్యలో ప్రతిభ చాటడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తన విజయానికి సహకరించిన గురువులు, ప్రొఫెసర్లు, కుటుంబ సభ్యులు, స్నేహితులకు అంజన్న కృతజ్ఞతలు తెలిపారు. తాను సాధించిన గోల్డ్ మెడల్‌ను తనకు సహకరించిన వారందరికీ అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# 'షాడో' ఎవరు..? సభలో చైర్‌పర్సన్ ఫైర్.!

### నా భర్త అండగా ఉంటే షాడో అంటారా ?

### మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి ఘాటు స్పందన



గద్వాల అక్టోబర్ 01 (విజన్ ఆంధ్ర)గద్వాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 'షాడో' వ్యాఖ్యల అంశం ఒక్కసారిగా వేడెక్కింది. సోషల్ మీడియాలో తన భర్తను 'షాడో'గా పేర్కొంటూ వచ్చిన వ్యాఖ్యలపై చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. రాజకీయ విమర్శలు చేయొచ్చని, కానీ మహిళా ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆడపిల్లను గౌరవించాలి, మీ ఇంట్లోనూ ఆడపిల్లలు ఉన్నారు కదా, అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు సభలో చర్చనీయాంశంగా మారాయి. తన భర్త తనకు అండగా నిలబడితే 'షాడో' అని ముద్ర వేయడం ఎందుకని ప్రశ్నించారు. ఇతర మహిళా ప్రజాప్రతినిధుల భర్తలు వారి తరపున ప్రజా సమస్యలు చూసుకుంటే అది సహజంగా కనిపిస్తుందా అని నిలదీశారు. ఒక మహిళా కౌన్సిలర్ రాలేని సమయంలో ఆమె భర్త వచ్చి పనులు చూసుకుంటే తప్పులేదు. అదే నా భర్త నాకు ధైర్యంగా అండగా ఉంటే మాత్రం షాడోనా, అంటూ చైర్‌పర్సన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. మహిళా ప్రజా ప్రతినిధులపై వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా రాజకీయ విమర్శలను విధానాలకే పరిమితం చేయాలని ఆమె సూచించారు. అయితే 'షాడో' వ్యాఖ్యల వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్నది ఇప్పుడు మున్సిపల్ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

# వయోవృద్ధులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 01,(విజన్ ఆంధ్ర)వయోవృద్ధులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి, వయోవృద్ధుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, వయోవృద్ధుల అనుభవం, వారి సలహాలు, సూచనలు సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. తల్లిదండ్రులు తమ ఆస్తులు, భూములను పిల్లలకు బదలాయించిన అనంతరం నిర్లక్ష్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్తిపాస్తులు లేని వయోవృద్ధులను వారి పిల్లలు బాధ్యతగా చూసుకోవాలని తెలిపారు. వయోవృద్ధులు సమాజానికి విలువైన సంపద అని, కుటుంబానికి పెద్దలుగా వారు అందించే అనుభవం సమాజానికి కూడా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. వయోవృద్ధుల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత ముఖ్యమని, వయోవృద్ధులు క్రమం తప్పకుండా నడక, యోగా వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలను కొనసాగించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాల ద్వారా వయోవృద్ధులకు రక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో చట్టాన్ని అమలు చేయడం, గ్రామ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో సుమారు 35 వేల 250 మంది వయోవృద్ధులు వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారని, ప్రతి నెలా పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా సంఘాల ప్రతినిధులు గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వయోవృద్ధుల హక్కులు, సంక్షేమంపై సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ వయోవృద్ధులు తమకు కల్పించిన చట్టపరమైన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టం--2007లోని సెక్షన్ 23 ప్రకారం, వయోవృద్ధులు బదలాయించిన ఆస్తికి సంబంధించిన పరిస్థితులలో తగిన సందర్భాలలో ఆర్.డి.ఓ. కు బదలాయింపును రద్దు చేసే అధికారం ఉంటుందని వివరించారు. సెక్షన్ 24 ప్రకారం వయోవృద్ధులను, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు, జరిమానా వంటి నిబంధనలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే, నిబంధనల ప్రకారం వారి జీతం నుంచి తల్లిదండ్రుల పోషణకు చెల్లింపులు చేయించే అవకాశం ఉన్నాయని తెలిపారు. చట్టంలోని నిబంధనలను పాటించని వారికి జరిమానా, శిక్ష వంటి చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రతి మంగళవారం డే కేర్ సెంటర్లలో వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వయోవృద్ధుల సమస్యలు, సహాయం కోసం 14567 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వయోవృద్ధులను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు సామూహికంగా ప్రతిజ్ఞ చేయాలి

### అక్టోబర్ 2న జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



గద్వాల అక్టోబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో)జిల్లాలోని అన్ని గ్రామాల్లో అక్టోబర్ 2న బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. బాల్ వివాహ్ ముక్త్ భారత్ (బివిఎంబి) అభియాన్ లో భాగంగా నిర్వహించే ఈ గ్రామసభల్లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, విద్య, ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తుపై వాటి ప్రభావాలు, బాలల రక్షణ వ్యవస్థలు, బాల్య వివాహాల నివారణలో తల్లిదండ్రులు, సమాజం పోషించాల్సిన పాత్రపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామ సభ ల్లో ఎంపిడిఓ.లు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం.లు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. గ్రామంలో బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిసినా లేదా అనుమానం ఉన్నా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి, బాల్య వివాహాన్ని అడ్డుకునేందుకు సహకరించాలని కోరారు. 02.01.2025 నుంచి 02.10.2026 వరకు బాల్య వివాహాలు జరగని గ్రామాలను బాల్య వివాహ రహిత గ్రామాలుగా ధృవీకరించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 2న నిర్వహించే గ్రామసభల్లో ప్రజలు పాల్గొని, తమ గ్రామాలను బాల్య వివాహ రహిత గ్రామాలుగా ప్రకటించేందుకు తీర్మానం చేసుకోవడంతో పాటు, బాల్య వివాహాల నిర్మూలనకు సామూహికంగా ప్రతిజ్ఞ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పిలుపునిచ్చారు.

# జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1,(విజన్ ఆంధ్ర)జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లాలోని అడ ప్రాజెక్టు ప్రాంతాన్ని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సహజ వనరులు, జలవనరులు, ప్రకృతి అందాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు సందర్శకులను ఆకర్షించేలా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. అడ ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక పరంగా అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మెరుగుపడటంతో పాటు జిల్లాకు పర్యాటకుల రాక పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. పర్యాటకుల కొరకు వ్యూయింగ్ పాయింట్లు, వాకింగ్ ట్రాక్‌లు, పార్కింగ్, త్రాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, విశ్రాంతి ప్రదేశాలు, సమాచార కేంద్రం, సుందరీకరణ, లైటింగ్ తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతి కలిగేలా ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని తెలిపారు.

# వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు బాధ్యతగా కృషి చేయాలి

### ...జిల్లా కలెక్టర్ కె.హరిత

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1,:(విజన్ ఆంధ్ర)వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్ లో గల విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యాలయంలో వృద్ధుల కోసం ఏర్పాటుచేసిన న్యాయ అవగాహన కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూప రాణి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు, ఉచిత న్యాయ సహాయం, వృద్ధుల సంక్షేమానికి సంబంధించిన చట్టాలపై వృద్ధులు అవగాహన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వృద్ధులు తమకు ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సందర్భాలలో న్యాయ సహాయం పొందాలని సూచించారు. వృద్ధుల సంరక్షణ, పోషణకు సంబంధించి చట్టపరమైన రక్షణలు ఉన్నాయని తెలిపారు. వృద్ధులకు ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. ఉచిత న్యాయ సహాయం కోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 14567కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

# ఆన్‌లైన్‌లో యూరియా లేదు.. గోదాముల్లో మాత్రం వందల బస్తాలు!

## యూరియా కోసం రైతుల అవస్థలు.. అధిక ధరలకు విక్రయిస్తున్నారూ



కాగజ్‌నగర్, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫెర్టిలైజర్ షాపుల్లో యూరియా బస్తాలు అందుబాటులో లేవని, ఆన్‌లైన్‌లో కూడా యూరియా స్టాక్ లేదని చూపిస్తున్నారని రైతులు చెబుతున్నారు. అయితే కొన్ని ఫెర్టిలైజర్ గోదాముల్లో మాత్రం వందల కొద్దీ యూరియా బస్తాలు నిల్వ ఉన్నాయని ఆరోపిస్తున్నారు. రైతుల పేర్లు, పాస్‌బుక్కుల వివరాలను తీసుకుని వారి పేర్లపై ఆన్‌లైన్‌లో యూరియా నమోదు చేసి, అనంతరం ఆ బస్తాలను బయట మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని కొందరు ఫెర్టిలైజర్ షాపుల యజమానులపై రైతులు ఆరోపణలు చేస్తున్నారు. ఒక్కో యూరియా బస్తాను రూ.500 నుంచి రూ.700 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పేర్కొంటున్నారు. దీంతో నిజంగా పంటలకు యూరియా అవసరమైన రైతులకు ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. పంటల సాగు సమయంలో యూరియా కోసం రైతులు షాపుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదాముల్లో ఉన్న యూరియా నిల్వలను అధికారులు తనిఖీ చేసి, ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలతో సరిపోల్చాలని రైతులు కోరుతున్నారు. రైతుల పాస్‌బుక్కుల పేర్లను ఉపయోగించి యూరియా నమోదు చేస్తున్నారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నట్లు తేలితే సంబంధిత ఫెర్టిలైజర్ షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి రైతుకు అవసరమైన మేరకు యూరియా అందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

# వృద్ధుల హక్కులు, సంక్షేమంపై న్యాయ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. నిష్కా పాత్రుడు






గద్వాల, అక్టోబర్ 01( విజన్ ఆంధ్ర బ్యూరో)అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జోగులాంబ గద్వాల జిల్లా ఆధ్వర్యంలో గద్వాల పట్టణంలోని శాంతి సీనియర్ సిటిజన్ హోమ్లో వృద్ధులకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. నిష్కా పాత్రుడు హాజరై వృద్ధులకు న్యాయపరమైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, వృద్ధ పౌరుల నిర్వహణ, సంక్షేమ చట్టం, 2007 (తల్లిదండ్రులు,వృద్ధ పౌరుల నిర్వహణ, సంక్షేమ చట్టం, 2007)లోని ముఖ్యమైన అంశాలను వివరించారు. వృద్ధ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల సంరక్షణ, వారి హక్కులు, గౌరవప్రదమైన జీవనం, నిర్లక్ష్యం లేదా వేధింపులకు గురైన సందర్భంలో తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలు, అలాగే వారికి అందుబాటులో ఉన్న న్యాయ సహాయ సేవల గురించి వివరించారు. అదేవిధంగా నల్సా (వృద్ధులకు న్యాయ సేవలు) పథకం, 2016 ప్రకారం అర్హులైన వృద్ధులకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహా , ఇతర న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తమ హక్కుల పరిరక్షణ కోసం అవసరమైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని సూచించారు. వృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు, సమాజం గౌరవం, ఆప్యాయత, బాధ్యతతో వ్యవహరించాలని, వృద్ధుల భద్రత , సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కార్యదర్శి తెలిపారు. కార్యక్రమం అనంతరం శాంతి సీనియర్ సిటిజన్ హోమ్‌లోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాంతి సీనియర్ సిటిజన్ హోమ్ ఇన్‌చార్జ్ రంగన్న, వృద్ధులు ,సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

### అక్టోబరు 2న దేశవ్యాప్తంగా 'డిమాండ్స్ డే'

### టీఏఈఎమ్‌జే జిల్లా అధ్యక్షుడు

### చీర్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి నరసింహ రాజ్

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబరు 1(విజన్ ఆంధ్ర) జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, భద్రతతో పాటు వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఏఈఎమ్‌జే (తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్) వనపర్తి జిల్లా అధ్యక్షుడు చీర్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి నరసింహ రాజ్ డిమాండ్ చేశారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) పిలుపు మేరకు అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 'డిమాండ్స్ డే' పాటించనున్నట్లు వెల్లడించారు. ?గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మీడియా రంగంలో పనిచేస్తున్న కార్మికులు, జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో గాంధీ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ?ఇందులో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద చేపడుతున్న నిరసన కార్యక్రమానికి టీఏఈఎమ్‌జే రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. జిల్లాలోని జర్నలిస్టులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డిలకు సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ?ఈ సమావేశంలో యూనియన్ జిల్లా కోశాధికారి ఎం. అరుణ్ (బిగ్ టీవీ), ప్రచార కార్యదర్శి ముంత రవి, నాయకులు కేఎన్ శివకుమార్, వహీద్, రవికాంత్ (10టీవీ), అలీమ్, ఈశ్వర్ (వీ6), చంద్రమౌళి (పిఆర్ టీవీ ), ముక్తార్ (6టీవీ ), జియా (మున్సిఫ్ టీవీ), శివప్రసాద్, కుపేందర్ రెడ్డి, చాంద్ పాషా, నజీర్, నరేష్, సిరాజ్, వజీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించాలి

### ఓటర్లను కార్యాలయాలకు పిలిచి నోటీసులు, పత్రాల స్వీకరణ చేయరాదు

### బీఎల్ఓలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేసి, పత్రాలను ఇంటి వద్దే స్వీకరించాలి

### తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర) : ఎస్ఐఆర్-2026 ప్రక్రియను భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని లితెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు అందుకోవడానికి లేదా అవసరమైన పత్రాలు సమర్పించడానికి కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు. ఇకపై సాధారణంగా ఓటర్లను విచారణ (హియరింగ్) కోసం కార్యాలయాలకు పిలవరాదని సీఈఓ తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫారం-6 డిక్లరేషన్ తప్పనిసరికొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని సీఈఓ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ అవసరం లేకపోయినప్పటికీ, తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం-6, ఫారం-7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఫారం-6, పెండింగ్ నోటీసులు, ఫారం-7, ఫారం-8కు సంబంధించిన వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని సీఈఓ ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దశను పారదర్శకంగా పూర్తి చేయాలని సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో వాసు చంద్ర, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరెండెంట్ నెమత్ హాలీ ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుకు పౌష్టిక భరోసా 'తొలి ముద్ద'

ఆసిఫాబాద్, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర): బాల్యదశ నుంచే చిన్నారులకు పౌష్టికాహారం అందించి, వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తొలి ముద్ద' కార్యక్రమం ఆసిఫాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ హరిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చిన్నారులకు స్వయంగా తొలి ముద్ద తినిపించి, ఆప్యాయంగా ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ చిన్నారుల చిరునవ్వే తెలంగాణకు వెలుగు అని అన్నారు. పౌష్టికాహారం చిన్నారుల శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి, ఉజ్వల భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఒక దేవాలయంగా భావించి, ప్రతి చిన్నారి ఆరోగ్యాన్ని అందరి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార కార్యక్రమాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద రక్తదానానికి యువత ముందుకు రావాలి

**- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపు**

**- రక్తదానం ప్రాణాలను కాపాడే గొప్ప మానవతా కార్యక్రమం**

**- విద్యాసంస్థలు, పరిశ్రమలు విస్తృతంగా రక్తదాన శిబిరాలు నిర్వహించాలి**





హైదరాబాద్, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర): స్వచ్ఛంద రక్తదానానికి యువత ముందుకు రావాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా సనత్‌నగర్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదాతలను అభినందించారు. ప్రమాదాల్లో గాయపడినవారు, ప్రసవ సమయంలో అత్యవసర పరిస్థితులు ఎదుర్కొనే తల్లులు, తలసేమియా బాధిత చిన్నారులు, క్యాన్సర్ రోగులు, శస్త్రచికిత్సలు చేయించుకునే వారికి రక్తం ఎంతో కీలకమని మంత్రి తెలిపారు. అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేక కుటుంబాలు ఇబ్బందులు పడకుండా స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించాలని సూచించారు. యువతతో పాటు విద్యాసంస్థలు, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంస్థలు క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కోరారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ బృందాన్ని మంత్రి అభినందించారు. శిబిరంలో రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చుని, ఇది అత్యున్నత మానవతా సేవ అని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

# పీఎం సూర్య ఘర్‌తో సౌర విద్యుత్ సద్వినియోగం

**- గృహ విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చు**

**- సేవా సేతు కార్యక్రమంలో అవగాహన సదస్సు**



నిర్మల్ జిల్లా,అక్టోబర్ 01,(విజన్ ఆంధ్ర);గృహ వినియోగదారులు సౌర విద్యుత్‌ను సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని విద్యుత్, బ్యాంకింగ్ శాఖల అధికారులు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం సూర్య ఘర్--ముఫ్త్ బిజ్లీ యోజన' పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం నిర్మల్ పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సేవా సేతు కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పథకం కింద గృహాలపై రూఫ్‌టాప్ సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సొంత అవసరాలకు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడంతో పాటు విద్యుత్ బిల్లుల భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు విధానం, దరఖాస్తు ప్రక్రియ, బ్యాంకు రుణ సదుపాయాలపై వినియోగదారులకు వివరించారు. పథకం ప్రయోజనాలు అర్హులైన ప్రతి గృహ వినియోగదారుడికి చేరేలా విద్యుత్, బ్యాంకింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ఆసక్తి ఉన్నవారికి దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలపై పూర్తి సహకారం అందించాలని తెలిపారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులకు బ్యాంకులు సకాలంలో రుణ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సౌర విద్యుత్ వినియోగం వల్ల సంప్రదాయ విద్యుత్‌పై ఆధారపడటం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని అధికారులు వివరించారు. ప్రజలు పథకంపై పూర్తి అవగాహన పెంచుకుని అందుబాటులో ఉన్న ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్‌పీడీసీఎల్ డివిజనల్ ఇంజినీర్ నాగరాజు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, టౌన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ శ్రీనివాస్‌తో, విద్యుత్, బ్యాంకింగ్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపఎన్నికకు భయపడుతున్న ప్రభుత్వం..




తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 01 (విజన్ ఆంధ్ర): దానం నాగేందర్ అనర్హతతో ఖాళీ అయిన ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉపఎన్నిక నిర్వహణపై ప్రభుత్వం వెనకడుగు వేస్తోందనే చర్చ జోరుగా సాగుతోంది. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతతో ఖైరతాబాద్‌లో గెలవడం కష్టమని భావించి ఉపఎన్నికను ఆపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

***ఎలక్షన్ పిటిషన్‌తో ఉపఎన్నికకు బ్రేక్ వేసే యత్నం..***

ఖైరతాబాద్ ఉపఎన్నిక నోటిఫికేషన్‌ను ఆపాలంటూ కాంగ్రెస్ నేత విజయారెడ్డి హైకోర్టులో పిటిషన్ వేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. 2023 ఎన్నికల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని 2024లోనే విజయారెడ్డి ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై తీర్పు వచ్చే వరకు ఖైరతాబాద్ ఉపఎన్నిక నోటిఫికేషన్‌ను ఆపాలంటూ ఇప్పుడు హైకోర్టులో అభ్యర్థన చేశారు. ఒకవేళ దానం ఎన్నిక చెల్లదని తీర్పు వస్తే, రెండో స్థానంలో ఉన్న విజయారెడ్డికే నేరుగా ఎమ్మెల్యే పదవి వరించే అవకాశం ఉంది. ఈ పిటిషన్ ద్వారా ఉపఎన్నిక నిర్వహణ నుంచి తప్పించుకోవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దానంపై అనర్హత వేటుపై సుప్రీంకోర్టులోనూ ప్రభుత్వానికి చుక్కెదురైనా, ఉపఎన్నిక విషయంలో ఇంకా ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

***ఖైరతాబాద్‌పై విజయారెడ్డి ఆశలు..***

మరోవైపు కాంగ్రెస్ నేత నుమాన్ మహమ్మద్ ఖైరతాబాద్ అభ్యర్థి విజయారెడ్డి అని ప్రకటించడం చర్చనీయాంశమైంది. దానం నాగేందర్‌ను జాతీయ రాజకీయాల్లోకి పంపి తనకు ఖైరతాబాద్ టికెట్ ఇస్తారని విజయారెడ్డి ఆశిస్తున్నారు. పీజేఆర్ పేరు లేకుండా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్లదని, తనకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

***బీఆర్ఎస్ నేతల విమర్శలు..***

ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లే ధైర్యం ప్రభుత్వానికి లేదని, అందుకే ఉపఎన్నికను తప్పించుకునేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక జరిగితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. సీఎం రేవంత్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరిగిందనడానికి ఖైరతాబాద్ ఉపఎన్నిక నుంచి తప్పించుకోవడమే నిదర్శనమని బీఆర్ఎస్ శ్రేణులు ఎద్దేవా చేస్తున్నాయి.

# ఎస్.ఐ.ఆర్ నోటీసులకు ఆన్లైన్ ద్వారా ధృవీకరణ పత్రాలు అందించవచ్చు

## - కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి



నిజామాబాద్, అక్టోబర్ 01 :(విజన్ ఆంధ్ర ) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు వ్యక్తిగతంగా బీ.ఎల్.ఓలను నేరుగా కలువకుండా, ఆన్లైన్ లో ఈ-మెయిల్, వాట్సప్ ల ద్వారా కూడా సంబంధిత ధృవీకరణ పత్రాలను పంపవచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతి గురించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష జరిపారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. మ్యాపింగ్ జరగని వారికి, పేరు, ఇతర వివరాలలో వ్యత్యాసం కలిగి ఉన్న వారికి ఎస్ఐఆర్ లో భాగంగా జారీ చేసిన నోటీసులకు సంబంధించి విచారణ పక్కాగా జరపాలన్నారు. అనర్హులుగా ఉన్నట్లు నిర్ధారణ అయితే, అలాంటి వారికి స్పీకింగ్ ఆర్డర్స్ ద్వారా తెలియజేయాలని అన్నారు. ఇంకనూ ఎవరికైనా నోటీసులు జారీ కాకపోతే వెంటనే నోటీసులు అందజేయాలన్నారు. ఎస్.ఐ.ఆర్ పురోగతి గురించి ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలకు సమాచారం అందించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో ఇంకనూ 6106 మందికి నోటీసులు అందించాల్సి ఉందన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఎక్కువ సంఖ్యలో 3865 నోటీసులు పెండింగ్ లో ఉన్నాయని, ఆర్మూర్ లో 1631, బోధన్ లో 16, బాన్సువాడ సెగ్మెంట్ లో 437, బాల్కొండ నియోజకవర్గంలో 157 నోటీసులు ఇంకనూ అందించాల్సి ఉందని తెలిపారు. వీరిలో అత్యధిక మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళడం, ఓటరు జాబితాలో పొందుపరచిన చిరునామాలలో ఉండకపోవడం వంటి కారణాల వల్ల నోటీసులు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. బీ.ఎల్.ఓలను క్షేత్రస్థాయిలో వారి ఇళ్ళకు పదేపదే పంపిస్తూ నోటీసులు అందించే ప్రయత్నం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పురోగతి గురించి ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలకు సమాచారం తెలియజేస్తున్నామని, ఈ.ఆర్.ఓ, ఏ.ఈ.ఆర్.ఓల కార్యాలయాల నోటీసు బోర్డులలో కూడా సమాచారాన్ని ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కాగా, ఇప్పటికే నోటీసులు అందుకున్న ఓటర్లు బీ.ఎల్.ఓలను నేరుగా కలిసే అవకాశం లేనట్లైతే ఆన్లైన్ ద్వారా వాట్సప్, ఈ-మెయిల్ ద్వారా సంప్రదించి ధృవీకరణ పత్రాలు పంపవచ్చని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పక పాటించాలని, హియరింగ్ ను పారదర్శకంగా నిర్వహిస్తూ, నిర్ణీత గడువు లోపు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ.ఆర్.ఓలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతికతను వ్యవసాయంతో అనుసంధానం చేసుకొని ముందుకు సాగాలి

**- ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్**

**- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేలా చర్యలు**

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,అక్టోబర్ 01,(విజన్ ఆంధ్ర); మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఆధునిక సాంకేతికతను దృష్టిలో ఉంచుకొని రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ సూచించారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎఫ్.ఎస్.సి.ఎస్. కన్వెన్షన్‌లో ఆత్మ (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ--సూపీూ), వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఎంపీ గోడం నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి, వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని బెట్టను తట్టుకునే రకాలు, తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలు, పంట మార్పిడి విధానాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు పంటల ఎంపిక సమయంలో వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ పరిస్థితులు, విత్తనాల లభ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు వ్యవసాయ, అనుబంధ రంగాల్లో తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని తెలిపారు. దేశంలో వంటనూనెలతో పాటు ఇతర వ్యవసాయ ముడి సరుకుల కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించాలని రైతులకు సూచించారు. నిర్మల్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తుండటం అభినందనీయమని పేర్కొన్న ఎంపీ, రైతుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు, ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించేందుకు కిసాన్ మేళాలు, రైతు సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రబీ సీజన్‌కు రైతులను సన్నద్ధం చేయడంతో పాటు వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు జిల్లా స్థాయి కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఎరువుల సరఫరా, పంటల బీమా, బ్యాంకింగ్ సేవలు, వ్యవసాయ సాంకేతికత, ఆధునిక సాగు విధానాలు తదితర అంశాలపై మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి సంబంధిత అధికారుల నుంచి సమాచారం, సలహాలు పొందాలని సూచించారు. జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే 100 శాతం పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. రైతులు వాస్తవంగా సాగు చేస్తున్న పంటల వివరాలు డిజిటల్‌గా నమోదు కావడం వల్ల పంటల వివరాల్లో మిస్‌మ్యాచ్‌కు అవకాశం తగ్గుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో జిల్లాలో 80 శాతానికి పైగా నమోదు పూర్తయిందని తెలిపారు. రైతుల వివరాలు డిజిటల్‌గా నమోదు చేయడం ద్వారా అర్హులైన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను మరింత పారదర్శకంగా అందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 9,400 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. రానున్న రోజుల్లో మరింత విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలు, పెట్టుబడి సహాయం, మార్కెట్ సమాచారం అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఆత్మ కమిటీ భైంసా డివిజన్ చైర్మన్ వివేకానంద మాట్లాడుతూ, యూరియా సరఫరాకు సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ఆత్మ కమిటీ నిర్మల్ డివిజన్ చైర్మన్ రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆత్మ కమిటీలను మరింత బలోపేతం చేసి రైతులకు సాంకేతిక, శాస్త్రీయ సాగు విధానాలపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కిసాన్ మేళాలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, సహకార, గ్రామీణాభివృద్ధి, అటవీ, మత్స్య, విత్తన కార్పొరేషన్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం తదితర శాఖలు, సంస్థల ఆధ్వర్యంలో వివిధ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఎరువులు, బయో ఫర్టిలైజర్స్, డ్రిప్ ఇరిగేషన్, విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, ఆధునిక సాగు విధానాలు తదితర అంశాలపై స్టాళ్ల నిర్వాహకులు రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలు, అందుబాటులో ఉన్న సేవలు, ఆధునిక సాంకేతికతపై రైతులకు వివరించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు మంజూరైన రెండు ట్రాలీ ఆటోలను లబ్ధిదారులు అనిత, లక్ష్మిలకు ఎంపీ, కలెక్టర్ అందజేశారు. రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల రైతు బీమా చెక్కును అందించారు. కిసాన్ మేళా ద్వారా రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులతో నేరుగా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్లు వివేకానంద, రాంరెడ్డి, సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు భీమ్ రెడ్డి, కళ్యాణ్, ఎఫ్.ఎస్.సి.ఎస్. చైర్మన్ ధర్మాజీ రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఉద్యానవన అధికారి రమణ, పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాం గోపాల్, వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీధర్ చౌహాన్, రాహుల్ విశ్వకర్మ, రాంగోపాల్ వర్మ, దినేష్, సురేష్, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రేమ, పెళ్లి పేరుతో మైనర్ బాలికకు మాయమాటలు!

**- పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఫిర్యాదు**

**- చింతల్‌లోని ఇంటికి పలుమార్లు పిలిపించుకున్నాడని ఆరోపణ**

**- ఫోన్ సంభాషణలతో విషయం వెలుగులోకి.. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు**



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర): ప్రేమ, పెళ్లి పేరుతో మైనర్ బాలికను నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ ఓ యువకుడిపై ఫిర్యాదు అందిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 17 ఏళ్ల బాలిక తొమ్మిదో తరగతి చదువుతోంది. అప్పుడప్పుడు జీడిమెట్లలోని తాత, అమ్మమ్మల ఇంటికి వస్తుంటుంది. సుమారు ఏడాది క్రితం పండుగ సందర్భంగా జీడిమెట్లకు వచ్చిన బాలిక స్థానికంగా ఉన్న ఓ బేకరీకి వెళ్లిన సమయంలో అక్కడ పనిచేస్తున్న చింతల్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన మధు (22)తో పరిచయం ఏర్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ పరిచయం అనంతరం మధు ప్రేమ, పెళ్లి పేరుతో బాలికతో తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడని, ఆమె జీడిమెట్లకు వచ్చినప్పుడల్లా కలిసేవాడని తెలిపారు.

**ఇంటికి పిలిపించుకుని..**

ఫిర్యాదు ప్రకారం.. 2026 మార్చి, మే, జూన్ నెలల్లో మాట్లాడాలంటూ బాలికను మధు తన ఇంటికి పలుమార్లు పిలిపించుకున్నాడని పేర్కొన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాలిక కుటుంబ సభ్యులకు వెల్లడించినట్లు తెలిపారు. మొదట బాలిక నిరాకరించినప్పటికీ మాయమాటలతో ఒప్పించాడని ఫిర్యాదులో ఆరోపించారు.

**ఫోన్ సంభాషణలతో వెలుగులోకి**

ఇటీవల బాలిక ఫోన్‌ను కుటుంబ సభ్యురాలు పరిశీలించడంతో మధుతో జరిగిన సంభాషణలపై అనుమానం వచ్చినట్లు తెలిపారు. బాలికను ప్రశ్నించగా తొలుత భయంతో విషయాన్ని వెల్లడించేందుకు సంకోచించినప్పటికీ.. అనంతరం జరిగిన విషయాలను కుటుంబ సభ్యులకు చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కుటుంబ సభ్యులు జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించి యువకుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

**పోలీసుల దర్యాప్తు**

కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన వివరాలు, ఫోన్ సంభాషణలు తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. బాలిక మైనర్ కావడంతో ఆమె వ్యక్తిగత వివరాలు, గుర్తింపును వెల్లడించకుండా తదుపరి చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

# సిరిసిల్ల అభివృద్ధికి రూ.350 కోట్లతో భారీ అడుగు!

**- సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి సభలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

**- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు**

**- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు.. సందడిగా మారిన సభా ప్రాంగణం**

**- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతల హాజరు**







కుత్బుల్లాపూర్, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి సభా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుమారు రూ.350 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇప్పటికే పూర్తయిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కొత్త పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన పనుల ప్రారంభోత్సవాలతో సభా ప్రాంగణం సందడిగా మారింది. జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిన నేపథ్యంలో భారీగా కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు సభకు తరలివచ్చారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో నాయకులు, కార్యకర్తల సందడి కనిపించింది. అభివృద్ధి కార్యక్రమాల ద్వారా జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, అక్టోబర్ 01 :( విజన్ ఆంధ్ర) నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం బాధ్యతలు స్వీకరించారు. దాదాపు రెండు నెలల పాటు కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రసూతి సెలవులో ఉండగా, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఇంచార్జి కలెక్టర్ గా విధులు నిర్వర్తించారు. సెలవు ముగిసిన మీదట కలెక్టర్ ఇలా త్రిపాఠి తిరిగి నిజామాబాద్ జిల్లా పాలనాధికారిగా బాధ్యతలు చేపట్టారు.

# రాజకీయ లబ్ది కోసమే బహిష్కరణ పేరిట తప్పుడు కేసులు.

**- గ్రామంలో అసలు వీడిసి లేదు.**

**- మహిళలు అని చూడకుండా దాడులు చేస్తున్నారు.**

**- తాళ్ల రాంపూర్ గ్రామస్తుల ఆవేదన**



నిజామాబాద్, అక్టోబర్01:( విజన్ ఆంధ్ర) : రాజకీయాల లబ్ధి కోసమే గౌడ కులస్తులు గ్రామస్తులపైన బహిష్కరణ పేరిట తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలో గత రెండు సంవత్సరాల క్రితం తగాదాలు మొదలయ్యాయన్నారు. జిల్లా అధికారులు,పోలీసులు గ్రామానికి వచ్చి విచారణ చేపట్టి గొడవలు సద్దుమణిగెల చేశారన్నారు. తిరిగి ఇప్పుడు అదే రకమైన ఆరోపణలతో మళ్లీ తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారని,.ఇప్పటికి గ్రామంలో జరిగే ఏ ఉత్సవమైన కలిసికట్టుగా చేసుకుంటామని పేర్కొన్నారు. వారి తప్పుడు ఫిర్యాదు మేరకు మహిళ అని చూడకుండా పోలీసులు విచక్షణరహితంగా దాడి చేశారని విచారం వ్యక్తపరిచారు. గౌడ కులస్తులు ఏది చెప్తే పోలీసులు అది చేస్తున్నారని, మాకు అన్యాయం జరిగిందని ఫిర్యాదులు చేస్తే పట్టించుకోవడం లేదని ఆరోపించారు.కుల బహిష్కరణ,గ్రామ బహిష్కరణ అనేది వట్టిమాటేనని అసలు మా గ్రామంలో వీడిసి అనేది లేదన్నారు.. గ్రామస్థులు ఎవ్వరు కూడా గౌడ కులస్థులను డబ్బులు డిమాండ్ చేయలేదన్నారు. బహిష్కరణ చేశారని ఆరోపణలు చేస్తున్నవారు మా గ్రామంలో అన్ని రకాల పనులు చేసుకుంటూ అనవసరమైన ఆరోపణలు మాపైన రుద్దుతూ తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు.రాజకీయ లబ్ది కోసమే గ్రామంలో నిప్పు రాజేస్తున్నారన్నారు.మా పైన పెట్టిన తప్పుడు కేసులను తక్షణమె ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో క్యాదం దేవేందర్,, బావులు, గుండ్ల ఉషన్న, రాజారాం,శ్రీనివాస్,వడ్ల సుదర్శన్, తెనుగు సత్యనారాయణ, బాలకృష్ణ,లింబవ్వ,లక్ష్మి, లావణ్య, మంజుల,తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

**- ఓటర్లను కార్యాలయాలకు పిలిచి నోటీసులు, పత్రాల స్వీకరణ చేయరాదు**

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



నిర్మల్ జిల్లా,అక్టోబర్ 01,(విజన్ ఆంధ్ర); ఎస్ఐఆర్-2026 ప్రక్రియను భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఎస్ఐఆర్-2026, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు అందుకోవడానికి లేదా అవసరమైన పత్రాలు సమర్పించడానికి కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు ఇకపై సాధారణంగా ఓటర్లను విచారణ (హియరింగ్) కోసం కార్యాలయాలకు పిలవరాదని చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని సీఈఓ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ అవసరం లేకపోయినప్పటికీ, తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం-6, ఫారం-7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని సీఈఓ సూచించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దశను పారదర్శకంగా పూర్తి చేయాలని సీఈఓ తెలిపారు. ఈ వీసీలో భాగంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఎస్ఐఆర్ వివరాలు ఎన్నికల ఉన్నతాధికారులకు వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను మొత్తం నిబంధనల ప్రకారం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విజన్ ఆంధ్ర ఎఫెక్ట్....

# అక్రమాలపై కొరడా...!

### విజన్ ఆంధ్ర కథనానికి స్పందన










కాప్రా/ అక్టోబర్ 01 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి ): ఎట్టకేలకు స్పందన లభించింది అక్రమాలపై అధికారులు కొరడా ఝులిపించారు మీర్ పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారి పక్కన గల వీధిలో నిబంధనలకు విరుద్ధంగా వేలుస్తున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో విజన్ ఆంధ్ర కథనాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. అడ్డు అదుపు లేని అక్రమ నిర్మాణాలు హౌసింగ్ బోర్డ్ డివిజన్ పరిధిలోని జరుగుతున్న అక్రమ నిర్మాణాల విషయాన్ని ప్రచురించింది ఈ నేపథ్యంలో కాప్రా, సర్కిల్ ఎం.ఎం.సీ. అధికారులు స్పందించారు. హౌసింగ్ బోర్డ్ డివిజన్ అక్రమ నిర్మాణలను గురువారం అధికారులు కూల్చారు.

# ఫస్ట్ ఎయిడ్ సెంటర్లపై చర్యలెప్పుడు?

**- 'విజన్ ఆంధ్ర' కథనం వెలువడి రోజులు గడిచినా.. క్షేత్రస్థాయి తనిఖీలపై స్పష్టత కరవు!**

**- రామ్‌రెడ్డి నగర్, సుభాష్‌నగర్‌లో కొనసాగుతున్న కేంద్రాలపై వైద్యశాఖ దృష్టెప్పుడు?**

**- చర్యల జాప్యంపై అనుమానాలు.. లంచాల ఆరోపణలపై వైద్యశాఖ సమాధానం చెప్పాలంటున్న స్థానికులు**







కుత్బుల్లాపూర్, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర): ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల పేరుతో వైద్య సేవలు అందిస్తున్న కేంద్రాలపై 'విజన్ ఆంధ్ర'లో గతంలో కథనం ప్రచురితమైనప్పటికీ, సంబంధిత వైద్యశాఖ అధికారులు ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారా? లేదా? అన్న దానిపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొంపల్లి సర్కిల్ పరిధిలోని రామ్‌రెడ్డి నగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్నట్లు చెబుతున్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్లకు అనుమతులు ఉన్నాయా? అక్కడ వైద్య సేవలు అందిస్తున్న వారికి నిబంధనల ప్రకారం అర్హతలు ఉన్నాయా? మందుల విక్రయాలు నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

### వార్త వెలువడి రోజులు గడిచినా.. తనిఖీలు ఎక్కడ?

గత సెప్టెంబర్ 17న 'విజన్ ఆంధ్ర'లో "ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల ముసుగులో నకిలీ వైద్యం..!" శీర్షికన కథనం ప్రచురితమైంది. రామ్‌రెడ్డి నగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల పేరుతో కొనసాగుతున్నట్లు చెబుతున్న కేంద్రాల నిర్వహణ, అక్కడ వైద్య సేవలు అందిస్తున్న వారి అర్హతలు, మందుల విక్రయాలు తదితర అంశాలపై స్థానికులు వ్యక్తం చేస్తున్న సందేహాలను ఆ కథనంలో ప్రస్తావించారు. కథనం వెలువడిన అనంతరం సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడిస్తారని స్థానికులు భావించారు. అయితే ఇప్పటివరకు తనిఖీలు నిర్వహించినట్లు గానీ, వాటి ఫలితాలను వెల్లడించినట్లు గానీ సమాచారం లేకపోవడంతో అధికారుల స్పందనపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### చర్యలకు ఏమైనా ఒత్తిళ్లు ఉన్నాయా?

ఫస్ట్ ఎయిడ్ సెంటర్లపై తనిఖీలు, చర్యలు చేపట్టడంలో జాప్యం ఎందుకు జరుగుతోందనే దానిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కేంద్రాలపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు ఎవరైనా ఒత్తిడి తెస్తున్నారా? లేక పరిపాలనా కారణాలతో జాప్యం జరుగుతోందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే అధికారులు లేదా ఇతర వ్యక్తులపై ఒత్తిళ్లు ఉన్నాయన్న విషయానికి సంబంధించి ఎలాంటి అధికారిక నిర్ధారణ వెలువడలేదు. ఈ నేపథ్యంలో వైద్యశాఖ అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితిని వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

### లంచాల ఆరోపణలపై వైద్యశాఖ వివరణ ఏంటి?

మరోవైపు, కొందరు స్థానికులు మరింత తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. ఆయా కేంద్రాలపై చర్యలు తీసుకోకపోవడానికి లంచాల వ్యవహారం ఏమైనా కారణమా? అనే అనుమానాలను వారు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇవి స్థానికులు చేస్తున్న ఆరోపణలు మాత్రమేనని, వాటిని నిర్ధారించే ఆధారాలు ప్రస్తుతం బహిరంగంగా లేవని పేర్కొనాల్సి ఉంది. ఈ ఆరోపణలపై సంబంధిత వైద్యశాఖ అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే ఆ విషయాన్ని ప్రజలకు తెలియజేయడంతోపాటు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లపై ఇప్పటివరకు చేపట్టిన తనిఖీలు, తీసుకున్న చర్యల వివరాలను వెల్లడించాలని వారు కోరుతున్నారు.

### అనుమతులు.. అర్హతలపై పరిశీలన ఎప్పుడు?

రామ్‌రెడ్డి నగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్లకు సంబంధించిన అనుమతులు, అక్కడ సేవలందిస్తున్న సిబ్బంది అర్హతలు, మందుల విక్రయాలకు సంబంధించిన నిబంధనలు, అందిస్తున్న వైద్య సేవల స్వరూపాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్న కేంద్రాలపై ఎలాంటి అభ్యంతరం ఉండదని, నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు అంటున్నారు.













### ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశం

వైద్య సేవలకు సంబంధించిన అంశం కావడంతో అధికారులు ఇకనైనా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో ప్రచురితమైన కథనంపై శాఖ అధికారులు ఏమైనా పరిశీలన చేపట్టారా? తనిఖీలు నిర్వహించారా? నిర్వహించి ఉంటే ఏం తేలింది? ఎవరిపైనైనా చర్యలు తీసుకున్నారా? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. ఫస్ట్ ఎయిడ్ సెంటర్లపై వచ్చిన ఆరోపణలు, అనుమతులు, సిబ్బంది అర్హతలు, అధికారులపై వస్తున్న ఒత్తిళ్లు, లంచాల ఆరోపణలపై సంబంధిత వైద్యశాఖ అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వడంతోపాటు వాస్తవాలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

*అధికారుల స్పందన కోసం 'విజన్ ఆంధ్ర' ఎదురుచూస్తోంది.*

# వీడిసి ఆగడాలకు అడ్డుకట్ట వేసేది ఎవరు ?

**- జిల్లాలో మితిమీరుతున్న వీడిసి ఆగడాలు**

**- లోకల్ గవర్నెన్స్ నడుపుతున్న వీడిసిలు**






నిజామాబాద్ అక్టోబర్01:( విజన్ ఆంధ్ర) : జనజీవన స్రవంతిలో ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించింది అయినప్పటికీ గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు సొంత నిర్ణయాలు తీసుకొని ప్రజలకు తాము చెప్పింది వేదం అనే శిలాశాసనాలను వేస్తున్నారు. వాటిని ఉల్లంఘించిన వారిపై కఠిన నిబంధనలను జారీ చేసి జరిమానాల రూపంలో దండుకుంటున్నారు. ఈ తతంగం అంతా జిల్లావ్యాప్తంగా వీడీసీలు చలామణి చేయడం శోచనీయం. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా రోజురోజుకీ వీడీసీ ఆగడాలు మితిమీరుతున్నాయి. ప్రజల చేత ఎన్నుకోబడిన గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచ్ కార్యవర్గ సభ్యులను పక్కనపెట్టి వీడీసీలు గ్రామాలలో లోకల్ గవర్నెన్స్ నడుపుతున్నారు. వారు చెప్పిందే వేదం వారు విధించింది శిక్ష అనే విధంగా రోజురోజుకీ వీడీసీల చర్యలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా కొన్ని చోట్ల విడీసీలు గ్రామాలలో టెండర్లు వేసి అందిన కాడికి దండుకుంటున్నారు. గ్రామం అభివృద్ధి చేయాల్సింది పోయి చిన్న చిన్న తగాదాలను మొదలుకొని కిరాణా దుకాణాలు, కూల్ డ్రింక్స్, మాంసం దుకాణాలు, బెల్ట్ షాపులు తదితరాలను టెండర్ వేసి అమాయక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఆర్మూర్ డివిజన్ పరిధిలోని ఆలూరు మండలం తాళ్ల రాంపూర్ గ్రామంలో గౌడ కులస్తులను గ్రామ బహిష్కరణ చేశారు. ఇట్టి విషయమై బాధితులు కలెక్టర్ సి పి తదితరులకు ఫిర్యాదులు చేశారు. అయినప్పటికీ అధికారులు జాప్యం వలన ఆలస్యంగా కేసులు విధించడం జరిగింది. వీడీసీ సభ్యులు జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చిన తమ ఆగడాలను మాత్రం మర్చిపోలేదు మళ్లీ గౌడ కులస్తులపై పంజా విసరడంతో గౌడ కులస్తులలో భయాందోళనలు కమ్ముకున్నాయి. తమకు న్యాయం చేయాలని మళ్లీ కలెక్టర్ పోలీస్ కమిషనర్లకు ఫిర్యాదు చేస్తూ మీడియా సమావేశం నిర్వహించారు. తాజాగా ఆర్మూరు మండలం పిప్పిరి గ్రామానికి చెందిన గంగయ్య ఎనిమిది సంవత్సరాలుగా కుల బహిష్కరణ చేసి వీడిసి సభ్యులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారికి సహకరించిన వ్యక్తులపై దాడికి తెగబడ్డారు. రాజకీయ బలం ఆర్థిక బలం ఉన్న వీడిసి సభ్యులకు పోలీసులు కూడా సహకరిస్తున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తపరుస్తున్నారు. ఎన్నిసార్లు పోలీస్ స్టేషన్లో చుట్టూ తిరిగిన జరగడం లేదు అని గత ఎనిమిది సంవత్సరాలుగా గ్రామస్తులు ఎవరు తమకు మంచి చెడుకు రావడం లేదని గ్రామంలో తాము అంటరాని వారిగా మిగిలిపోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తాళ్ల రాంపూర్ లో జరిగిన సంఘటన నేపథ్యంలో బాధితులు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగను కలిసి తమకు విడీసీల నుండి హాని ఉందని తమను గ్రామ బహిష్కరణ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వృత్తిపరంగా పనులు చేసుకొనివ్వడం లేదని వీడీసీల ఆగడాలని అరికట్టేందుకు వాటి రద్దుకు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరడంతో తాము సంపూర్ణంగా మద్దతు ఇస్తామని తెలపడంతో గ్రామ కుల బహిష్కరణలకు బలైన బాధితులు ఒక్కొక్కరు బయటకు వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని బయటపెడుతున్నారు. గ్రామాలలో ఏ చిన్న సమస్య జరిగిన తామే ముందుండి సర్పంచ్ ఉప సర్పంచ్ కార్యవర్గ సభ్యులను పక్కనపెట్టి చిన్న తరహా ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా వీడిసి ఆగడాలను అడ్డుకట్ట వేసి సామాన్య మధ్య తరగతి ప్రజలకు న్యాయం చేసే విధంగా అధికారులు రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# తెలంగాణ ఉద్యోగుల ఆశాజ్యోతి ఏలూరి శ్రీనివాసరావు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

**- ఘనంగా వేడుకలు నిర్వహించిన టీజీఓస్ హైదరాబాద్ జిల్లా శాఖ**



తెలంగాణ స్టేట్ బ్యూరో, సెప్టెంబర్ 30 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీఓస్) రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సెక్రటరీ జనరల్, ఉద్యోగుల సంక్షేమమే ఊపిరిగా బతికే నాయకుడు ఏలూరి శ్రీనివాసరావు జన్మదినోత్సవ శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. నిరంతరం ఉద్యోగుల హక్కులు, సంక్షేమమే లక్ష్యంగా, అహర్నిశలు శ్రమిస్తూ, ప్రతి ఒక్క ఉద్యోగికి పెద్దన్నలా అండగా నిలుస్తున్న గొప్ప నాయకుడు ఏలూరి శ్రీనివాసరావు. ఆయన నాయకత్వంలో పనిచేయడం తమకెంతో గర్వకారణమని ఉద్యోగ వర్గాలు కొనియాడుతున్నాయి. ఆయన చూపిస్తున్న మార్గం, చేస్తున్న కృషి, ఆశయాలు ఉద్యోగ వర్గానికి మాత్రమే కాకుండా సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయని ప్రశంసిస్తున్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉంటూ, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఉద్యోగుల పక్షాన మరిన్ని విజయాలు సాధించాలని అభిమానులు, ఉద్యోగులు ఆకాంక్షిస్తున్నారు.

హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘన వేడుకలు

ఏలూరి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను టీజీఓస్ హైదరాబాద్ జిల్లా శాఖ అత్యంత ఘనంగా నిర్వహించింది. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో టీజీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.బి. కృష్ణ యాదవ్, జిల్లా కార్యదర్శి ఎం.ఐ. ఖాదర్, మాజీ జనరల్ సెక్రెటరీ ఏ. సత్యనారాయణ పటేల్, కేంద్ర సంఘ నాయకులు సహదేవ్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రామారావు, వినోద్ కుమార్, వెంకటయ్య, శ్రీరామ్, శ్రీని, లక్ష్మణ్ గౌడ్, విజయ్, వెంకటరమణ, షౌకత్ హుస్సేన్, జిల్లా రెడ్డి, శిరీష రెడ్డి తదితర నాయకులు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేశారు.

# చిన్న కాళ్లకు పెద్ద బూట్లు.. గద్వాలలో విద్యార్థుల అవస్థలు

**- రేవంత్ సర్కార్ నిర్లక్ష్యానికి నిదర్శనం**



తెలంగాణ స్టేట్ బ్యూరో,జోగులాంబ గద్వాల, అక్టోబర్ 01 (విజన్ ఆంధ్ర): తెలంగాణలో విద్యా వ్యవస్థ తీరుకు అద్దం పడుతోంది గద్వాల జిల్లా ఘటన. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే సౌకర్యాల్లో అడుగడుగునా నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం తుమ్మిళ్ల ప్రాథమికోన్నత పాఠశాలలో దారుణ పరిస్థితి నెలకొంది. ఒకటో తరగతి చిన్నారులకు ప్రభుత్వం పంపిణీ చేసిన బూట్లు వారి కాళ్ల సైజు కంటే రెండు, మూడు రెట్లు పెద్దగా ఉండటంతో చిన్నారులు నడవలేక అవస్థలు పడుతున్నారు. బూట్లు వదులుగా ఉండటంతో కిందపడిపోతున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

**33 వేల మందికి ఒకే సైజు బూట్లు!**

ఇది ఒక్క స్కూల్ సమస్య కాదు.. జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న సుమారు 33 వేల మంది విద్యార్థులకు ఇదే సైజు బూట్లను గుత్తేదారు సరఫరా చేసినట్లు సమాచారం. విద్యార్థుల కాళ్ల కొలతలు తీసుకోకుండా, వయసు వారీగా సైజులను పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టానుసారంగా బూట్లు సరఫరా చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**తల్లిదండ్రుల ఆగ్రహం..**

"చిన్న పిల్లల కాళ్లకు పెద్ద బూట్లు ఇస్తే వాళ్లు ఎలా నడుస్తారు? ఇది పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకోవడమే" అంటూ తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యారంగంపై దృష్టి పెట్టడం లేదని, గుత్తేదారులకు లాభం చేకూర్చేందుకే నాసిరకం, సరికాని సైజు బూట్లు ఇస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చిన్నారులకు సరైన సైజు బూట్లు అందించాలని, బాధ్యులైన గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# కందకం కూరగాయల మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలి

**- వారాంతపు సంతను ఇక్కడికే తరలించండి**

**- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**




వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద నిరుపయోగంగా ఉన్న కందకం కూరగాయల మార్కెట్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకువచ్చేలా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక అధికారులతో కలిసి కందకం కూరగాయల మార్కెట్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. మార్కెట్ నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి రాకుండా పడి ఉందంటూ అందిన ఫిర్యాదులపై కలెక్టర్ స్పందించారు. మార్కెట్‌లోని వసతులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి, అది అందుబాటులోకి రాకపోవడానికి గల కారణాలను అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి మార్కెట్ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలను పూర్తిగా పరిశుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ వంటి కనీస వసతులు కల్పించాలని, ప్రస్తుతం పట్టణంలో వేర్వేరుగా నిర్వహిస్తున్న వారాంతపు సంతను కందకం కూరగాయల మార్కెట్‌కు తరలించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వారాంతపు సంతను ఇక్కడికి తరలించిన తర్వాత, మిగిలిన పెండింగ్ పనులను కూడా పూర్తి చేసి ప్రజలకు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. మార్కెట్‌ను ప్రజలకు ఉపయోగపడేలా చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పంపిణీలో 'మేఘా' మార్క్

**- రాష్ట్రంలోనే వనపర్తికి రెండో స్థానం!**

**- 34 నెలల్లో దాదాపు రూ.20 కోట్ల సీఎంఆర్ఎఫ్ సహాయం**

**- 469 మందికి రూ.9.18 కోట్ల విలువైన ఎల్ఓసీ మంజూరు**

**- హైదరాబాద్, వనపర్తిలో ప్రత్యేక సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ**



పార్టీలకతీతంగా నిరుపేదలకు వైద్య సహాయం : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి





వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 01 (విజన్ ఆంధ్ర) : పేద కుటుంబంలో తీవ్ర అనారోగ్యం వస్తే ఆ కుటుంబం ఆర్థికంగా దివాళా తీసే పరిస్థితులు ఏర్పడతాయి. ఆసుపత్రి ఖర్చులు భరించలేక, నిరంతరం అప్పులపాలవుతున్న బాధితులకు 'ముఖ్యమంత్రి సహాయ నిధి' 'లెటర్ ఆఫ్ క్రెడిట్' ల ద్వారా కొండంత అండగా నిలుస్తున్నారు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి. సీఎంఆర్ఎఫ్ పంపిణీలో అత్యంత సమర్థవంతంగా పనిచేస్తూ, రాష్ట్రంలోనే వనపర్తి నియోజకవర్గాన్ని రెండో స్థానంలో నిలిపారు.

***7,872 మందికి రూ.20 కోట్ల వైద్య సాయం***

గడచిన 34 నెలల కాలంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా అర్హులైన 7,872 మంది లబ్ధిదారులకు రూ.19,98,40,700 (దాదాపు రూ.20 కోట్లు) నిధులను నేరుగా అందించారు. అత్యవసరంగా ఖరీదైన చికిత్సలు అవసరమైన ప్రతికూల పరిస్థితుల్లో 469 మంది బాధితులకు రూ. 9,18,50,000 విలువైన ఎల్‌వోసీ పత్రాలను మంజూరు చేయించి ప్రాణదాతగా నిలిచారు. రూ.10 వేల నుంచి రూ.5-6 లక్షల వరకు సాయం అందిస్తూ పేద కుటుంబాలకు వైద్య భారం తగ్గించడంలో ఎమ్మెల్యే కార్యాలయం కీలక పాత్ర పోషిస్తోంది.

***వనపర్తి నుంచి హైదరాబాద్ వరకు ప్రత్యేక వ్యవస్థ***

సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజలు సచివాలయం లేదా ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా వనపర్తి మరియు హైదరాబాద్‌లలో ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. బాధితుడు ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పూర్తయి క్షేమంగా ఇంటికి చేరేవరకు ఈ ప్రత్యేక సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ప్రతి నెలా దాదాపు 1,200 నుంచి 1,500 సీఎంఆర్ఎఫ్ ఆన్‌లైన్ దరఖాస్తులను ఎక్కడా ఆలస్యం కాకుండా ప్రాసెస్ చేస్తున్నారు. ప్రతి నెలా 15 నుంచి 20 ఎల్‌వోసీ కేసులను తక్షణమే పరిష్కరించి చికిత్స అందేలా చూస్తున్నారు.

***పార్టీలకతీతంగా పేదల సేవ***

రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి సాయం అందాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పష్టం చేశారు. "అనారోగ్యం వస్తే డబ్బుల కొరతతో ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదు. ప్రభుత్వం అందించే సహాయాన్ని బాధితులకు సకాలంలో చేర్చడమే మా ప్రాధాన్యం" అని తెలిపారు. ప్రతి దరఖాస్తును ఒక కాగితంగా కాకుండా ఒక కుటుంబ ఆవేదనగా చూస్తూ అందిస్తున్న ఈ

# యాపర్ల పాఠశాలలో ఘనంగా 'ఏక్ పేడ్ మా కే నామ్'

## పుట్టినరోజు వేడుకలో అమ్మ పేరు మీద మొక్క నాటిన విద్యార్థి



వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం యాపర్ల ప్రాథమిక పాఠశాలలో 'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ కోసం ఒక మొక్క) కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి వెంకటకృష్ణ పుట్టినరోజును పురస్కరించుకుని, తన తల్లి స్వాతి పేరు మీద పాఠశాల ఆవరణలో ఒక మొక్కను నాటారు. ఈ మొక్క సంరక్షణ బాధ్యతను విద్యార్థి తండ్రి రామకృష్ణ, అమ్మమ్మ కుసుమకుమారిల సమక్షంలో స్వీకరించారు.

పర్యావరణ స్పృహ పెంచడమే లక్ష్యం

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం) హుస్సేన్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణతో పాటు మొక్కలపై ప్రేమను పెంపొందించేందుకే పాఠశాలలో 'అమ్మ కోసం ఒక మొక్క' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దీని ద్వారా చిన్నతనం నుంచే విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెరుగుతుందన్నారు.

వర్షాభావాన్ని ఎదుర్కొందాం

పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు మురళీకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులందరూ ఇదే రీతిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్వీకరిస్తే, రాబోయే కాలంలో వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని అభివృద్ధికి బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. సహ ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు వేడుకలను మొక్కలు నాటడం ద్వారానే ప్రారంభించాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యకరమైన భారతావని నిర్మాణానికి కృషి

నెలవారీ హెల్త్ చెకప్‌లో భాగంగా పాఠశాలకు విచ్చేసిన ఆర్బీఎస్కే డాక్టర్ స్వాతి ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులందరూ మొక్కలు పెంచే బాధ్యతను స్వీకరించి, పచ్చదనంతో కూడిన ఆరోగ్యవంతమైన భారతావనిని నిర్మించాలని కోరారు. ?ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం

వనపర్తిలో 'స్వచ్ఛతా హి సేవా', 'సఫాయి మిత్ర సురక్ష శిబిరం'

# తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- ఆస్తులు ముందే రాసివ్వకుండా వీలునామా రాస్తే మేలు**

**- వనపర్తిలో వైభవంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం**






వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబరు 1 (విజన్ ఆంధ్ర) మన సృష్టికి మూలకారకులైన తల్లిదండ్రులను దేవుళ్లతో సమానంగా పూజించాలని, వృద్ధాప్యంలో వారిని సరిగ్గా చూసుకోకపోతే సంరక్షణ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. గురువారం జిల్లా సంక్షేమ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ' ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 1 వరకు వారోత్సవాలుగా ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు.

***ఆస్తులు ముందే రాసివ్వొద్దు!***

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ ఆస్తులన్నింటినీ బతికున్నప్పుడే పిల్లల పేరిట రిజిస్ట్రేషన్ చేసి, ఆ తర్వాత సంరక్షణ కరువై ఇబ్బందులు పడుతుండటం విచారకరమన్నారు. ఆస్తులను ముందే పిల్లలకు ఇవ్వకుండా, తమ తదనంతరం వారసులకు చెందేలా వీలునామా (విల్) రాస్తే బాధ్యతగా చూసుకుంటారని సూచించారు. జిల్లాలో పిల్లల నిర్లక్ష్యంపై ఆర్‌డీవో కార్యాలయానికి ఇప్పటివరకు 169 ఫిర్యాదులు రాగా, వాటిలో 115 పరిష్కరించామని వెల్లడించారు. తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకోని పిల్లలపై ఆర్‌డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

రీక్రియేషన్ సెంటర్ పట్టణంలోకి మార్పు

వృద్ధాప్యంలో ఆరోగ్య పరిరక్షణకు యోగా, వ్యాయామం, పౌష్టికాహారం తప్పనిసరని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని స్పెషల్ సెల్ ద్వారా బిపి, షుగర్ వ్యాధులకు ఉచిత వైద్యంతో పాటు మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వనపర్తి పట్టణానికి కాస్త దూరంగా ఉన్న వయోవృద్ధుల రీక్రియేషన్ సెంటర్‌ను అందరికీ అందుబాటులో ఉండేలా త్వరలోనే పట్టణంలోకి మార్చాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు.

***మోసపోతే 1930కి కాల్ చేయండి***

***డీఎస్పీ బాలాజీ నాయక్***

కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. పిల్లల నుండి వేధింపులు ఎదురైతే వయోవృద్ధులు 14567 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పెన్షన్ల నెపంతో ఓటీపీలు అడిగి నగదు తస్కరించే సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ మోసపోతే వెంటనే 1930 కు సమాచారం అందించాలని సూచించారు. ?అనంతరం పలువురు వయోవృద్ధులను కలెక్టర్ చేతుల మీదుగా శాలువాలు కప్పి, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో యాదయ్య, ఆర్‌డీవో సుబ్రహ్మణ్యం, సెర్ప్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లింగయ్య గౌడ్, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బి. ఇందిర, సీనియర్ సిటిజన్స్ కమిటీ సభ్యులు నాగేంద్రస్వామి, 'అమ్మ' స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చిన్నమ్మ థామస్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టల్ ప్రాంగణంలో అధికారుల శ్రమదానం






వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 1(విజన్ ఆంధ్ర) : సమాజ పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్ తెలిపారు. గురువారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్, ప్రాంతీయ కార్యాలయాల సూచనల మేరకు లీడ్ బ్యాంక్ కార్యాలయం, బీసీ సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో భాగంగా 'ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్' శ్రమదానం మరియు 'సఫాయి మిత్ర సురక్ష శిబిరాన్ని' నిర్వహించారు.?కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల వెనుక ఉన్న బీసీ బాలుర వసతి గృహ ప్రాంగణంలో అధికారులు, సిబ్బంది కలిసి శ్రమదానం చేపట్టారు. హాస్టల్ ఆవరణలోని చెత్తను తొలగించి, డ్రైనేజీ కాలువలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని, స్వచ్ఛ వనపర్తి నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.?అనంతరం నిర్వహించిన 'సఫాయి మిత్ర సురక్ష శిబిరం'లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ లోకేష్, ఐడీఓసీ బ్రాంచ్ మేనేజర్ వినయ్ కుమార్, ఏఎల్‌డీఎం సాయికుమార్ పారిశుద్ధ్య కార్మికులకు ఆర్థిక సాధికారతపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, జనధన్ ఖాతాలు, డిజిటల్ బ్యాంకింగ్ మరియు పొదుపు పథకాలను ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.?ఈ శిబిరంలో కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ, భద్రతా చర్యలతో పాటు సామాజిక భద్రతా పథకాలపై సమగ్ర అవగాహన కల్పించారు. సీ.ఎఫ్.ఎల్. సిబ్బంది, ఎఫ్.ఎల్.సి. కౌన్సిలర్లు డిజిటల్ లావాదేవీలు, ఆర్థిక అక్షరాస్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారిణి పరిమళ, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, ప్రజాప్రతినిధులు, బ్యాంకింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను వేగవంతం చేయాలి

**- రైతులకు ఇబ్బందులు కలగకుండా చూసే బాధ్యత అధికారులదే**

**- గురుకులాల్లో నాణ్యమైన విద్య, వసతులు అందించాలి**

**- ఆకస్మిక తనిఖీలు చేసిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రామన్నపేట గ్రామంలో చేపడుతున్న భూ రీ-సర్వే ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం ఆయన రామన్నపేట గ్రామంలో సాగుతున్న రీ-సర్వేను నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సమస్యలను సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత కాలమితిలోగా సర్వే ప్రక్రియను ముగించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

***పెండింగ్ రెవెన్యూ సమస్యలపై సమీక్ష***

అనంతరం పెబ్బేరు తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్, కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులు, సాదాబైనామా, ప్రజావాణి వినతుల పురోగతిపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ



సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేశారు.

***గురుకుల పాఠశాలల తనిఖీ - విద్యార్థులతో మధ్యాహ్న భోజనం***

అనంతరం కొత్తకోట మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను, మదనాపురం మండల పరిధిలోని బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. తరగతి గదులు, వసతి గృహాలు, మౌలిక సదుపాయాల స్థితిగతులను పరిశీలించారు. మదనాపురం బాలుర గురుకులంలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసి, ఆహార నాణ్యతను స్వయంగా పరీక్షించారు. ?విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పాఠశాల ప్రాంగణాల్లో పారిశుద్ధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, సదుపాయాలు కల్పించడంలో ఎలాంటి అలసత్వం వహించవద్దని స్పష్టం చేశారు. ?ఈ కార్యక్రమాల్లో పెబ్బేరు తహశీల్దార్ సత్యనారాయణ రెడ్డితో పాటు వివిధ మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వయస్సు శరీరానికే.. మనసుకు కాదు - అదనపు కలెక్టర్ సంపత్ రావు.

ములుగు అక్టోబర్ 01, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వృద్ధుల అనుభవమే సమాజానికి మార్గదర్శకమని జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు అన్నారు. వయస్సు శరీరానికి మాత్రమేనని, మనసుకు వయస్సుతో సంబంధం లేదని పేర్కొన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ములుగు కలెక్టరేట్ లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వృద్ధులు డే కేర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కుటుంబ సభ్యులు వృద్ధుల ఆరోగ్యం, భద్రతపై శ్రద్ధ చూపాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రకళ, వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్ మాట్లాడుతూ ...... వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అనంతరం వృద్ధులను సన్మానించి, క్రీడల విజేతలకు బహుమతులు అందజేశారు.



# హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో భారీ పునర్వ్యవస్థీకరణ

## - 76 ప్రాంతాల పరిధులు మార్పు






**తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 01,:విజన్ ఆంధ్ర :**

తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగర పోలీస్ వ్యవస్థలో భారీ మార్పులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో జోన్లు, డివిజన్లు, పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ చేపడుతూ ప్రభుత్వం ష్ట్రీజూ://+.నా.వీం.చీశీ.84 ను జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో మొత్తం 76 ప్రాంతాలపై మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇందులో భాగంగా కొన్ని పోలీస్ స్టేషన్ల పరిధులను ఇతర జోన్లు, డివిజన్లకు బదిలీ చేయనున్నారు.

**మార్కెట్ నుండి మల్కాజిగిరికి:**

మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలను మల్కాజిగిరి కమిషనరేట్ కు బదిలీ చేశారు. అలాగే మహేశ్వరం, శంషాబాద్, సైబరాబాద్ పరిధుల్లోనూ సరిహద్దులను పునర్వ్యవస్థీకరించారు.

**పేరు మారిన పోలీస్ స్టేషన్:**

ఈ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆర్ జీఐఏ పోలీస్ స్టేషన్ పేరును శంషాబాద్ పోలీస్ స్టేషన్ గా మార్పు చేశారు. శంషాబాద్ డివిజన్ లో ఆర్ జీఐఏ పీఎస్, శంషాబాద్ పీఎస్ ల పరిధులను విడదీసి పునర్వ్యవస్థీకరించారు.

నగరంలోని కీలక ప్రాంతాల్లో మార్పులు:

రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో, అబ్దుల్లాపూర్ మెట్, మీర్ పేట్ ప్రాంతాల పోలీస్ పరిధుల్లో మార్పులు చేశారు. అంతేకాకుండా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్ నగర్ వంటి హై ప్రొఫైల్ ప్రాంతాల్లోనూ పరిధుల పునర్విభజన జరిగింది.

**అన్ని విభాగాల్లో ప్రక్షాళన:**

ఈ మార్పులు కేవలం శాంతి భద్రతలకే పరిమితం కాలేదు. ట్రాఫిక్ పోలీస్ పరిధిలోనూ జోన్లు, డివిజన్ల పునర్వ్యవస్థీకరణ జరిగింది. మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన వుమెన్ సేఫ్టీ వింగ్ పరిధిలోనూ కొత్తగా జోన్ల కేటాయింపు జరిగింది. అంతేకాకుండా జోనల్ సైబర్ సెల్ పరిధులను కూడా పునర్వ్యవస్థీకరించినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ భారీ పునర్వ్యవస్థీకరణతో నగరంలో నేర నియంత్రణ మరింత సమర్థవంతంగా జరగనుందని, పరిపాలన సౌలభ్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

# నూతన బస్టాండ్ నిర్మాణం రాజకీయ రంగులు..!

- **అభివృద్ధిలో ఆటంకం గ్రామ సర్పంచ్ యేన..?**
- **నూతన బస్టాండ్ పై గ్రామ తీర్మానం ఏమైంది..?**
- **తేదీ మారిన ప్రారంభం గానీ నూతన బస్టాండ్ నిర్మాణం..!**
- **అధికారం నిర్లక్ష్యానికి..! ఐటీ మినిస్టర్ సమాధానమేంటి..?**
- **మాటలకెనా ఐటీ మినిస్టర్..? ప్రతిపక్షాలు..!**

**మహాదేవపూర్ అక్టోబర్ 01 (విజన్ ఆంధ్ర)**




కాళేశ్వరంలోని నూతన బస్టాండ్ నిర్మాణంలో రాజకీయ రంగులు పొలుముకుంటున్నాయని స్థానికుల వినికిడి వినిపిస్తున్నాయి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపురం మండలం కాళేశ్వరం గ్రామంలోని నూతన బస్టాండ్ నిర్మాణం కోసం ఐటి మినిస్టర్ 3.96 కోట్ల నిధులను మంజూరు చేశారు ఇటీవల ఐటి మినిస్టర్ కాళేశ్వర ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణలో భాగంగా 129 సర్వే నెంబర్లు ఫారెస్ట్ ప్రభుత్వ భూమిలో గత నెల 27వ తేదీన నూతన బస్టాండ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని తెలియచేసారు కానీ అధికారులు నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారంటు ప్రతిపక్షాలు ప్రభుత్వని హేళన చేస్తున్నాయి. ఉన్నత వర్గాలు బడా నాయకులు ఫోన్ చేసి మేము ఐటి మినిస్టర్ ని కలిసేందుకు సన్నతమవుతున్నామని కొంత కాలం బస్టాండ్ నిర్మాణ పనుల్లో జాప్యం చేయాకొడదాని సంబంధిత అధికారులకు ఆదేశాలు సూచనలు ఇచ్చినట్టు స్థానికుల నుండి ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణలు కాస్త వాస్తవాలు అవుతున్నాయని నూతన బస్టాండ్ పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని ప్రతిపక్షాలు ఆగ్రహిస్తున్నారు


9 విజన్ ఆంధ్ర శనివారం 8-08-2026

కాళేశ్వరంలో నూతన బస్టాండ్ నిర్మాణం చేర్చనీయాంశం..!

విజన్ ఆంధ్ర 08 Aug 2026 - Page 9


విజన్ ఆంధ్ర

కాళేశ్వరం నూతన బస్టాండ్ కొలిక్కి వచ్చేనా..?

ఐటీ మంత్రి ఆదేశించిన..! సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఏంటి..?

**నూతన బస్టాండ్ పై గ్రామ తీర్మానం ఏమైంది..?**

నూతన బస్టాండ్ నిర్మాణం నిధులు మంజూరు అయ్యి టెండర్ పూర్తి అయిన సివిల్ ఇంజనీరింగ్ అధికారులు స్థానిక కాళేశ్వర సర్పంచిని ఆశ్రయించి గ్రామ తీర్మానం కోసమని అడగగా 129 సర్వే నెంబర్లు లో ఫారెస్ట్ భూమిలో నూతన బస్టాండ్ నిర్మాణకి స్థానిక సర్పంచి నిరాకరించినట్టు స్థానిక గ్రామ ప్రజల్లో నుండి ఆరోపణలు వస్తున్నాయి

**అభివృద్ధిలో ఆటంకం గ్రామ సర్పంచ్ యేన..?**

సెప్టెంబర్ 27 న ముహూర్తం ఖరారు అయినా విషయం అందరికి తెలిసిందే కానీ అక్కడ ప్రయాణ ప్రాంగణ నిర్మాణం జరిగితే ప్రస్తుత ప్రయాణ ప్రాంగణ నుంచి గోదావరి ఘాట్ వరకు ఉన్న కొంత మంది నాయకులు, బడ వ్యాపార వేత్తలు తమకు ఆదాయం రాకుండా పోతుంది అనే కుట్రతో ఊరిలో ఉన్న సర్పంచ్ తో సంప్రదింపులు జరిపినట్టు ఊరి ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. అందరూ కూడా ఉన్నత వర్గానికి చెందిన వారు కాబట్టి పేదలకు మేలు జరిగితే చూసి ఓర్వలేక కావాలనే ప్రయాణ ప్రాంగనానికి గ్రామ పంచాయితీ నుంచి అనుమతులు ఇవ్వటం లేదనే వార్త ఊరిలో. బాగా వినిపిస్తుంది. గ్రామ సర్పంచ్ తన స్వంత గృహానికి దగ్గర ప్రయాణ ప్రాంగణం ఉండాలనే కుట్రతో పెద ప్రజల జీవితం మారే అవకాశాన్ని చూసి జీర్ణించుకోలేక తన ఇంటి దగ్గరే ప్రయాణ ప్రాంగణం ఉండాలని ఇది అంత చేస్తున్నారని ప్రజలు, ప్రతిపక్షలు ఆరోపిస్తున్నారు. విటన్నిటికీ ఐటీ మంత్రివర్యులే సమాధానం చెప్పాలి..? పేద ప్రజల.. పెత్తన్దర్ల అనే విషయం పై చూడాలి..!ఎం జరుగుతుందో....?

**మాటలకైనా ఐటీ మినిస్టర్..? ప్రతిపక్షాలు..!**

కాళేశ్వరం నూతన బస్టాండ్ నిర్మాణం జరిగితే కాళేశ్వరం చాలా అభివృద్ధి చెందుతుందని ఐటీ మినిస్టర్ చెప్పారు కానీ కొందరు స్వార్ధపర రాజకీయ నాయకులు అడ్డుకుంటున్నారని ఐటీ మినిస్టర్ కి ఈ విషయం తెలియదా..? ఐటి మినిస్టర్ చెప్పిన గడువు ముగిసిన అధికారుల నిర్లక్ష్యం కారణమేంటో..? ఐటి మినిస్టర్ సమాధానం ఇవ్వాలని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి..!

**భూపాలపల్లి ఆర్టీసీ డిఎం ని సంప్రదించగా**

నూతన బస్టాండ్ నిర్మాణం టెండర్లు పూర్తయి సివిల్ ఇంజనీరింగ్ అధికారులు స్థానిక సర్పంచ్ తో మాట్లాడితే స్థానిక సర్పంచ్ నేను ఐటీ మినిస్టర్ తో మాట్లాడుతా నేను అర్జెంటుగా పర్మిషన్ ఇవ్వను మాకు టైమ్ కావాలి అని లేకపోతే ఉన్న బస్టాండ్ ని మాడన్ బస్టాండ్ గా తీర్చిదిద్దాలని లేదా 141 సర్వేనెంబర్ లోని చార్కుంట లో నూతన బస్టాండ్ నిర్మాణం చేయాలని స్థానిక సర్పంచి సమాధానమిచ్చారని ఆర్టీసీ డిఎం అధికారి ఫోన్ కాల్ లో సమాధానం ఇచ్చారు..

# అటవీ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- **అక్రమ మైనింగ్, ఇసుక తవ్వకాలు, చెట్ల నరికివేతను అరికట్టాలి**
- **జిల్లాలో 521 వెట్‌ల్యాండ్స్ గుర్తింపు.. క్షేత్రస్థాయి పరిశీలనకు కలెక్టర్ ఆదేశాలు**

మహబూబ్‌నగర్, అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర): జిల్లాలో అటవీ ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలను అరికట్టడంతో పాటు అటవీ భూములను పరిరక్షించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. అటవీ భూముల పరిరక్షణ, వెట్‌ల్యాండ్స్ గుర్తింపు, ప్రభుత్వ భూముల కేటాయింపు తదితర అంశాలపై గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అటవీ, రెవెన్యూ, ఇతర సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్, ఇసుక తవ్వకాలు, చెట్ల నరికివేత వంటి కార్యకలాపాలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. అటవీ ప్రాంతాల్లో రెవెన్యూ పట్టాల పరిధిలో ఉన్న భూముల వివరాలను మండలాల వారీగా పరిశీలించి, పూర్తి సమాచారంతో నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

***521 వెట్‌ల్యాండ్స్‌పై ప్రత్యేక దృష్టి***

జిల్లాలో గుర్తించిన 521 వెట్‌ల్యాండ్స్‌లో ఇప్పటివరకు ఆరు వెట్‌ల్యాండ్స్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన వెట్‌ల్యాండ్స్‌ను డిమార్కేషన్ చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.



***రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వ భూముల గుర్తింపు***

కోడంగల్--కోస్గి రహదారికి సంబంధించి వెంకటాపూర్ గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 23లో జాతీయ రహదారుల శాఖకు కేటాయించిన ప్రభుత్వ భూమిపై ఉన్న వివాదాలను పరిశీలించి స్పష్టమైన నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, కొత్తగా మంజూరైన గుడేబల్లూర్ వరకు రహదారి నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూమిని గుర్తించి, సంబంధిత శాఖకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

***పిల్లలమర్రి అంశంపై క్షేత్రస్థాయి పరిశీలన***

పిల్లలమర్రి ప్రాంతానికి సంబంధించిన అంశాలపై పర్యాటక శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలన జరిపి, నివేదికలను ధ్రువీకరించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డి. జానకి, జిల్లా అటవీ శాఖ అధికారి ఎం. నవీన్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, ఆర్డీవో నవీన్, సంబంధిత రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.




# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట - జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 1)విజన్ ఆంధ్ర)వయోవృద్ధుల సంక్షేమం, భద్రతకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా వృద్ధాశ్రమం, ప్రణాం డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వారికి మెడికల్ హెల్ప్ క్యాంపులు, కంటి పరీక్షలు, ప్రభుత్వ పరంగా అందవలసిన పుస్తకాలు, సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులు లేదా ప్రజాప్రతినిధులు ఎవరైనా సరే తమ తల్లిదండ్రులను, వయోవృద్ధులను సరిగా చూసుకోకపోతే కఠిన చర్యలు



తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. బాధ్యత విస్మరించి వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే, వారి జీతం నుంచి ఆటోమేటిక్‌గా కోత విధించి నేరుగా వృద్ధులకు అందించేలా చట్టపరమైన నిర్ణయం తీసుకున్నామని, ఇది ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదం పొంది అమల్లోకి వచ్చిందని తెలిపారు. అదేవిధంగా, గతంలో భావోద్వేగంతో పిల్లలకు రాసిచ్చిన భూములను.. ఆ తర్వాత వారు సరిగ్గా చూసుకోకపోతే తిరిగి వెనక్కి పొందేలా చట్టంలో వెసులుబాటు ఉందని అన్నారు. ఇలాంటి సమస్యలు ఎదురైతే వయోవృద్ధులు నేరుగా తనకు దరఖాస్తు చేసుకోవచ్చని, వెంటనే స్పందించి న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. జపాన్ తరహాలో రాబోయే రోజుల్లో మన దేశంలోనూ వయోవృద్ధుల సంఖ్య పెరుగుతుందని, ఆ సమాజానికి తగినట్లుగా వారి ఆరోగ్యం, డే కేర్ కార్యకలాపాలు, రక్షణ బాధ్యతలను ప్రతి ఒక్కరూ విస్మరించకుండా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు వయోవృద్ధులను కలెక్టర్ శాలువాతో సత్కరించి, మోమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, వయోవృద్ధుల సమైక్య ప్రతినిధులు దేవిదాస్ దేశ్పాండే, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వయోవృద్ధులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివితే ఉద్యోగం సాధించడం తథ్యం

- **ఉచిత శిక్షణ పొందుతున్న 300 కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అంద జేసిన ఎస్పీ అఖిల్ మహాజన్**
- **ప్రతిరోజు బోధించిన అంశాలను సొంతంగా రివిజన్ చేసుకోవాలి**
- **పరీక్ష వరకు ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలని అభ్యర్థులకు సూచన**

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 1 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆదిలాబాద్ డిటిసి కేంద్రంలో కానిస్టేబుల్, ఎస్సై ప్రాథమిక పరీక్షలకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణలో సుమారు 380 మంది అభ్యర్థులు ప్రతిరోజూ పాల్గొంటున్నారు. ఈ శిక్షణ గత నెల ఏడవ తారీఖున ప్రారంభమై 60 రోజులపాటు కొనసాగుతుంది. ఇందులో భాగంగా గురువారం ఆదిలాబాద్ డీటీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించి, అభ్యర్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కష్టపడి చదివితే ఉద్యోగం సాధించడం తథ్యమని, ప్రతి అభ్యర్థి లక్ష్యంపై



దృష్టి సారించి క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ప్రతిరోజూ తరగతుల్లో బోధించిన అంశాలను అదే రోజు సొంతంగా రివిజన్ చేసుకోవాలని తెలిపారు. పరీక్ష రాసే వరకు ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ పరీక్షలకు అనుగుణంగా అర్థమెటిక్, రీజనింగ్, జనరల్ స్టడీస్, హిస్టరీ, పాలిటీ, ఇంగ్లీష్, మెంటల్ ఎబిలిటీ తదితర అంశాలతో రూపొందించిన నూతన స్టడీ మెటీరియల్‌ను తెలుగు, ఇంగ్లీష్ మీడియాల్లో సుమారు 300 మంది అభ్యర్థులకు అందజేశారు. అభ్యర్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని



ప్రాథమిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖలో చేరాలనే లక్ష్యంతో శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్కరూ పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగాలని, రానున్న ప్రాథమిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన పి. మౌనిక ఐపీఎస్, ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు, ఆదిలాబాద్ రూరల్ ఎస్సై లు వి. విష్ణువర్ధన్, ప్రవీణ్, అపరాజిత ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకుడు సాయి ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.